
# Crime News ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

మంగళవారం, జూన్ 16, 2026 | సంపుటి - 20 | సంచిక 263 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## కేరళలో నిఫా వైరస్
# కలకలం




**కోజికోడ్ జిల్లాలో ఒక వ్యక్తికి నిఫా వైరస్ నిర్ధారణ**

**మెడికల్ కాలేజీ ఐసియూలో చికిత్స**

**కేరళలో వైరస్ భయంతో అప్రమత్తం అయిన తమిళనాడు**

తిరువనంతపురం : దక్షిణ భారత రాష్ట్రాల్లో మరోసారి నిఫా వైరస్ భయం నెలకొంది. కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఒక వ్యక్తికి నిఫా వైరస్ సోకినట్లు నిర్ధారణ కావడంతో రాష్ట్ర యంత్రాంగం అత్యవసర చర్యలు చేపట్టింది. కోజికోడ్ లోని రమణట్టుకర మున్సిపాలిటీ పరిధికి చెందిన 43 ఏళ్ల వ్యక్తి ప్రస్తుతం కోజికోడ్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలోని ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. పూణెలోని జాతీయ వైరాలజీ సంస్థ నుంచి వైరస్ నిర్ధారణ నివేదిక అందిన వెంటనే కేరళ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలను 2లో

## ఇరాన్‌తో కుదిరిన
# శాంతి ఒప్పందం



**ట్రూత్ సోషల్ మీడియాలో ప్రకటించిన ట్రంప్**

**ఒప్పందాన్ని స్వాగతించిన ప్రపంచ దేశాలు**

వాషింగ్టన్ : పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది. అమెరికా-ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. ఈ వారం చివర్లో దీనిపై సంతకాలు జరగనున్నాయి. మూడు నెలలకు పైగా సాగిన యుద్ధం ముగిసి పోవడంతో భారత్ సహా ప్రపంచదేశాలు హర్షం వ్యక్తంచేశాయి. ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. పశ్చిమాసియాలో సుస్థిర శాంతి నెలకొనాలని ఆకాంక్షించాయి. నెలల తరబడి ఉత్కంఠ రేపిన పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరిన చరిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని ప్రపంచ దేశాలు ఏకగ్రీవంగా స్వాగతించాయి.

తరువాయి 2లో

## హైదరాబాద్ అభివృద్ధిని
# విస్మరించిన కేంద్రమంత్రి

**మెట్రో విస్తరణకు మోకాలడ్డిన కిషన్ రెడ్డి**

**కెసిఆర్ కనుసన్నల్లో పనిచేస్తున్న గంగాపురం**

- ఎన్‌వోసి ఇప్పించడంలో కూడా విఫలం
- ఎల్ అండ్ టికి రుణ బదలాయంపును అడ్డుకున్న పెద్దమనిషి
- అభివృద్ధి జరిగితే పుట్టగతులు ఉండవనే భయంలో బిజెపి
- మోడీ హామీల అమలుపై చెప్పండి...నేను రాజీనామాకు సిద్ధం
- మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి లక్ష్యంగా సిఎం రేవంత్ విమర్శలు



హైదరాబాద్ : మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటు న్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ జరిగేచోట బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారని తెలిపారు. సమస్యలపై మాట్లాడదామంటే కేంద్రమంతి కిషన్‌రెడ్డి సమయం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. సోమవారం సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని సూచించారు. మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. లోన్ బదిలీ కాకుండా కిషన్‌రెడ్డి వల్లే మెట్రో విస్తరణ ఆగిందని ఆరోపించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని సూచించారు. అంతా తామే భరిస్తామని..

తరువాయి 2లో



2లో

**తెలంగాణ వ్యాప్తంగా**
**'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్'**
# పథకం

**రాజ్‌భవన్ స్కూల్‌లో ప్రారంభించిన మంత్రి పొన్నం**

హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకం ప్రారంభమైంది. సోమవారం ఉదయం రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం పథకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.

## తెలంగాణలో మోగిన
# బడిగంటలు

**రాష్ట్రవ్యాప్తంగా తెరుసుకున్న స్కూళ్లు**

**మళ్లీ రెఓడ్డెక్కిన బస్సులు, ఆటోలు**

**కొన్నిచోట్ల విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు**



హైదరాబాద్ : వేసవి సెలవులు ముగియడంతో సోమవారం స్కూళ్లు పునఃప్రారంభం అయ్యాయి. ఇన్నాళ్లూ ఇంటికే పరిమితం అయిన విద్యార్థులు మళ్లీ బడిబాట పట్టారు. ఉదయమే మళ్లీ ఆటోలు, బస్సులు రయ్‌మంటూ రోడ్లపైకి వచ్చాయి. స్కూల్లను ముస్తాబు చేయడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ స్కూళ్లకు చేరారు. 2లో



3లో

**సింగరేణిని ప్రైవేట్‌పరం**
# చేసే కుట్రలు

- ఓపెన్ కాస్ట్‌లత విస్తరణతో సంస్థకు నష్టం
- సింగరేణి బకాయిలు 50వేల కోట్లు చెల్లించాలి
- కార్మికుల హక్కుల కోసం హెచ్‌ఎంఎస్‌తో కలిసి పోరాటం
- బొగ్గుబాయిబాట కార్యక్రమంలో టిఆర్ఎస్ చీఫ్ కవిత



**తెలంగాణ వరి ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్**

**రైతులు వాటినే పండించేలా దిశా నిర్దేశం**

## డిమాండ్ ఉన్న
# వరి వంగడాలకే ప్రోత్సాహం

**మిల్లర్లు కొనుగోలు చేసే రకాలను పండిస్తే మేలు**

**ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు**

**కేబినేట్ సబ్‌కమిటీలో డిప్యూటి సిఎం భట్టి సూచనలు**

హైదరాబాద్ : రాష్ట్రంలో 8 మేలురకం వరి వంగడాల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విదేశాల్లో తెలంగాణ బియ్యానికి బాగా డిమాండ్ ఉందని భట్టి విక్రమార్క ప్రస్తావించారు. మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికే అవకాశం ఉందని వెల్లడించారు. తెలంగాణ సోనామసూరి సహా ఎగుమతులకు అనుకూలమైన వరి రకాలపై రైతన్నలు దృష్టిపెట్టాలని సూచించారు. ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

తరువాయి 2లో

## ధాన్యం సేకరణలో
# కేంద్రం ప్రేక్షకపాత్ర

**మద్దతు ధరలు ప్రకటించి మిన్నకుంటోంది**

**కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల**

**జొన్న, మొక్కజొన్నలను ఎంఎస్‌పి పరిధిలోకి తేవాలి**




హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర, ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా.. కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం లేదని, ధాన్యం కొనుగోలు పక్రియలో తెలంగాణకు అన్యాయం జరుగు తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2లో

## ఎపిని సందర్శించండి..
# పెట్టుబడులు పెట్టండి

**ఏపీకి 1,000 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం**

**లాజిస్టిక్స్ పరంగా అనేక అనుకూలతలు**

**ప్రముఖ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు భేటీ**




అమరావతి : ఏపీకి 1,000 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం ఉందని.. లాజిస్టిక్స్ పరంగా అనేక అనుకూలతలు ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే కనెక్టవిటీ ఉందని సీఎం చెప్పారు. లాజిస్టిక్స్ వ్యయం తగ్గించేందుకు ప్రణాళికతో పనిచేస్తున్నా మన్నారు. హార్టికల్చర్‌పై లక్ష కోట్లు ఇన్వెస్ట్ చేయబోతున్నామని.. ఆక్వాకల్చర్‌లో నంబర్ 1గా ఉన్నామని వివరించారు. సింగపూర్ పర్యటనలో భాగంగా వివిధ ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వరుసగా సమావేశాలు నిర్వహించారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం వివరించారు. 2లో



2లో

## మోడీ నేతృత్వంలో
# దూసుకుపోతున్న ఇండియా

**దేశాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్న ప్రధాని**

**మెడికల్ టెక్నాలజీ సహా ఆధునిక పరికరాల తయారీలో ముందంజ**

**కేపిటలిస్టుల రౌండ్ టేబుల్ సమావేశంలో సిఎం చంద్రబాబు**

## మైనార్టీ సంక్షేమాన్ని
# విస్మరించిన గొడ్డలి పార్టీ

**ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క పని చేయని జగన్**

**మైనార్టీ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ విమర్శ**



అమరావతి : గొడ్డలి పార్టీ హయాంలో మైనార్టీ సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల బిడ్డలు డీఎస్సీ ద్వారా టీచర్లుగా ఉద్యోగాలు సాధిస్తే వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు కడుపు మంటగా ఉందన్నారు. కుంభకర్ణుడిలా 9 నెలలు నిద్రపోయి ఇప్పుడు లేచి డీఎస్సీపై వైసీపీ అధినేత విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం రాజధాని అమరావతిలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డీ ఫరూక్ విలేకర్లతో మాట్లాడుతూ.. కడపలో హజ్ భవన్ నిర్మిస్తే దాన్ని పూర్తి చేయకుండా ఐదేళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

తరువాయి 2లో

# కేరళలో నిఫా వైరస్ కలకలం

అప్రమత్తం చేసింది. వైద్య నిపుణుల సూచనల మేరకు బాధితుడికి మోనోక్లోనల్ యాంటీబాడీ చికిత్సను కూడా ప్రారంభించారు. బాధితుడితో ఇటీవల సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించేందుకు అధికారులు విస్తృత స్థాయిలో కాంటాక్ట్ ట్రేసింగ్ నిర్వహించారు. మొత్తం 87 మందిని పర్యవేక్షణ జాబితాలో చేర్చారు. వీరిలో 58 మంది ఆరోగ్య సిబ్బంది, 14 మంది కుటుంబ సభ్యులు, ఐదుగురు స్నేహితులు ఉన్నారు. అధిక ప్రమాదంలో ఉన్న వ్యక్తులను ముందస్తు జాగ్రత్తగా క్వారంటైన్‌లో ఉంచారు. అయితే, ప్రస్తుతం పర్యవేక్షణలో ఉన్న ఎవరికీ వైరస్ లక్షణాలు కనిపించలేదని, ఇప్పటివరకు సేకరించిన నమూనాల పరీక్ష ఫలితాలు నెగెటివ్‌గా వచ్చాయని కేరళ ఆరోగ్య శాఖ వెల్లడించింది. వైరస్ సమాజంలో విస్తరించిన సూచనలు లేవని, అందువల్ల ప్రస్తుతం కంటైన్‌మెంట్ జోన్లు ప్రకటించే అవసరం లేదని అధికారులు తెలిపారు. పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం నిపుణుల బృందం కూడా కోజికోడ్ కు చేరుకుంది. కేరళలో నిఫా కేసు వెలుగులోకి రావడంతో పొరుగు రాష్ట్రం తమిళనాడు కూడా అప్రమత్తమైంది. కేరళతో సరిహద్దు కలిగిన నీలగిరి, కోయంబత్తూర్, తేని, కన్యాకుమారి, కడలూరు జిల్లాల్లో ఆరోగ్య శాఖలను సిద్ధంగా ఉంచింది. తాళూర్, నాడుగని, నంబియార్‌కున్ను, సోలాడి, పట్టవాయల్ తదితర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక వైద్య బృందాలను మోహరించి కేరళ నుంచి వచ్చే ప్రయాణికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారిని వైద్య శిబిరాలకు తరలించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచుతున్నారు. కేరళ నుంచి తమిళనాడులోకి వైరస్ వ్యాపించకుండా నిరోధించడానికి సరిహద్దు జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో సరిహద్దులను పంచుకునే ప్రాంతాలతో పాటు పర్యాటక ప్రాంతాలైన నీలగిరి (ఊటీ), కోయంబత్తూరు జిల్లాలపై ఆరోగ్య శాఖ ప్రత్యేక నిఘా ఉంచింది. తమిళనాడు పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ ఆదేశాల ప్రకారం.. కేరళ సరిహద్దుల్లోని వాలామార్, ఉడుమలైపేట, నాడుగాని, తాళూర్, చోలాడి, పాట్టవయల్ సహా 13 కీలక అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఆరోగ్య శాఖ ప్రత్యేక బృందాలను మోహరించింది. చెక్‌పోస్టుల వద్ద 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేశారు. కేరళ నుంచి వచ్చే ప్రయాణికులు, పర్యాటకులు, నిత్యం పనుల కోసం సరిహద్దులు దాటే వలస కూలీలకు థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, వాంతులు వంటి నిఫా ప్రాథమిక లక్షణాలు ఉన్నవారిని అధికారులు ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారిని వెంటనే ఐసోలేషన్‌కు తరలించేందుకు సరిహద్దుల్లో అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. నీలగిరి జిల్లా కలెక్టర్, ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ క్లినిక్‌లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జ్వరం లేదా మెదడు వాపు లక్షణాలతో వచ్చే రోగుల వివరాలను, వారి ట్రావెల్ హిస్టరీని నిరంతరం గమనించాలని, ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే స్టేట్ సర్వైలెన్స్ విభాగానికి నివేదించాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు నిఫా వైరస్ వ్యాప్తికి అనుకూల కాలంగా భావిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గబ్బిలాలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. గబ్బిలాలు లేదా పక్షులు కొరికిన పండ్లను తినకూడదు. పెంపుడు జంతువులను తాకిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి.ప్రజలు పుకార్లను నమ్మకుండా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు.

# డిమాండ్ ఉన్న వరి వంగడాలకే ప్రోత్సాహం

సోమవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఎగుమతి రకాల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేబినెట్ సబ్ కమిటీకి వ్యవసాయ నిపుణుల కీలక సూచనలు చేశారని తెలిపారు. ఆ 8 రకాల వంగడాలతోనే రైతులకు లాభాలు వస్తాయని వివరించారు. మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆదరణ ఉన్న బియ్యం ఉత్పత్తిని పెంచాలని సూచించారు. రైతుల ఆదాయం పెంచే పంటల సాగును ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గ్రామస్థాయిలో రైతులకు చైతన్య సదస్సులు నిర్వహించాలని సూచించారు. రైతులకు మార్కెట్ ఆధారిత పంటల సాగుపై మార్గనిర్దేశర చేయాలని నిర్ణయించామని అన్నారు. డిమాండ్ లేని వరి రకాల సాగును క్రమంగా తగ్గించాలని చెప్పారు. వినియోగదారులు, మిల్లర్లు కోరుకునే వరి రకాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎగుమతులకు అనుకూలమైన నిర్దిష్ట వరి రకాల సాగు విస్తరణపై దృష్టి పెట్టాలని భట్టి విక్రమార్క మార్గనిర్దేశం చేశారు. వానాకాలం సాగుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు పక్రియను కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. రైతులకు నష్టాలు రాకుండా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల ప్రణాళిక చేపట్టాలని సూచించారు. నాణ్యమైన బియ్యం ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలని నిర్ణయించామని చెప్పారు. రైతులకు లాభదాయకమైన, ఎగుమతి అవకాశాలు ఉన్న వంగడాలపై ప్రత్యేక ప్రోత్సాహకాలని పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు, నిల్వ సదుపాయాలపై నిరంతర సమీక్షా సమావేశాలు కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. తెలంగాణను అధిక విలువ కలిగిన వరి ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపట్టాలని నిర్దేశిరచారు. రైతు ఆదాయం పెంపు, మార్కెట్ అనుసంధానానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించామని అన్నారు. రైతులకు మెరుగైన ధరలు వచ్చేలా మార్కెట్ డిమాండ్ ఆధారిత వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు.

## మోడీ నేతృత్వంలో దూసుకుపోతున్న ఇండియా

అమరావతి : ప్రధాని మోదీ దేశాన్ని అద్భుతమైన వేగంతో అభివృద్ధి చేస్తున్నారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. మెడికల్ టెక్నాలజీ సహా ఆధునిక పరికరాల తయారీలో భారత్‌ది అగ్రస్థానమన్నారు. ఎలక్ట్రానిక్స్ పరికరాలు భారత్ నుంచి ఎగుమతి అవుతున్నాయని సీఎం వెల్లడించారు. సింగపూర్ పర్యటనలో చంద్రబాబు నాయుడు బిజీబిజీగా గడుపుతున్నారు. కాపిటలిస్టుల రౌండ్‌టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. భారత్ సంస్కరణలతో దూసుకుపోతున్న అతిపెద్ద ఆర్థికశక్తి అని అన్నారు. చైనా లాంటి దేశాలు ఆర్థిక అభివృద్ధి సాధించటానికి దశాబ్దాల కాలం పట్టిందని.. కానీ భారత్‌కు అంత సమయం పట్టడం లేదని చెప్పుకొచ్చారు. 5వ జనరేషన్ యుద్ధ విమానాల తయారీ సహా ఇతర ఉత్పత్తులు వస్తున్నాయని అన్నారు. డెమోగ్రాఫిక్ డివిడెంట్‌తో అతిపెద్ద యువశక్తి కలిగిన మానవ వనరులను భారత్ కలిగి ఉందన్నారు. ఏపీలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేలా వన్ ఫ్యామిలీ వన్ ఆంత్రప్రెన్యూర్ విధానాన్ని అనుసరిస్తున్నామన్నారు. భూ సమీకరణ అనే కొత్త విధానం ద్వారా ప్రాజెక్టులకు భూములు ఇస్తున్నామని.. అమరావతి రాజధాని ఈ ప్రాతిపదికనే నిర్మిస్తున్నామని చెప్పారు. ఆమ్కా, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ పరిశ్రమలకు భూములను కేటాయించామని తెలిపారు. శ్రీసిటీ లాంటి ప్రత్యేక పారిశ్రామిక వాడలు పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని సీఎం అన్నారు. పౌర సేవలతో పాటు అన్ని అంశాలకూ టెక్నాలజీని అనుసంధానించామన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెట్టుబడులకు ఆస్కారం ఉందని తెలిపారు. వెంచర్ కాపిటలిస్టులు ఆ సంస్థ తయారు చేసిన స్టార్టప్‌లకు పెట్టుబడులు అందించే అవకాశం ఉందన్నారు. అత్యుత్తమ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఈ సమావేశానికి సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, ఏపీ మంత్రి నారాయణ, సింగపూర్ స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులు హాజరయ్యారు.

# తెలంగాణ వ్యాప్తంగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకం

విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసిన మంత్రి.. వారికి పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించే విధంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. వారంలో 6 రోజులు మంచి బ్రేక్‌ఫాస్ట్ పాలు, రాగి జావాను అందిస్తున్నామని.. దాదాపు రూ.800 కోట్ల వ్యయంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు.విద్యార్థులను ప్రైవేట్ స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు పంపించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ స్కూల్లో చదివితేనే ప్రభుత్వ పథకాలు అందుతాయనే రోజులు రానున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వ పథకాలు కావాలి కానీ ప్రభుత్వ ఆసుపత్రులు, స్కూల్ వద్దు అనే భావన ఉందన్నారు. దాన్ని తొలగించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు రూ.800 కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కలెక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

# ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందం

ప్రాంతీయ స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి, వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అంతర్జాతీయ ఆర్థిక రంగానికి ఊరటనిచ్చేందుకు ఈ ఒప్పందం ఒక అద్భుతమైన దౌత్యపరమైన మలుపు అని ప్రపంచ దేశాల నేతలు అభివర్ణించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ఈ చారిత్రాత్మక ఒప్పందానికి పాకిస్థాన్ ప్రధానంగా మధ్యవర్తిత్వం వహించగా.. ఖతార్, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు దీనిపై హర్షం వ్యక్తం చేశాయి. ఈ ఒప్పందం పూర్తయినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! ప్రపంచ నౌకలారా, మీ ఇంజన్లు స్టార్ట్ చేయండి. ఆయిల్ ప్రవహించనివ్వండి!' అని ట్రంప్ ఉత్సాహంగా ట్వీట్ చేశారు. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఈ డీల్‌తో హర్మ్యాజ్ జలసంధిలో ఇకపై నౌకల రవాణా నిరాటంకంగా, స్వేచ్ఛగా జరుగుతుందని ఆశిస్తున్నాం. శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కోసం చేపట్టే అన్ని చర్యలకు భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుంది. ఈ పరిణామాలను స్ఫూర్తిగా తీసుకుని ఉక్రెయిన్-రష్యా కూడా శాంతి ప్రయత్నాలు చేయాలని ఆకాంక్షిస్తున్నాం అని మంత్రిత్వ శాఖల అంతర్గత సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరంగా చారిత్రక డీల్ జరగడం అభినందనీయం. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునరుజ్జీవనానికి మార్గం సుగమం చేశాయి. పశ్చిమాసియా మరింత సురక్షితంగా ఉంటుంది. ఈ ఒప్పందాన్ని కృతనిశ్చయంతో అమలుచేయడం అత్యావశ్యకం అని జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ అభిప్రాయపడ్డారు. ఇరాన్-అమెరికా డీల్ శుభపరిణామం. ఈ ఒప్పందాన్ని వీలైనంత వేగంగా అమల్లోకి తీసుకురావాలి. హర్మ్యాజ్ జలసంధిని త్వరగా, భేషరతుగా తెరవాలి. ఎలాంటి ఆంక్షలు, టోల్స్ లేకుండా నౌకల రవాణాను పునరుద్ధరించాలి. అప్పుడే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలం. ఇరాన్ అణు, బాలిస్టిక్ క్షిపణులకు సంబంధించిన ఆందోళనలను కూడా ఈ డీల్ పరిష్కరించాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ అన్నారు. ఇరాన్-అమెరికా ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు డీల్ కోసం మధ్యవర్తిత్వం చేసిన దేశాలకు అభినందనలు. ఇప్పుడు అందరి దృష్టి ఈ ఒప్పందం అమలుపైనే ఉంది. హర్మ్యాజ్‌ను శాశ్వతంగా తెరవడంతో పాటు నౌకల భద్రతకు సంబంధించిన సాంకేతిక అంశాల్లో మద్దతిచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. సుస్థిరశాంతికే మా ప్రథమ ప్రాధాన్యం. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండొద్దన్న మా వైఖరి ఇప్పటికీ స్థిరంగా ఉందని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు. ఈ ఒప్పందాన్ని యావత్ ప్రపంచం కోరుకుంది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి మార్గం సుగమం చేస్తాయని ఆశిస్తున్నా. మరికొన్ని రోజుల్లో ఈ ఒప్పందంపై సంతకాలు జరగనున్న వేళ.. ప్రస్తుతానికి ఇరుపక్షాలు రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని కోరుతున్నా. దీనికి మధ్యవర్తిత్వం వహించిన దేశాలకు అభినందనలు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా దౌత్య పరిష్కారాలకు మేం నిరంతరం మద్దతు ఇస్తాం తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ అభిప్రాయపడ్డారు.

# ఎపిని సందర్శించండి.. పెట్టుబడులు పెట్టండి

తొలిరోజు పర్యటనలో భాగంగా వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ నంబియార్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు.సప్లై చైన్, లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుపై గ్రూప్‌తో చర్చలు జరిపారు. ఆటోమేటెడ్, అత్యాధునిక సాంకేతికతతో కూడిన భారీ సప్లై చైన్ సిటీని ఏపీలో నిర్మించే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ఆహార ఉత్పత్తులకు వాల్యూఎడిషన్ ద్వారా ఎగుమతులకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఏపీలో అపార అవకాశాలు ఉన్నాయని... ప్రొడక్షన్‌లో కూడా పెట్టుబడులు పెట్టవచ్చన్నారు. 'ఏపీని సందర్శించండి... రాష్ట్రంలో ఉన్న పాలసీలు, అనుకూలతలు చూసి పెట్టుబడులు పెట్టండి' అంటూ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. గూగుల్ క్లౌడ్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఏఐ, డేటా సెంటర్, డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా తీర్చిదిద్దే అంశాలపై ఇరువురి మధ్య చర్చకు వచ్చింది. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో గూగుల్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై గూగుల్ క్లౌడ్ సహకారాన్ని సీఎం కోరారు. రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థను మరింత శక్తిమంతం చేసేందుకు ఆధునిక క్లౌడ్ సాంకేతికతల వినియోగంపై చర్చించారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో యువతకు భారీ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రతిపాదించారు. గూగుల్ క్లౌడ్‌తో కలిసి ఏఐ స్కిల్లింగ్, క్లౌడ్ సర్టిఫికేషన్ కార్యక్రమాలను విస్తరించాలని భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్ర ప్రభుత్వ విజయాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న సంజీవని ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు.

# హైదరాబాద్ అభివృద్ధిని విస్మరించిన కేంద్రమంత్రి

ఎన్‌వోసి ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకుండా మెట్రోను తాము విస్తరిస్తామని కేంద్ర పెద్దలతో తాము చెప్పామని పేర్కొన్నారు. రాజకీయంగా నష్టం జరుగుతోందని మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రుణం ఇవ్వకపోతే కనీసం ఎన్‌వోసి అయినా ఇప్పించరా? అని నిలదీశారు. నిధులు ఇప్పించి ఎన్‌వోసి ఇస్తే శాలువా కప్పి ఆయనను సన్మానిస్తామని తెలిపారు. కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు లొంగిపోయి కిషన్‌రెడ్డే అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఆయన వెనుక కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. కేటీఆర్ కుట్రలకు కేంద్రమంత్రి సహకరిస్తున్నారని ఆక్షేపించారు.కేటీఆర్ కుట్రలు చేస్తుంటే.. కిషన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డికి అంత తెలివిలేదని.. కేటీఆర్ చెప్పిందే చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మెట్రోలో ప్రయాణించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచిస్తున్నారని తెలిపారు. ప్రధాని సూచనలను తాము అమలు చేయాలని చూస్తుంటే.. ఆయన ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఫేజ్-1ను కేంద్రం స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఫేజ్-2 నిర్మించుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతులు, నిధులు వచ్చాయని ప్రస్తావించారు. హైదరాబాద్‌కు మాత్రం అనుమతులు, నిధులు ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. విశాఖపట్నం మెట్రో నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చారని తెలిపారు. తెలంగాణపై కేంద్రానికి ఎంత వివక్ష ఉందో ఈ విషయంలో అర్థమవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. మొదటి దశలో రూ.15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన మెట్రో రైలు నిర్మాణ వ్యయం రూ.22 వేల కోట్లకు పెరిగిందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని విమర్శించారు. సెకండ్ ఫేజ్‌లో మెట్రో విస్తరణ అనుమతి కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చామన్నారు. అయితే, ఏడాదికి రూ.400 కోట్ల నష్టం వస్తుందని ఎల్అండ్‌టీ చెప్పిందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల మెట్రో విస్తరణకు ఆ సంస్థ ఒప్పుకోవట్లేదని వివరించారు. రూ.30వేల కోట్ల ఎల్అండ్‌టీ ఆస్తుల్ని రూ.15వేల కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల అప్పు ఉంది. ఐఆర్ఎఫ్‌సీ నుంచి ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల రుణాలు ఇప్పించాం. ఆ మొత్తానికి 4 శాతం వడ్డీగా రుణం ఇప్పించాం. రేవంత్‌రెడ్డిని తేలికగా పని చేయిస్తే.. తెలంగాణలో భాజపాకి ఇబ్బందులు వస్తాయని సహచర కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్‌రెడ్డి చెప్పారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినా.. లోన్ డబ్బులు ఎల్అండ్‌టీకి ట్రాన్స్‌ఫర్ కాలేదన్నారు. ఐఆర్ఎఫ్‌సీ లోన్ మంజూరు చేయకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు. తెలంగాణ నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ఉన్న కిషన్‌రెడ్డికి నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత లేదా అని ప్రశ్నించారు.కేసీఆర్, కేటీఆర్ కలిసి ఆయన మెట్రో ఫేజ్-2ను అడ్డుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు కేసీఆర్ సహకరించినందుకు కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారు. అహ్మదాబాద్, విశాఖ మెట్రోలకు అనుమతులిచ్చి హైదరాబాద్‌కు ఆపారు. తెలంగాణపై కేంద్రం వివక్ష కొనసాగిస్తోంది. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం వద్దే మెట్రో ఫేజ్-2 ఆగింది. హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్‌ను కేంద్రం ప్రకటించింది. అది ఇంకా సాకారం కాలేదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చి నెరవేర్చలేదు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని అన్నారు. అన్నింటికీ బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేస్తే.. మేమూ చేస్తాం అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసరగా, సవాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్టాం÷-రగ్ కౌంటర్ ఇచ్చారు. 'మోదీ హామీల లెక్క తేల్చండి.. ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి' అంటూ ప్రతి సవాల్ విసిరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దేశ ప్రజలకు ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ హామీలు ఎంతవరకు అమలయ్యాయో దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, ప్రతి ఖాతాలో రూ.15 లక్షల జమ వంటి కీలక హామీలు నెరవేర్చకపోయినా వాటిపై ఎవరూ ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. తన ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కిషన్‌రెడ్డి ముందుగా వీటికి సమాధాని చెప్పాలని నిలదీశారు. ఎన్నికల హామీలు అమలు కాలేదనే కారణంతో ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడితే, తాను కూడా తన కేబినెట్‌ను రద్దు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సీఎం స్పష్టం చేశారు.

# శ్రీశైలంలో కిషన్ రెడ్డి దంపతులు

శ్రీశైలం,జూన్15 : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను సోమవారం ఉదయం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ మహాద్వారం వద్ద దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. కిషన్ రెడ్డి దంపతులు శ్రీ స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అర్చకులు వేద ఆశీర్వచనాలు పలుకగా, ఈవో స్వామి వార్ల శేష వస్త్రాలు, ప్రసాదాలను బహూకరించారు.

# తెలంగాణలో మోగిన బడిగంటలు

నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు తెరుచుకున్నాయి. దీంతో విద్యార్థులు బడిబాట పట్టారు. పాఠశాలలకు తొలిరోజు వస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. అల్పాహారం ఏర్పాటు చేశారు. ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. వేసవి సెలవులతో బోసిపోయిన పాఠశాలలు సందడిగా మారాయి. తెలంగాణలో పాఠశాలలు తెరచుకోవడంతో తల్లిదండ్రులు మళ్లీ బిజీ అయ్యారు. కొత్త పుస్తకాలు.. ఏకరూప దుస్తులతో బడులకు వెళ్లే చిన్నారులతో సందడి నెలకొంది. ఈసారి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కొత్తగా అల్పాహారాన్ని అందించనున్నారు. తొలి రోజే పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే అమావాస్య రోజు పాఠశాలలు రీఓపెన్ కావడంతో మొదటి రోజు హాజరు శాతం భారీగా తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్కూళ్లలో చాలా తక్కువ మంది విద్యార్థులపై హాజరయ్యారు. కొన్ని చోట్ల పదుల సంఖ్యలోనే విద్యార్థులు హాజరవ్వగా.. ఇక రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం గీతానగర్‌లోని బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఒక్కతే పాఠశాలకు వచ్చింది. తోటి క్లాస్‌మేట్స్ ఎవరూ లేకపోవడంతో ఆ విద్యార్థిని ఒంటరిగానే క్లాస్ రూంలో కూర్చుంది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ పునఃప్రారంభ తేదీ అమావాస్య రోజు రావడంతో కొందరు అశుభంగా భావిస్తున్నారు. ఈ రోజున కొత్త పనులు, చదువులు ప్రారంభించడం మంచిది కాదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. తెల్లవారి పంపుదామంటే మంగళవారం అవుతుండడంతో ఈ రెండు రోజులు పిల్లలను ఇంటి వద్దే ఉంచాలని వారు ఆలోచిస్తున్నారు. దీంతో ఈ రోజుల్లో విద్యార్థుల హాజరు తగ్గే అవకాశం ఉంది. కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ముందుగానే అమావాస్యను ఆలోచించి ఈ నెల 17న బుధవారం, 19న శుక్రవారం ప్రారంభించేందుకు నిర్ణయించాయి.

# ధాన్యం సేకరణలో కేంద్రం ప్రేక్షకపాత్ర

కనీస ధరలు వస్తాయని ఆశగా సాగు చేసిన రైతులకు న్యాయం జరగట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మొక్కజొన్న కొనుగోళ్లు, నిల్వ సౌకర్యాలు, గన్ని బ్యాగుల లభ్యత, రవాణా ఏర్పాట్లు, కేంద్ర ప్రభుత్వ విధానాలపై సమగ్రంగా చర్చించారు. ఇప్పటికైనా సేకరించిన పంటలను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం కేవలం మద్దతు ధరను ప్రకటించి, ఆ తర్వాత కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, అలా నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నా కూడా ఎందుకు తమపై ఇంత వివక్ష అని మంత్రి తుమ్మల ప్రశ్నించారు. మద్దతు ధర ప్రకటించిన అన్ని రకాల ధాన్యాలనూ సేకరించాల్సిన ప్రాథమిక బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకొంటూ, రాష్ట్ర రైతాంగాన్ని, ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కేంద్రం చేతులెత్తేసినా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనకాడలేదని, ఇప్పటికే 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నతో పాటు, 2 లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలను రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా కొనుగోలు చేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ఈ ధాన్యం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా తీసుకోవాలని మంత్రి తుమ్మల డిమాండ్ చేశారు. కేంద్రం కొనుగోలు చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం రూ.4,000 కోట్లతో మొక్కజొన్న సేకరణ చేపట్టిందన్నారు. జొన్న కొనుగోలుకు రూ.1100 కోట్లతో ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మొక్కజొన్న, జొన్నలను వెంటనే పీఎస్ఎస్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. పిఎస్ఎస్ స్కీంలో ఉన్న శనగ, పొద్దుతిరుగుడు పంటలపై 25శాతం సీలింగ్ పరిమితిని 50 శాతంకు వెంటనే పెంచాలని మంత్రి డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బంది పడుతున్న కేంద్రం నుంచి ఎటువంటి సమాధానం లేదని విమర్శించిన మంత్రి తుమ్మల, రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు రైతుల నుండి 9.57 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న సేకరించినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయకపోయినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్వంత నిధులతో రూ.4,000 కోట్ల వ్యయంతో మొక్కజొన్న కొనుగోలు చేపట్టిందన్నారు. అదేవిధంగా, రాష్ట్రంలో సాగవుతున్న జొన్న పంటను కూడా రూ.1,000 కోట్లతో సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. సేకరించిన మొక్కజొన్న నిల్వ కోసం మొత్తం 15.07 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు అవసరమవుతున్నాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 11.40 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే అందుబాటులో ఉందని, దీంతో ఇంకా 3.29 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు నిల్వ సామర్థ్యం అత్యవసరంగా అవసరమని పేర్కొన్నారు. ఈ మేరకు అదనపు గోదాములను వెంటనే గుర్తించి, అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం మొత్తం 3 కోట్ల గన్ని బ్యాగులు అవసరమవుతుండగా, ఇప్పటివరకు 2 కోట్ల గన్ని బ్యాగులు సరఫరా చేసినట్లు తెలిపారు. మిగిలిన ఒక కోటి గన్ని బ్యాగులు వెంటనే అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్‌లోడింగ్ పాయింట్ల వద్ద హమాలీల కొరత లేకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులు తీసుకొచ్చిన పంటను ఆలస్యం లేకుండా బరువు తూచి, గోదాములకు తరలించేందుకు తగిన సంఖ్యలో లారీలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుండి గోదాములకు పంట తరలింపులో ఎటువంటి ఆటంకాలు లేకుండా సమన్వయంతో పనిచేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులకు సూచించారు.

# కాక్రోచ్ జనపతాపార్టీ సభలో అనూహ్య ఘటన

### అభిజిత్ దీప్కేపై దాడి..చెంపపై కొట్టిన దుండగులు

### దుండగులను చితక్కొట్టిన కార్యకర్తలు

జైపూర్,జూన్15 : నీట్, సీబీఎస్ఈ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా రాజస్థాన్ జైపూర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన ధర్నాలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్ అభిజిత్ దీప్కేపై దాడి జరిగింది. గుర్తు తెలియని దుండగులు అతడిని చెంపపై కొట్టారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన కాక్రోచ్ పార్టీ కార్యకర్తలు దుండగులపై ఎదురు దాడి చేశారు. తనపై దాడి చేసిన వ్యక్తిని కొట్టొద్దని దీప్కే కోరినప్పటికీ సీజేపీ కార్యకర్తలు వెనక్కి తగ్గలేదు. దుండగులను చితకబాదారు. ఈ ఘటనతో ధర్నాలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అభిజిత్?ను అక్కడి నుంచి తరలించారు. కాక్రోచ్ పార్టీ చీఫ్?పై దాడి జరిగిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. అభిజిత్ దీప్కేపై దాడిని నెటిజన్లు తీవ్రంగా ఖండిస్తున్నారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తోన్న వారిపై భౌతిక దాడులు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభిజిత్ పై దాడి చేసిన వ్యక్తులు ఎవరనే విషయం తెలియాల్సి ఉంది. నీట్, సీబీఎస్ఈ, సీయూఈటీ, ఎస్ఎస్సీ వంటి ప్రధాన పరీక్షలలో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగానే సోమవారం (జూన్ 15) రాజస్థాన్ రాజధాని జైపూర్?లో సీజేపీ ధర్నా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే హాజరై ప్రసంగించారు. అనుహ్యంగా ఈ ధర్నాలో ఆయనపై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు

# చిన్నారిపై కోతుల మంద దాడి

### గాయపడ్డ చిన్నారి ఆస్పత్రికి తరలింపు

రాజన్న సిరిసిల్ల,జూన్15 : జిల్లాలో కోతులు బీభత్సం సృష్టించాయి.ఇంటి ముందు ఆడుకుంటున్న మూడేళ్ళ చిన్నారిపై కోతులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో కోతులు బీభత్సం సృష్టించాయి. మండలంలోని బొప్పాపూర్ లో ఇంటి ముందు ఆడుకుంటున్న మూడేళ్ళ చిన్నారి అన్వికపై దాడికి చేశాయి. కోతులు దాడి చేసే సమయంలో చిన్నారి అన్విక కేకలు విని వెంటనే తల్లి కోతులను తరిమికొట్టింది . కోతుల దాడిలో అంవికకు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గ్రామంలో కోతులు, కుక్కల బెడదతో భయాందోళనకు గురవుతున్నామని అంటున్నారు గ్రామస్తులు. కోతుల సమస్యపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు గ్రామస్తులు. చిన్నారులు బయట ఆడుకోవాలంటే భయపడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# బ్రహ్మానాయుడికి మూడు రోజుల పోలీసు కస్టడీ

### రంగారెడ్డి జిల్లా కోర్టు అనుమతి

హైదరాబాద్,జూన్15 : హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ భూములు కాజేసే కుట్ర కేసులో అరెస్టయిన వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడికి మూడు రోజుల పోలీసు కస్టడీకి రంగారెడ్డి జిల్లా కోర్టు అనుమతించింది. గండిపేట సమీపంలో ప్రభుత్వ భూమిని కాజేసేందుకు నకిలీ జీవోలు సృష్టించారు. వీటి ఆధారంగా ఈ కేసులో అరెస్టయిన మరికొందరు నిందితులతో ఆర్థిక లావాదేవీలు నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. బొల్లా బ్రహ్మానాయుడి పాత్ర ఉన్నట్లు పక్కా ఆధారాలు సేకరించి అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఆయన్ను కస్టడీకి ఇవ్వాలని కోరగా.. కోర్టు అనుమతించింది. రేపటి నుంచి మూడు రోజులపాటు బొల్లా బ్రహ్మానాయుడిని కస్టడీకి తీసుకుని పోలీసులు విచారించనున్నారు.

# అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందం

### స్వాగతిస్తూ ఎక్స్ వేదికగా మోడీ ప్రకటన

న్యూఢిల్లీ : అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై భారత ప్రధాని నరేంద్రమోదీ స్వాగతించారు. ఉద్రిక్తతలను ముగించేందుకు ఇరుదేశాలు ఓ అంగీకారానికి రావడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో మోదీ పోస్ట్ చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడింది. ఎన్నో దేశాల్లో ప్రాణనష్టం వాటిల్లింది. ఈ యుద్ధాన్ని ముగించేలా అమెరికా, ఇరాన్ అంగీకారం కుదుర్చుకోవడం స్వాగతించే విషయం. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాలను పునరుద్ధరించడం, స్వేచ్ఛా నౌకాయానం, వాణిజ్యానికి భరోసా కల్పించడంలో ఈ పరిణామం సాయపడుతుందని భారత్ విశ్వసిస్తోంది. సుస్థిరమైన తుది ఒప్పందానికి దారితీసేలా.. మిగిలిన అంశాల పైనా సానుకూల చర్చలు జరుగుతాయని విశ్వసిస్తున్నాం అని మోదీ రాసుకొచ్చారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేలా ఇరాన్‌తో ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీన్ని టెహ్రాన్ కూడా ధ్రువీకరించింది. దీనిపై స్విట్జర్లాండ్ వేదికగా జూన్ 19న ఇరుదేశాలు సంతకాలు చేయనున్నాయి. హర్మూజ్‌లో అమెరికా నౌకాదళ దిగ్బంధాన్ని తొలగించడం, ఈ జలసంధిని పూర్తిగా తెరవడం, ఇరాన్ చమురుపై ఆంక్షలు తదితర అంశాలపై ఇరుదేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలిసింది.

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికతో ప్రజలకు చేరువయ్యాం

### ప్రగతి ప్రణాళికపై సచివాలయంలో సిఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్,జూన్15 : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలను కొన్ని విభాగాలు ఆశించినంతగా చెప్పుకోలేక పోయాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వెంటనే అన్ని శాఖలు తాము చేపట్టిన కార్యక్రమాలకు తగినంత ప్రచారం కల్పించాలని సూచించారు. సంబంధిత ఉన్నతాధికారులు ఆ బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. మీడియా, డిజిటల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తాము చేసిన మంచి పనులు చెప్పుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ను నమోదు చేయాలని, గ్రామాల్లో వచ్చిన సమస్యలను కూడా ఆయా శాఖలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన శంకుస్థాపనలు, ఆస్తుల వివరాలన్నీ నమోదు చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 16 నుంచి జూన్ 12 వరకు చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. 9 రోజుల పాటు రాష్ట్రమంతటా జరిగిన కార్యక్రమాలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా అన్ని విభాగాలు తాము జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు చేపట్టిన కార్యక్రమాల వివరాల నివేదికలను సమర్పించాయి. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో చురుగ్గా పాల్గొన్న విభాగాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతినెలా క్షేత్రస్థాయికి వెళ్లాలని గతంలోనే ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్లపై తనకు నివేదిక ఇవ్వాలని చీఫ్ సెక్రటరీని సీఎం ఆదేశించారు. వారిపై క్రమశిక్షణా ఉల్లంఘన చర్యలు ఎందుకు తీసుకోకూడదో.. వెంటనే వివరణ కోరాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని అధికారులను ఉపేక్షించవద్దని హెచ్చరించారు. ఇప్పటికీ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలుంటే.. వెంటనే ఆ జాబితాను సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను సీఎం ఆదేశించారు. అక్కడ కొత్తగా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను కూడా చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యా, వైద్య విభాగాల్లో అన్ని స్థాయిల్లో ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి కాలేజీల వరకు, పీహెచ్ సీ నుంచి ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి వరకు ఉద్యోగులందరికీ ఇదే అటెండన్స్ విధానం పాటించాలన్నారు. రాష్ట్రస్థాయిలో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించినట్లే.. జిల్లాల వారీగా వెంటనే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై వెంటనే సమీక్ష జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షలకు రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకో సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్ గా నియమించి, ఆ జిల్లాకు పంపించాలని చెప్పారు. స్పెషలాఫీసర్ ఆ జిల్లా కలెక్టర్ కలిసి అన్ని విభాగాల్లో 99 రోజుల పాటు జరిగిన ప్రత్యేక కార్యక్రమాలు, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, వివిధ పథకాలపై వచ్చిన స్పందనలన్నింటినీ సమీక్షించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఈ ప్రగతి నివేదికలను విడుదల చేయాలని చెప్పారు. జిల్లాలతో పాటు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుకున్న లబ్దిదారులు, ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వీటిని డ్యాష్ బోర్డులో అందుబాటులో ఉంచాలని చెప్పారు. తాను ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత జిల్లాల పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సీఎం అధికారులను ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి హామీల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు. ౼ాజ్యసభ ఎంపీ వేంనరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# సింగరేణిని ప్రైవేట్‌పరం చేసే కుట్రలు

మంచిర్యాల : సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు జరుగుతున్నాయని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. కొత్త బొగ్గు బావులు తెచ్చుకుంటే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని, మన హక్కైన డిపెండెంట్ ఉద్యోగాల కోసం రాజీలేని పోరాటం చేయాల్సి ఉందన్నారు. సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే.. వెంటనే సింగరేణికి బకాయి ఉన్న 50 వేల కోట్ల రూపాయలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను రద్దు చేసి, ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను పెంచుతూ సింగరేణి ఉనికిని దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలో చేపట్టిన బొగ్గుబాయి కార్యక్రమంలో భాగంగా.. కాసిపేట మైన్-1ను ఆమె సందర్శించారు. నేరుగా గనిలోకి వెళ్లి కార్మికులతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న కష్టాలను, సమస్యలను అడిగి తెలుసు కున్నారు. కాసిపేట నుంచే వారం రోజుల పాటు సాగనున్న ఈ 'బాయి బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా అవతరించిన టిఆర్ఎస్ కు సింగరేణి బిడ్డల ఆశీర్వాదం కావాలని ఆమె కోరారు. వారసత్వ ఉద్యోగాల్లో సింగరేణి కార్మికులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. సింగరేణి సంస్థ పరిరక్షణ కోసమే.. టీఆర్ఎస్, హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) కలిసి పని చేస్తున్నాయని చెప్పారు. పాలసీలు రూపొందించాల్సిన సీఎం, డిప్యూటీ సీఎంలే అధికారులకు వినతిపత్రాలు ఇస్తూ.. కార్మిక రంగాన్ని మభ్యపెడుతున్నారని విమర్శించారు. సింగరేణి సంస్థను ప్రైవేటీకరించడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అండర్ గ్రౌండ్ మైన్లను కాపాడుకోవడానికి హెచ్ఎంఎస్‌తో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో, ఆ తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వంలోనూ మనం కలిసి పనిచేశాం. నేను ఎక్కడున్నా అనునిత్యం మీ పక్కనే ఉండి పోరాడాను. గతంలో మెడికల్ బోర్డు కోసం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ను ముట్టడించిన చరిత్ర మనది. కానీ ఈ ప్రభుత్వంలో.. సర్వసాధారణంగా జరగాల్సిన పనుల కోసం కూడా కార్మికులు రో÷-డడెక్కి పోరాడాల్సి వస్తోంది అంటూ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ, హైదరాబాద్‌లలో ఉండి సింగరేణికి కొత్త బొగ్గు బావులు తేవాల్సిన సీఎం, డిప్యూటీ సీఎంలు.. ఇక్కడికి వచ్చి కార్మికులకే వినతిపత్రాలు ఇస్తూ మభ్యపెడుతున్నారని కవిత మండిపడ్డారు. ఐటీ సమస్యలను తీర్చడంలో, నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇప్పుడున్న కార్మికుల్లో ఎక్కువ మంది యువకులే ఉన్నారని.. కానీ వారి పిల్లల చదువుల కోసం సరైన స్కూళ్లు, వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రులు లేవని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అన్నింటిలో ప్రైవేట్‌ను తీసుకొచ్చి వైద్యాన్ని ఖరీదు చేస్తున్నారని మండిపడ్డారు. అందుకే.. కార్మికుల రక్షణ కోసం, వారి కుటుంబాల సంక్షేమం కోసం 'తెలంగాణ రక్షణ సేన పాంచజన్యం' అనే ఐదు కీలక అంశాలతో ముందుకు వచ్చిందని కవిత ప్రకటించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ స్థాయిలో, జేబీసీసీ లో కార్మికుల హక్కుల కోసం హెచ్.ఎమ్.ఎస్. అధ్యక్షుడు రియాజ్‌తో కలిసి టిఆర్ఎస్. సంయుక్తంగా, రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కొత్త పార్టీ స్థాపించాక సింగరేణిలో ఇదే తన మొదటి యాత్ర అని పేర్కొంటూ.. కార్మికుల దీవెనలు ఎల్లప్పుడూ తమపై ఉండాలని కవిత కాంక్షించారు.

# తెలంగాణలో 19 నుంచి భారీ వర్షాలు

### అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి

హైదరాబాద్,జూన్ 15 : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 19వ తేదీ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలపై నిరంతర నిఘా అవసరమని వారికి స్పష్టం చేశారు. విపత్తుల నిర్వహణ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి చెప్పారు. జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల తీవ్రత పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని ఉన్నతాధికారులకు తెలిపారు. ప్రజల ప్రాణాలతోపాటు వారి ఆస్తుల రక్షణెళి ప్రభుత్వ లక్ష్యమన్నారు. వర్షాకాలం ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# నగరశివారులో డ్రగ్స్ తయారీ గుట్టు రట్టు

### ముఠాను వలపన్ని పట్టుకున్న ఈగిల్ టీమ్

హైదరాబాద్,జూన్ 15 : హైదరాబాద్ నగర శివారులోని అబ్దుల్లా పూర్‌మెట్‌లో అత్యంత ప్రమాదకరమైన ఎండీఎంఏ డ్రగ్స్ తయారు చేస్తున్న ముఠా గుట్టును ఈగల్ టీం రట్టు చేసింది. సోమవారం డ్రగ్స్ తయారు చేస్తున్న నరేష్, మత్స్యగిరిలను ఈగల్ టీం అరెస్ట్ చేసింది. ఈ ముఠాలో సంతోష్ సింగ్ అలియాస్ రాజు అలియాస్ రాజేష్, విజయ్, అశ్విని పాఠక్ కీలక సభ్యులుగా ఉన్నారని ఈగల్ టీం తెలిపింది. అలాగే రూ.50 లక్షల విలువైన మెఫెడ్రోన్‌తోపాటు రసాయనాలను స్వాధీనం చేసుకుంది. రూ.50 లక్షల విలువైన ఆ ఫ్యాక్టరీని సీజ్ చేసింది. నరేష్, కీసర మత్స్యగిరిలు గత కొన్ని సంవత్సరాలుగా తప్పించుకుని తిరుగుతున్నారని ఈగల్ టీం వెల్లడించింది. రసాయన శాస్త్రవేత్త నుంచి అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా సభ్యులుగా వీరు ఎదిగారని తెలిపింది. గతంలో వీరు హత్యలు, దోపిడీలతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని వివరించింది. చివరకు వీరు డ్రగ్స్ తయారీదారులుగా మారారని తెలిపింది. అంతర్జాతీయ డ్రగ్స్ రాకెట్‌లో ఈ ముఠా కీలకంగా వ్యవహరిస్తుందని వెల్లడించింది. గత ఆరు నెలలుగా వీరి కోసం గాలిస్తున్నామని చెప్పింది. 2015 నుంచి దేశవ్యాప్తంగా అక్రమ డ్రగ్స్ తయారీ కేంద్రాలను ఈ ముఠా ఏర్పాటు చేసి.. తన కార్యకలాపాలు కొనసాగిస్తుందని ఈగల్ టీం వివరించింది.

# గోల్కొండ హత్య కేసు ఛేదించిన పోలీసులు

### ప్రేమ వివాహం చేసుకున్నందుకు మసూద్ హత్య

హైదరాబాద్ : నగరంలోని గోల్కొండలో సంచలనం సృష్టించిన హత్య కేసును పాతబస్తీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సహా నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరు పరిచారు. వారికి కోర్టు జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. ప్రేమ వివాహమే ఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసులు వెల్లడించారు. 2025, జనవరిలో రుక్సార్ బేగంను మసూద్ చాంది ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ వివాహాన్ని రుక్సార్ సోదరుడు జాహెద్ తీవ్రంగా వ్యతిరేకించాడు. ఈ నేపథ్యంలో వారితో అతడు తరచూ ఘర్షణకు దిగేవాడు. జూన్ 12వ తేదీన సోదరి నివాసానికి తన బంధువులతో కలిసి వెళ్లి మసూద్‌పై జాహెద్ దాడి చేశాడు. ఇనుప రాడ్లు, కత్తులతో బలంగా దాడి చేయడంతో మసూద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఈ దాడిని మసూద్ తండ్రి షేక్ ఇస్మాయిల్ అడ్డుకోబోయాడు. దాంతో ఆయన కూడా తీవ్రంగా గాయపడ్డాడు. హత్యపై ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పవన్ కళ్యాణ్‌ను ఆడిస్తున్న బిజెపి

### బిజెపి కుట్రలో పావుగా మారిన పవన్

### ఇష్టం వచ్చినట్లు తెలంగాణపై మాట్లాడితే ఊరుకోం

### పిసిసి చీఫ్ మహేథ్ గౌడ్ హెచ్చరిక

హైదరాబాద్,జూన్15 : పవన్ కళ్యాణ్ పదే పదే తెలంగాణను కించపరిచేలా మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యల వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాజకీయాల్లో విచ్చలవిడిగా మాట్లాడటానికి ఇదేమీ సినిమా కాదని మహేష్ కుమార్ గౌడ్ హితవు పలికారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్రంపై, కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలపై కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కళ్యాణ్ స్వతహాగా మాట్లాడడం లేదన్నారు. కేంద్రంలోని మోడీ, ఇతర బీజేపీ నేతలు కించపరిచేలా స్క్రిప్ట్ ఇస్తే, దాని ప్రకారం పవన్ మాట్లాడుతున్నారు. ఆయన పూర్తిగా బీజేపీ ఆడించే తోలుబొమ్మలా మారిపోయారని దుయ్యబట్టారు. తెలంగాణ ఆవిర్భావాన్ని, రాష్ట్ర విభజనను పవన్ కళ్యాణ్ వ్యతిరేకిస్తూ మాట్లాడటం కొత్తేమీ కాదని, గతంలోనూ మోడీతో సహా బీజేపీ నేతలు ఇదే తరహాలో తెలంగాణను అవమానించారని గుర్తుచేశారు. ఎంతో మంది యువకులు ప్రాణత్యాగం చేస్తే, తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని సాకారం చేశారని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు పవన్ కళ్యాణ్ ఎక్కడున్నారు? ఏ సినిమాలో నటిస్తున్నారు? అని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడమంటే సినిమాల్లో డైలాగులు చెప్పినంత సులువు కాదని.. నెహ్రూ, గాంధీ కుటుంబాల త్యాగాల చరిత్రను పవన్ శ్రద్ధగా చదువుకుంటే మంచిదని హితవు పలికారు. ప్రధాని మోడీ ఇవాళ రాకెట్ల ముందు నిలబడి ఫోటోలు దిగుతున్నారంటే, ఆ అంతరిక్ష రంగానికి పునాది వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుంచుకోవాలన్నారు. పవన్ కళ్యాణ్ చాలా పెద్ద హీరో కావడానికి తెలంగాణ ప్రజలు కూడా కారణమని, ఇక్కడి ప్రేక్షకులు చూడబట్టే ఆయన సినిమాలు ఆడాయనే విషయాన్ని మరువరాదని మహేష్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌కు అక్కడ చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని, వాటిపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉంది. కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదు, ఆ విషయంలో ఆయన చాలా చిన్నవాడు. అధికారం ఉందని తెలంగాణ గురించి ఎలా పడితే అలా మాట్లాడితే చూస్తూ ఊరుకోం' అని హెచ్చరించారు. రెండు రాష్ట్రాలు విడిపోయినా అన్నదమ్ములుగా కలిసి ఉండాలని తాము కోరుకుంటున్నామని, కానీ తెలంగాణలో రాజకీయ లబ్ది కోసం ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదని మహేష్ గౌడ్ అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పాలన సాగుతోందని.. ఏపీ సైతం మన వైపు చూసేలా ఇక్కడ పరిపాలన ఉందన్నారు. అయితే, తెలంగాణను కించపరుస్తూ పవన్ కళ్యాణ్ ఇంతలా మాట్లాడుతున్నా.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. వీరి మౌనం వెనుక బీజేపీ, బీఆర్ఎస్, పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందం స్పష్టంగా అర్థమవుతోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు.

# హైదరాబాద్ నివాసంలో లోకేశ్ దంపతుల పూజలు

### మహాశివుడికి మహాన్యాసక రుద్రాభిషేకం నిర్వహణ

హైదరాబాద్ : ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి దంపతులు సోమవారం హైదరాబాద్‌లోని తమ నివాసంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశిష్టమైన సోమవారం సందర్భంగా లోకేశ్ దంపతులు మహాశివుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయురారోగ్యాలు, రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రుత్వికుల వేదమంత్రాల నడుమ లోకేశ్, బ్రాహ్మణి దంపతులు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కాంక్షిస్తూ లోకేశ్, బ్రాహ్మణి శివారాధన చేశారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వేదోక్తంగా నిర్వహించారు. శివానుగ్రహం కోసం లోకేశ్ కుటుంబం ప్రత్యేక పూజలు చేశారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర సుభిక్షం కోసం మహాశివుడిని లోకేశ్ దంపతులు ప్రార్థించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం ప్రత్యేక హారతులు, ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహించారు.

# బాల్య వివాహాల నివారణకు చర్యలు

### తరుణి స్వచ్ఛంద సంస్థతో ప్రభుత్వం అవగాహన

### రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామన్న సీతక్క

హైదరాబాద్,జూన్15 : తెలంగాణలో బాల్య వివాహాల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ - తరుణి స్వచ్ఛంద సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమం మంత్రి సీతక్క సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. 'బాల్య వివాహం- బతుకు ఆగం' అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని మంత్రి సీతక్క తెలిపారు. బాల్య వివాహాలు, మైనర్ బాలికల గర్భధారణలను నివారించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై కలిగే ప్రతికూల ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. బాల్య వివాహాల గుర్తింపు, నివారణ, చట్టపరమైన చర్యలపై వారికి అవసరమైన మార్గదర్శకాలు అందిస్తామని తెలిపారు. అదే విధంగా సోషల్ మీడియా, డిజిటల్ వేదికలు, ప్రచార సామగ్రి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపడతామని చెప్పారు. బాలికల విద్య కొనసాగింపు, ఆరోగ్య సంరక్షణ, భద్రత, స్వయం సాధికారత అంశాలకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజం మొత్తం కలిసి ముందుకు రావాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క సూచించారు. ప్రతి బాలిక తన విద్యను పూర్తి చేసుకుని, స్వయం నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకోవాలంటే బాల్య వివాహాలకు పూర్తిగా ముగింపు పలకాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలన దిశగా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు కలిసి పనిచేస్తేనే శాశ్వత ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలో బాల్య వివాహాల నివారణకు మరింత బలమైన వ్యవస్థ ఏర్పడుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# సంపాదకీయం

## నేలవిడిచి సాము చేస్తున్న ప్రాంతీయ పార్టీలు !

కాంగ్రెస్ నుంచి విడివడి ఏర్పడ్డ ప్రాంతీయ పార్టీలు అన్నీ మళ్లీ కాంగ్రెస్‌లో విలీనం కావాలని, అప్పుడే బిజెపి వ్యతిరేక పోరాటం బలోపేతం అవుతుందని శివసేన ఎంపి సంజయ్ రౌత్ ఈ మధ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. తృణమూల్ కాంగ్రెస్, శరద్ పవార్ పార్టీలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ఎందుకు అన్నారో కానీ, బిజెపిని దెబ్బతీయాలంటే కాంగ్రెస్ బలోపేతం కావాలన్న ఉద్దేశ్యంతో అలా అని వుంటారు. రెండు పార్టీల వ్యవస్థ ఉండివుంటే ఇలాంటిదే జరుగుతుంది. ఇష్టమున్న పార్టీలు ఆ రెండు పార్టీల్లో చేరుతాయి. అది బిజెపి లేదా కాంగ్రెస్ కావచ్చు. కానీ భారత ప్రజాస్వామ్యంలో ప్రాంతాయ పార్టీల పాత్రను తక్కువగా అంచనావేయలేం. ఒకప్పుడు కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యంగా, నిరంకుశంగా చేస్తున్న పాలనకు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలు పుట్టుకురావడం చూశాం. కమ్యూనిస్టులు పూర్తిగా బలహీనపడి, దేశంలో కమ్యూనిజం అంతం కావడంతో ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు కొన్ని ప్రాంతీయ పార్టలు తమ ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ నిరంకుశ పాలనపై ఎన్టీఆర్ తిరుగుబాటు చేశారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడి ఇప్పటికీ బలంగా నిలిచింది. ఇటీవల తమిళనాడులో ద్రవిడ పార్టీలపై యుద్ధం ప్రకటించిన టివికె పార్టీ ఏకంగా అధికారంలోకి వచ్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు మనుగడ సాగిస్తున్నాయి. ఆయా పార్టీలు కాంగ్రెస్‌లో విలీనం అయితే జరిగేది కాంగ్రెస్ బలోపేతం మాత్రమే. కాంగ్రెస్ దేశంలో కుటుంబ పాలన సాగిస్తున్న పార్టీ. అక్కడ సోనియా, రాహుల్, ప్రియాంకల పెత్తనం తప్ప ఇతరులకు అఇకారం ఉండదు. పేరుకే ఖర్గే జాతీయ పార్టీ అధ్యక్షుడు. ఆయన మాట కూడా చెట్టుబాటు కాదు. అలాంటి పార్టీలో ప్రాంతీయ పార్టీల విలీనం కావాలన్న ఆలోచన సరికాదు. దీంతో ఎలాంటి రాజకీయ ప్రయోజనం ఉండదు. అందువల్ల సంజయ్ రౌత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం లేదు. ఇకపోతే కాంగ్రెస్ ముక్త భారత్ పిలుపునిచ్చిన మోడీ కూడా కాంగ్రెస్‌ను ఏమీ చేయలేక పోయారు. ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను కూడా బిజెపి ఏమీ చేయలేకపోతున్నది. దేశంలో ప్రజల ఆదరణ ఉన్నంత వరకు ఏ పార్టీ అయినా ఉంటుంది. బెంగాల్‌ను తీసుకుంటే ప్రాంతీయ పార్టీగా తృణమూల్ విఫలం అయ్యింది. ఒక ఆడబిడ్డ చేతిలో దేశ భద్రతకు భంగం ఏర్పడింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల్లో ఓడిపోయిన కొద్దిరోజులకే చిన్నాభిన్నం అవుతోంది. ఇది స్వయంకృతంగా చూడాలి. అంతమాత్రాన కాంగ్రెస్‌లో విలీనం అయితే, భ్రష్టత్వం కాంగ్రెస్‌కు కూడా అంటుకుంటుంది. ఇకపోతే ఇండియా కూటమిలో ఉన్న పార్టీలు బలమైన వాణిని వినిపించడం లేదు. అందుకే ఎన్‌డిఎ వైఫల్యాలపై గట్టిగా పోరాడ లేకపోతున్నాయి. అధికారమే లక్ష్యంగా అన్ని పార్టీలు రాజకీయాలు నడుపుతున్నాయి తప్ప ప్రజల కోణంలో ఆలోచన చేయడం లేదు. దళితుల గురించి అన్ని పార్టీలు గొప్పలు చెబుతున్నా ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ పూర్తికాలం ముఖ్యమంత్రి అయిన దాఖలాలు లేవు. బెంగాల్లో గతంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ పరిపాలించినా అవకాశం దళితులకు దక్కలేదు. తమిళనాడులో డీఎంకే అధికారం కోల్పోయినప్పటికీ మరో ప్రాంతీయ పార్టీ అధికారం చేపట్టింది. కేరళలో అధికారం కోల్పోయాక ఇప్పుడు దేశంలో కమ్యూనిస్టు పార్టీలు క్రమంగా కనుమరుగయ్యే స్థితి కనబడు తున్నది. బిహార్‌లో ఆర్జేడీది అదే పరిస్థితి. ఒడిశాలో కూడా నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్ అదే బాటలో ఉంది. ప్రాంతీయ పార్టీలు ప్రజల్లో బలంగా లేకపోవడం స్వార్థ చింతనతో పాలన చేయడం, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోక పోవడం వంటి కారణాలతో కనుమరుగు అవుతున్నాయి. ఉమ్మడి ఎపిలో, ఇప్పుడు విభజిత ఎపిలోతెలుగుదేశం పార్టీ ఇంకా గట్టిగా నిలబడి ఉందంటే అందుకు ప్రజల మద్దతు కారణమని చెప్పాలి. వైఎస్ జగన్ ప్రాంతీయ పార్టీని ప్రజలు నమ్మి ఓటేస్తే ఆయన దానిని నిలబెట్టుకోలేక పోయారు. టిడిపి, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ కూడా ఫక్తు కుటుంబ పార్టీలుగా మారాయి. అలాగే తెలంగాణలో బిఆర్‌ఎస్ కూడా కేవలం కుటుంబ పార్టీగా మారింది. ఇలాంటి పార్టీలను ప్రజలు దీర్ఘకాలం నమ్మరని గుర్తించాలి. ఈ స్థితిలో ప్రాంతీయపార్టీలు మారాలి. సమాజంలో అన్నివర్గాల ప్రజలను కలుపుకుని పోవాలి. ప్రజల ఎజెండాను తమ లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలి. ప్రాంతీయ పార్టీలకు జాతీయ దృక్పథం ఉండాలి. ఆయా రాష్ట్రాల్లో పాలనలో భిన్నత్వం కనిపించాలి. అభివృద్ధిని ఆలంబనగా చేసుకుని ముందుకు సగాలి. లేకుంటే ఆయా పార్టీలను ప్రజలు విసిరి అవత పారేస్తారు. బెంగాల్లో అదే జరిగింది. దేశంలోని ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపిలకు భిన్నంగా పాలన సాగించాలి. ఆయా రాష్ట్రాలను అభివృద్ధిలో ముందు వరసలో నిలబెట్టాలి. జాతీయ పార్టీలకన్నా ప్రాంతీయ పార్టీలే నయమని నిరూపించాలి. ఈ ప్రయత్నంలో తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పాలనలో తనదైన ముద్ర వేశారు. దళితులు,గిరిజనలు, బిసిలను రాజకీయంగా ఎంచుకుని వారిని ముందుకు నడిపించారు. ఓ రకంగా ఆయన విప్లవం సాధించారనే చెప్పాలి. అలాగే ఓటు బ్యాంక్ రాజకీయాలకు పోకుండా అభివృద్ధి రాజకీయాలను చేస్తే ప్రజలు తప్పకుండా ప్రాంతీచయ పార్టీలను ఆదరిస్తూనే ఉంటారు. ఎందుకంటే కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆయా ముఖ్యమంత్రులకు స్వేచ్ఛ ఉండదు. జాతీయ పార్టీ కనుక ఢిల్లీ ఆదేశాలను పాటించాల్సి ఉంటుంది. ఈ విషయంలో కాంగ్రెస్ ముందున్నది. చీమచిటుక్కుమన్నా కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలకు చెప్పాల్సిందే. స్వతంత్ర నిర్ణయాలకు అక్కడ ఆస్కారం ఉండదు. ప్రాంతీయ పార్టీలు జాతీయ ప్రత్యామ్నాయంగా మారితేనే కాంగ్రెస్ , బిజెపిలకు కొంత చెక్ పడుతుంది.

# ఫ్యూచర్ సిటీ కోసం శరవేగంగా అడుగులు



### సింగపూర్ కంపెనీకి మాస్టర్ ప్లాన్ బాధ్యతలు?

హైదరాబాద్ : ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన సిఎం రేవంత్ రెడ్డి ఇటీవలఏ అక్కడ ఫ్యూచర్ సిటీ వెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయాన్ని ప్రారంభించారు. దీనికితోడు మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేస్తున్నారు. రానున్న ఆరేడేళ్లలో ఫ్యూచర్ సిటీని అందుబాటులోకి తీసుకుని రావడం లక్ష్యంగా శరవేగంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనికితోడు కొన్న ప్రభుత్వ కార్యాలయాలను అక్కడికి తరలిస్తున్నట్లు వార్తలు వస్తున్నారు. ఇదే క్రమంలో ఫ్యూచటర్ సిటీ మాస్టర్ ప్లాన్ ఈ బాధ్యతలను సింగపూర్ కంపెనీకి ప్రభుత్వం అప్పగించినట్టు తెలుస్తున్నది. ఇందుకోసం గ్లోబల్ టెండర్లను పిలువగా.. ఆరు సంస్థలు టెండర్లలో పాల్గొన్నాయి. అందులో సింగపూర్‌కు చెందిన డీపీ ఆర్కిటెక్ట్స్ అనే సంస్థ లోయెస్ట్ బిడ్డర్‌గా నిలిచిందని సమాచారం.దీంతో ఆ సంస్థకే మాస్టర్ ప్లాన్ తయారీ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించినట్టు సమాచారం. 765 చదరపు కిలోమీటర్ల మేర ఫ్యూచర్ సిటీకి ఆ సంస్థ మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నది. 9 నెలల్లో మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసి ఇచ్చేలా సంస్థకు బాధ్యతలు అప్పగించినట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి. తొలిదశలో భాగంగా 30 వేల ఎకరాలపై మాస్టర్ ఎ÷–లాన్‌ను సిద్ధం చేయనున్నారు. అందులో భాగంగా వేటికి ఎంత భూమి వినియోగించాలి.. మౌలికవసతుల అవసరాలు, అభివృద్ధి ప్రాధాన్యాలను ప్లాన్‌లో పొందుపరచ నున్నారు. మొత్తంగా 30 వేల ఎకరాల్లో 13 వేల ఎకరాలను మౌలికవసతులు, పారిశ్రామిక అవసరాల అభివృద్ధికి వాడుకోబోతున్నారు. డెవలప్‌మెంట్‌లో భాగంగా లైఫ్‌సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలుస్తున్నది. 13 వేల ఎకరాల్లో సింహభాగం లైఫ్?సైన్సెస్‌కు కేటాయించనున్నారు. 4 వేల ఎకరాల్లో లైఫ్‌సైన్సెస్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఆ తర్వాత 2,177 ఎకరాల్లోఎలక్ట్రానిక్స్ అండ్? అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్? జోన్‌ను అభివృద్ధి చేస్తారని తెలుస్తున్నది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు ట్రెండ్, డిమాండ్ పెరగడంతో దానికీ ప్రాధాన్యం ఇచ్చారు. ఎలక్ట్రిక్ వెహికల్స్, ఎనర్జీ పార్క్ కోసం దాదాపు 2 వేల ఎకరాలు కేటాయించినట్టు తెలిసింది. ఏఐ సిటీ కోసం 400 ఎకరాలు, డేటా సెంటర్ హబ్ కోసం 310 ఎకరాలు, హెల్త్ సిటీకి 594 ఎకరాలు, ఎడ్యుకేషన్ అండ్ యూనివర్సిటీ డిస్ట్రిక్ట్ కోసం 255 ఎకరాల కేటాయింపులు చేసినట్టు చెబుతున్నారు. వాటితోపాటు రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ల అభివృద్ధి కోసం 2,477 ఎకరాలను కేటాయించారు. మిక్స్డ్‌యూజ్‌పర్పస్‌లో ఎంటర్‌టైన్‌మెంట్, స్పోర్ట్స్, ఫర్నీచర్? మాన్యుఫ్యాక్చరింగ్‌కు కూడా భూములు కేటాయించినట్టు చెబుతున్నారు. ట్రాన్స్‌పోర్ట్ కారిడార్లు, యుటిలిటీ నెట్‌వర్క్స్, సోషల్? ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వాణిజ్య ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణ ప్రాంతాలను మాస్టర్ ప్లాన్‌లో పొందు పరచనున్నారు. ప్రస్తుతం ఎఫ్?సీడీఏ ప్రాంతం వివిధ హద్దుల్లోకి వస్తున్నది. ఉత్తర భాగంలోని కొన్ని ప్రాంతాలు హెచ్‌ఎండీఏ, మధ్యభాగంలో హైదరాబాద్ ఫార్మా సిటీ ఏరియా ఉంటున్నది. దక్షిణ భాగం గ్రామీణ ప్రాంతాలే ఉన్నాయని చెబుతున్నారు. ప్లాన్ ప్రకారం సిటీ అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికను పొందుపరుస్తారని అధికారులు చెబుతున్నారు.

# దేశంలో భయంకరమైన పరిస్థితులు..

### ఆవిడ బతికుంటే బీజేపీని నిషేధించేది : మాజీ సీఎం అశోక్ గెహ్లాత్



హైదరాబాద్ : దేశంలో నేడు అత్యంత భయంకరమైన పరిస్థితులు ఉన్నాయని, దివంగత ఉక్కు మహిళ ఇందిరా గాంధీ బతికి ఉంటే నేడు బీజేపీ వంటి మతతత్వ పార్టీలను నిషేధించే వారని రాజస్తాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాత్ అన్నారు. జైపూర్‌లో జరిగిన ఒక అవార్డు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ పాలనలో దేశం అత్యంత గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటుందన్నారు. తన 50 ఏళ్ల ప్రజా జీవితంలో ఎన్నడూ చూడనంతగా అత్యంత ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ పార్టీ అభివృద్ధి, సంక్షేమాన్ని వదిలిపెట్టి మతతత్వ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. బీజేపీ మోసాలను గుర్తించకుంటే భవిష్యత్తులో ప్రజలే దీని పర్యవసానాలను అనుభవించాల్సి వస్తుందని హెచ్చ రించారు. ఉద్దేశపూర్వకంగా బీజేపీ ప్రభుత్వం మతపరమైన అల్లర్లకు పాల్పడుతుందన్నారు. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో ముస్లిం అభ్యర్థులకు బీజేపీ ఎందుకు టికెట్లు ఇవ్వలేదని సూటిగా ప్రశ్నించారు. హిందుత్వ మద్దతుదారులను రెచ్చగొట్టి పాలన సాగించడమే లక్ష్యంగా పెట్టుకున్న వారి విషయంలో.. ఇందిరా గాంధీ వంటి ఉద్దండ నాయకురాలు నేడు ఉండి ఉంటే ఆమె బీజేపీపై నిషేధం విధించి ఉండేవారన్నారు. కేవలం హిందుత్వ ఎజెండాతోనే పార్టీని నడుపుతారా? హిందువుల పేరుతోనే రాజకీయాలు చేయాల నుకుం టున్నారా? అని ఆయన ప్రశ్నించారు. అశోక్ గెహ్లాత్ వ్యాఖ్యలపై బీజేపీ స్పందిస్తూ కాంగ్రెస్ హిందువుల పట్ల ద్వేషంతో ఉందని, ముస్లింలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించింది హిందుత్వం పట్ల కాంగ్రెస్‌కు ఉన్న ద్వేషాన్ని ఇది స్పష్టం చేస్తోందని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా అన్నారు.

# ఇరాన్‌తో శాంతి ఒప్పందంతో మార్కెట్లో మళ్లీ జోరు

### అమాంతంగా పెరిగిన బంగారం, వెండి ధరలు

న్యూఢిల్లీ,జూన్15 : దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండికి మళ్లీ గిరాకీ పెరిగింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు దిగిరావడం, రూపాయి విలువ బలోపేతం వంటి కారణాలతో ఈ లోహాల ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఇరాన్‌తో డీల్ కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో మూడు నెలలకు పైగా సాగిన యుద్ధానికి ముగింపు లభించినట్లయ్యింది. ఈ పరిణామాలతో ముడి చమురు ధరలు భారీగా దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ 83 డాలర్లకు పడిపోయింది. అటు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 53 పైసలు బలపడి 93.65 వద్ద ట్రేడ్ అవుతోంది. సోమవారం హైదరాబాద్ లో 10 గ్రాముల మేలిమి 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,490 పలికింది. అటు వెండి ధర కూడా ఎగబాకింది. కేజీ వెండి ధర రూ.2.57లక్షలకు చేరింది. గతవారం ఒకదశలో బంగారం ధర రూ.1,50,000 కన్నా దిగువకు పడిపోయిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ విపణిలోనూ బంగారం, వెండికి డిమాండ్ పెరిగింది. స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 4,323 డాలర్లు, ఔన్సు వెండి ధర 70.38 డాలర్లకు చేరింది. గతవారం పసిడి ధర ఒక దశలో దాదాపు 4000 డాలర్లకు తగ్గింది. ఇక, కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.1,53,258గా ఉంది. వెండి ఫ్యూచర్స్ ధర రూ.2,52,383గా ట్రేడ్ అవుతోంది.

# నెల్లూరు జిల్లా సంగం మండలంలో విషాద ఘటన

### విశ్రాంత ఉపాధ్యాయుడి కుటుంబం ఆత్మహత్య

నెల్లూరు,జూన్15 : నెల్లూరు జిల్లా సంగం మండలంలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. మండల పరిధిలోని దువ్వూరు గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తమ ఇంట్లోనే ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతులను విశ్రాంత ఉపాధ్యాయుడు మధుసూదన్‌రావు, ఆయన భార్య రత్నావళి, మరియు వారి కుమారుడు సాయి సుకృత్‌గా పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పరిశీలించి, స్వాధీనం చేసుకున్నారు. చేతులకు తాళ్లు కట్టేసి ఉండటంతో మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనాస్థలిలో సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పూర్తి వివరాల కోసం విచారణ జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.


# అమెరికా మిస్సోరిలో కుప్పకూలిన విమానం

### ప్రమాదంలో 12 మంది దుర్మరణం

వాషింగ్టన్,జూన్15 : అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రంలో ఓ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న 12 మంది చనిపోయారు. స్కైడైవింగ్ చేసే వారిని తీసుకెళ్తుండగా బట్లర్ మెమోరియల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఈదుర్ఘటన జరిగింది. ప్లేన్ టేకాఫ్ అయిన తర్వాత రన్‌వేకు సుమారు 300 గజాల దూరంలో క్రాష్ అయింది. చనిపోయిన వారిలో 11 మంది స్కైడైవర్లు, ఒక పైలట్ ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# ప్రపంచం.. పంచ సూక్తాత్మకం

'సూక్తం' అంటే మంచిమాట. 'బాగా చెప్పింది' అనే అర్థం కూడా ఉంది. సమగ్రంగా నిరూపణ చేయడాన్ని కూడా 'సూక్తం' అని అంటారు. ఈ అర్థాలన్నిటినీ సమన్వయం చేస్తే.. మనిషికి సమున్నతమైన మార్గదర్శనం చేసే బోధన 'సూక్తం' అని చెప్పొచ్చు. ప్రకృతి పరిణామ కమం, దానిపై మనిషికి ఉండాల్సిన అవగాహన, చేయాల్సిన పనులు, చేయకూడని చర్యలు, సాధించాల్సిన అద్వైతభావన మొదలైన విషయాలన్నిటినీ వేదాల్లోని సూక్తాలు వివరిస్తాయి. భక్తుడి మనసు ఎప్పుడూ నిశ్చలంగా ఉండటానికి, పరమాత్మ మీద లగ్నం కావడానికి భారతీయ రుషులు ప్రతిపాదించిన ప్రాథమిక సూచన వేద సూక్త పఠనం. నిజానికి ఇవి వేదాల్లో ఒకే చోట, ఒకే మంత్రభాగంగా ఉండవు. విభిన్న భాగాల నుంచి గ్రహించిన మంత్రాలతో సూక్తం తయారవుతుంది. వేదంలో చెప్పిన కొన్ని పరమ ప్రామాణికమైన అంశాలు, మనిషికి అత్యవసరంగా అందాల్సిన సందేశాన్ని గుర్తించి మహర్షులు చేసిన క్రోడీకరణే సూక్తాలు. నాలుగు వేదాల్లో వందలాదిగా ఉన్న సూక్తాల్లో పురుషసూక్తం, శ్రీసూక్తం, నారాయణసూక్తం, భూ, నీలాసూక్తం%ా% పంచసూక్తాలుగా ప్రసిద్ధిపొందాయి. పురుష సూక్తం.. 'పురుష' అనే పదానికి భగవంతుడు అని అర్థం చేసుకోవాలి. విశ్వానికి మూలశక్తి అయిన విరాట్పురుషుడి స్వరూప, స్వభావ వర్ణన, విశ్లేషణ ఈ సూక్తంలో ప్రధానంగా ఉంటాయి. సాధారణభావనలో మనం ఊహించుకునే విష్ణుమూర్తి, పురుషసూక్తం ప్రకటించే నారాయణుడు ఇద్దరూ వేర్వేరు. ఈయన త్రిమూర్తుల్లో ఒకరైన విష్ణువు కన్నా పూర్వమే ఉన్నాడు. విశ్వం ఆవిర్భావానికి మూలకారణశక్తి ఇతనే.



ఆధ్యాత్మికం

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

## ● అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి పెద్దపల్లి జిల్లాలో అదనపు కలెక్టర్ రెవెన్యూగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి తో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ముత్తారం మండలం లక్కారం గ్రామ పంచాయతీ కు చెందిన వీరగొని రాజేశం మచ్చ పేట గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 79 లో ఎకరం 33 గుంటల వ్యవసాయ భూమి చట్టబద్ధంగా కొనుగోలు చేయడం జరిగిందని, తన భూమిని అధికారికంగా పున సర్వే చేయించి సంబంధిత రెవెన్యూ రికార్డులలో ఉన్న తప్పులను సరిచేసి చట్టబద్ధమైన హక్కులు కల్పించాల్సిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్స్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఓదల గ్రామ పంచాయతీ పరిధిలో మంజూరైన ప్రీ ప్రైమరీ స్కూల్ సెంటర్ ను హై స్కూల్ ప్రాంగణంలోకి మార్పు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచి కనకిరెడ్డి సతీష్ దరఖాస్తు చేసుకోగా జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. గోదావరిఖని కళ్యాణ్ నగర్ కు చెందిన కొత్తపల్లి సమ్మక్క తన ఇంటి వెనకాల ఉన్న కోత్వాల్ వెంకటేష్ అక్రమంగా మా ఇంటి సరిహద్దులను ఆక్రమంగా చొర పడుతున్నారని, తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోవాలని రామగుండం మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. పెద్దపల్లి పట్టణం ప్రగతి నగర్ కు చెందిన కొండా రమాదేవి తమకు గృహ జ్యోతి పథకం కింద లబ్ధి చేకూర్చాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎంపీడీఓ కు రాస్తూ అవసరాన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# "గోటు విలేజ్ - మాదిగ పల్లెలకు తరలండి" కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

● ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి మంద రాజు మాదిగ ● మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చిన 40 రోజుల కార్యాచరణపై ఎమ్మార్పీఎస్ సమీక్ష
● ఈ నెల 25 నుండి జూలై 5 వరకు గ్రామాల్లో చైతన్య యాత్రలు ● జూలై 7న గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు






**కరీంనగర్ టౌన్, జూన్ 15(ది క్రైమ్ న్యూస్):** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ పల్లెల్లో విద్యా, సంస్థగత నిర్మాణం, జెండా ఆవిష్కరణల కోసం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అన్ని అనుబంధ సంఘాల నాయకులు కదలిపోవాలని ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంద రాజు మాదిగ పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రవి మాదిగ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు, గంగాధర మండల ఇంచార్జి చిలుముల రాజన్న కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంద రాజు మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ద్వారా ఎస్సీల వర్గీకరణను సాధించుకున్నామని గుర్తుచేశారు. ఈ వర్గీకరణ ఫలాలను మన జాతి బిడ్డలు పూర్తిస్థాయిలో అందిపుచ్చుకునేలా వారిని విద్యావంతులను, చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. అందుకోసం మందకృష్ణ మాదిగ ప్రకటించిన 40 రోజుల కార్యాచరణను విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 25 నుండి జూలై 05 వరకు "గో టు విలేజ్ - మాదిగ పల్లెలకు తరలండి" కార్యక్రమం జరుగుతుందని, దీనిని విజయవంతం చేసి యువతను భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. అన్ని మండలాల పరిధిలోని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాల నూతన గ్రామ కమిటీల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఏ గ్రామాలలో అయితే ఎమ్మార్పీఎస్ గద్దెలు లేవో, అక్కడ తక్షణమే నూతన గద్దెల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. మాదిగలకు పండుగ దినోత్సవమైన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం (జూలై 7) నాటికి సంస్థ 32వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా, ప్రతి గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు జరిపి వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ కరీంనగర్ జిల్లా కన్వీనర్ దండువరలక్ష్మి మాదిగ, ఎంఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి తడగొండ మహిళా విభాగం కరీంనగర్ జిల్లా సీనియర్ నాయకురాలు గడ్డం కొమరక్క మాదిగ ఎంఈఎస్ రాష్ట్ర నాయకులు కాల్వల మల్లన్న ఎమ్మార్పీఎస్ ఎక్స్ మండల అధ్యక్షులు గంగాధర రఘు మాదిగ, సీనియర్ నాయకులు శనిగరపు నరేష్ మాదిగ, సీనియర్ నాయకులు గంగాధర రాజశేఖర్ మాదిగ ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు బొడ్డు రాజేందర్ మాదిగ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు..

# ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి

### విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీని అరికట్టి, విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు నిర్బంధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని, విద్య పేరుతో బహిరంగంగా దోపిడీ జరుగుతున్నా ప్రభుత్వ విద్యాధికారులు నిశ్శబ్దంగా ఉండడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యా సంస్థలలో ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతూ, అనవసర ఛార్జీలు విధిస్తూ విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చుతున్నారన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు అప్పులు చేసి పిల్లల చదువు కొనసాగించాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఇది విద్యా హక్కు చట్టానికి పూర్తి విరుద్ధమని అన్నారు. ఈ పరిస్థితిని సహించబోమని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పెద్దపల్లి జిల్లా కమిటీ స్పష్టం చేస్తోందని, వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫీజుల దోపిడీపై వెంటనే ప్రత్యేక దాడులు (రైడ్స్) నిర్వహించాలని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని, ఫీజుల నియంత్రణకు జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేయాలని అన్నారు. లేనిపక్షంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మామిడిపల్లి అరవింద్, నాయకులు గంప నరేష్, సాయి చరణ్, అభివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించిన కొప్పుల వెంకట్ రెడ్డి

### రాజేంద్రనగర్ ఆర్డీఓగా పనిచేసిన కొప్పుల వెంకట్ రెడ్డికి పదోన్నతి



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కొప్పుల వెంకట్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)గా విధులు నిర్వహించిన కొప్పుల వెంకట్ రెడ్డికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పదోన్నతి లభించడంతో పెద్దపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్న ఆయన అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను కలుసుకున్న కొప్పుల వెంకట్ రెడ్డి, ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

### పోగుల సైదులు గౌడ్



**మిర్యాలగూడ, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు పోగుల సైదులు గౌడ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం. 7ను తక్షణమే రద్దు చేసి, విద్యార్థులకు రావలసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని కోరారు. విద్యార్థుల ఉన్నత విద్యకు ఆటంకం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ప్రస్తుతం విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకంగా మారుస్తోందని ఆరోపించారు. సంక్షేమ పథకాల అమలు పేరుతో విద్యార్థుల హక్కులను కాలరాయడం సరికాదని పేర్కొన్నారు. విద్య ప్రతి విద్యార్థి హక్కు అని, వారి భవిష్యత్తుతో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలు చేపట్టి సాధించుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించి, పెండింగ్ బకాయిలను విడుదల చేసి వారికి న్యాయం చేయాలని పోగుల సైదులు గౌడ్ కోరారు.

# సమగ్ర సర్వే జరిపించి బాధితులకు న్యాయం చేస్తాం

### మానకొండూర్ తహసీల్దార్ విజయ్ కుమార్



**కరీంనగర్ టౌన్, జూన్ 15(ది క్రైమ్ న్యూస్):** మానకొండూర్ మండలంలోని పచ్చునూరు గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందనే ఫిర్యాదులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని మానకొండూర్ తహసీల్దార్ విజయ్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో పచ్చునూరు గ్రామానికి చెందిన గ్రామస్తులు, బండ లక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ కూరాకుల పోశాలు అధికారులను కలిసి తనపై వస్తున్న ఆరోపణలపై వివరణ ఇచ్చారు. గ్రామంలోని సర్వే నెంబర్ 737లో ఉన్న భూమిపై తనకు ఎలాంటి సంబంధం లేదని, కావాలనే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని కూరాకుల పోశాలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో విజయ్ కుమార్ మాట్లాడుతూ వివాదాస్పద సర్వే నెంబర్ 737లోని భూమిపై రెవెన్యూ అధికారులతో క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహిస్తామని తెలిపారు. అర్హులైన బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చూస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎల్కపెల్లి పౌల్, పిట్టల మల్లేశం, కల్వలరవి, గోపు శంకర్ రెడ్డి, రామంచ ప్రవీణ్, పినింటి సుధాకర్ రెడ్డి, సిరిసిల్ల చంద్రయ్య, కూరాకులపోచాలు, మందలమల్లారెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీసెంట్ బీఎడ్ కళాశాల గుర్తింపును రద్దు చేయండి....

### మైనారిటీ ముసుగులో నిబంధనలు పాటించడంలేదు..

### కలెక్టరుకు ఫిర్యాదు చేసిన బిజెపి నేత సదానందం..



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ నిబంధనలకు విరుద్ధంగా పెద్దపల్లి కేంద్రంలో కొనసాగుతున్న క్రీసెంట్ బీఎడ్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం జిల్లా కలెక్టరు కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ, అనుమతిమేరకు పట్టణంలోనే కొనసాగాల్సిన కళాశాలను వేరేచోటికి మార్చినారని, ఇటీవల పలు పత్రికల్లో కళాశాలకు వ్యతిరేకంగా కథనాలు ప్రచురితం కావడంతో తిరిగి పెద్దపల్లిలోని క్రీసెంట్ పాఠశాల ప్రాంగణంలోకి తీసుకువచ్చారని తెలిపారు. ఎన్సిఈటి నిబంధనల ప్రకారం కళాశాలను ఒక ప్రాంగణం నుండి మరో ప్రాంతానికి తరలించడానికి అనుమతిలేదన్నారు. కళాశాలలో ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, సైకాలజీ ల్యాబ్, లాంగ్వేజ్ ల్యాబ్, మెథడాలజీ ల్యాబ్, సరిపడ గ్రంథాలయం, విద్యార్థులకు అవసరమైన విద్యా వాతావరణం లేదన్న ఆయన ప్రతి సెమిస్టర్‌కు కనీసం 100రోజుల తరగతులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, వాస్తవ పరిస్థితుల్లో తరగతులు సక్రమంగా జరగడంలేదని వివరించారు. నకిలీ హాజరు రికార్డులు నిర్వహించడం, హాజరు లేకుండానే పరీక్షలకు అనుమతించడం, టీచింగ్ ప్రాక్టీస్ కేవలం కాగితాలకే పరిమితం కావడం, ప్రాక్టికల్స్, డిసర్టేషన్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించకపోవడం, మార్కుల నమోదు, విద్యా రికార్డుల్లో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. మైనారిటీ ముద్రవేసుకుని ఎన్ని అక్రమాలైన చేయవచ్చని కళాశాల యాజమాన్యం భావిస్తోందని ఆరోపించారు. ఇకనైనా అధికారులు తక్షణమే స్పందించి కళాశాలపై ప్రత్యేక కమిటీతో సమగ్ర విచారణ చేపట్టి, కళాశాల గుర్తింపును రద్దుచేసి యాజమాన్యం, కరస్పాండెంట్, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సదానందం డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యార్థుల నుండి వసూలు చేసిన అక్రమ రుసుములను తిరిగి చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో కోరారు.


# నేషనల్ టాలెంట్ హంట్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఏఐసీసీ, టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ టాలెంట్ హంట్ పోస్టర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం పట్ల నిబద్ధత కలిగిన ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోంది. స్పోక్స్ పర్సన్, రీసెర్చ్ కోఆర్డినేటర్, పబ్లిసిటీ కోఆర్డినేటర్ వంటి విభాగాలకు అర్హులైన అభ్యర్థులను ఆహ్వానిస్తోంది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ నేషనల్ టాలెంట్ హంట్ కోఆర్డినేటర్ కమ్మగోని చౌదరి గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జమ్మికుంట మున్సిపాలిటీలో ముసలం..!

## ◆ చైర్మన్ - వైస్ చైర్మన్ మధ్య కోల్డ్ వార్ ?




**జమ్మికుంట, జూన్ 15 (ది క్రైమ్ న్యూస్):** పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన మున్సిపాలిటీలో ప్రస్తుతం రాజకీయ విభేదాలు తెరపైకి రావడం చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ మధ్య నెలకొన్న విభేదాలు రోజురోజుకూ ముదురుతున్నాయ? ఈ పరిస్థితి పాలనపై ప్రభావం చూపుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు అయినప్పటికీ, అధికార నిర్వహణ, అభివృద్ధి పనులు, సమావేశాల నిర్వహణ, నిర్ణయాల అమలులో అభిప్రాయ భేదాలు బయటపడుతున్నట్లు రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

గత కొంతకాలంగా మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాల విషయంలో చైర్మన్, వైస్ చైర్మన్ మధ్య సమన్వయం లోపించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నిధుల వినియోగం, వార్డుల వారీగా పనుల కేటాయింపు, కాంట్రాక్టుల మంజూరు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది.

**బయటపడుతున్న విభేదాలు:** సాధారణంగా మున్సిపల్ సమావేశాల్లో పరస్పర సహకారంతో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండగా, కొన్ని సమావేశాల్లో ఇద్దరు నాయకుల మధ్య సఖ్యత లోపించిందని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. దీనంతటికీ కారణం పట్టణంలోని ఒక గోడ నిర్మాణం పంచాయతీలో నెలకొన్న వివాదం చిలికి చిలికి గాలి వానగా మారింది. ఇది ఇంతటితో ఆగకుండా ప్రోటోకాల్ ప్రకారం చైర్మన్ పక్కన ఉండవలసిన వైస్ చైర్మన్ కుర్చీని పక్కన పెట్టడంతో ముసలం మొదలైనట్టు సమాచారం.

**అభివృద్ధి పనులపై ప్రభావం:** పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా వంటి కీలక అంశాలపై దృష్టి పెట్టాల్సిన సమయంలో అంతర్గత విభేదాలు పెరగడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. అధికారుల వద్దకు వచ్చే ప్రతిపాదనల విషయంలో కూడా రాజకీయ ఒత్తిడులు పెరిగాయని, ఫైళ్లు ఆలస్యమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల అభిప్రాయం ప్రకారం ఎన్నికల సమయంలో అభివృద్ధి హామీలు ఇచ్చిన నాయకులు ఇప్పుడు పరస్పర విభేదాలతో సమయం వృథా చేయడం సరికాదని అంటున్నారు. రాజకీయ విభేదాలు పక్కనపెట్టి పట్టణాభివృద్ధిపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. **పార్టీ పెద్దల జోక్యం అవసరమా?:** మున్సిపాలిటీలో నెలకొన్న పరిస్థితులపై అన్ని పార్టీలకు చెందిన కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే పాలకవర్గం ప్రతిష్ట దెబ్బతినే అవకాశం ఉందని భావిస్తున్న నాయకులు, ఇరువర్గాలను సమన్వయం చేసే ప్రయత్నాలు చేయాలని కోరుతున్నారు.

**అధికారుల్లోనూ అయోమయం:** ప్రజాప్రతినిధుల మధ్య విభేదాల కారణంగా అధికారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం. ఏ నిర్ణయం తీసుకున్నా ఒక వర్గం నుంచి అభ్యంతరాలు వచ్చే పరిస్థితి నెలకొనడంతో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. దీంతో కొన్ని అభివృద్ధి పనులు నెమ్మదించినట్లు తెలుస్తోంది.

**ప్రజల ఆశలు ఒక్కటే:** పట్టణ ప్రజలు మాత్రం రాజకీయాలు పక్కనపెట్టి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి అంశాలపై చైర్మన్, వైస్ చైర్మన్ కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించేనా ? మున్సిపాలిటీలో చైర్మన్ -- వైస్ చైర్మన్ మధ్య కొనసాగుతున్న కోల్డ్ వార్ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ విభేదాలు వ్యక్తిగత స్థాయిలోనే పరిమితమవుతాయా? లేక పాలనపై మరింత ప్రభావం చూపుతాయా? అనే అంశం ఆసక్తికరంగా మారింది. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇరువురు నాయకులు కలిసి పనిచేస్తేనే పట్టణాభివృద్ధి వేగవంతమవుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. కావున మున్సిపల్ కమిషనర్ పాలకవర్గంతో మమేకమై, చిన్న చిన్న వివాదాలకు తావివ్వకుండా చైర్మన్, వైస్ చైర్మన్ సఖ్యత కుదిరించి అభివృద్ధి దిశగా అడుగులు వేస్తే బాగుంటుందని సగటు జమ్మికుంట మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.

# భూమి పేరుమార్పు పేరుతో మోసం...

**• సీపీఐ జిల్లా నాయకుని పై భూకబ్జా ఆరోపణలు.... • ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధిత కుటుంబం**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి పట్టణంలోని ఉదయ్‌నగర్‌కు చెందిన పెర్క శ్రవణ్‌కుమార్ కుటుంబం తమ వ్యవసాయ భూమిని అక్రమంగా కబ్జా చేశారని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. బాధితుల కథనం ప్రకారం, పెద్దపల్లి పరిధిలోని రంగంపల్లి శివారులో సర్వే నంబర్లు 66/2, 66/3, 67లలో మొత్తం 1.28 ఎకరాల వ్యవసాయ భూమిని తమ తాత పెర్క హనుమయ్య 1983లో కీర్తి రాములు, కీర్తి మల్లయ్య, జనగామ పోషాల నుంచి కొనుగోలు చేశారని తెలిపారు. అప్పటి నుంచి తామే ఆ భూమిని సాగు చేసుకుంటూ కాస్తులో ఉన్నామని, దీనికి సంబంధించిన అన్ని లింక్ డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. అయితే సర్వే నంబర్ 66/2లోని 16 గుంటల భూమి అకారణంగా పెర్క రాములు, పెర్క నర్సయ్య పేర్లపైకి మారిందని తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న సమయంలో తాండ్ర సదానందం అనే వ్యక్తి తమ భూమిని తిరిగి తమ పేరుపైకి తెప్పిస్తానని నమ్మబలికి, తమ తాతతో తెల్లకాగితాలపై సంతకాలు తీసుకున్నాడని ఆరోపించారు. అనంతరం భూమిని తమ పేరుపైకి మార్చకపోగా, అందులో 8 గుంటలను తన పేరు మీదకు, మరో 8 గుంటలను పెర్క నర్సయ్య పేరు మీదకు పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు. ఈ విషయమై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతూ, తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి భయభ్రాంతులకు




గురిచేస్తున్నాడని వాపోయారు. అలాగే రెండు గుంటలు, మూడు గుంటలు ఇస్తామని రాజీ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు భాదితులు వాపోయారు. భూకబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న తాండ్ర సదానందంపై తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే సీపీఐ పార్టీ నాయకత్వం ఆయనను సస్పెండ్ చేయడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి పదవులు ఇవ్వవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో పెర్క శ్రవణ్‌కుమార్, పెర్క రాజేశం, పెర్క లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం ఫీజు మినహాయించాలి

**• టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కే బాపురావు: జిల్లా కలెక్టర్‌కు వినతి**

**జమ్మికుంట జూన్ 15 (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు జిల్లా పరిధిలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 100 శాతం ఫీజు మినహాయించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. సోమవారం టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఈ విషయంపై జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రాను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లాలో జర్నలిస్టు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆర్థిక స్థితిగతులపై జిల్లా కలెక్టర్ కు వివరించి పాఠశాల ఫీజుల్లో రాయితీ కల్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం బాపురావు మాట్లాడుతూ.. ప్రస్తుతం మన జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దాదాపు 80 శాతం జర్నలిస్టులు వేతనాలు లేక నెలవారీ ఆదాయం లేక తమ పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు ఫీజులు కట్టలేక పోతున్నారన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక రాయితీ అమలు చేయాలని కోరారు. రాబోయే 2026-27 విద్యా సంవత్సరంలో జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా జీవో/సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పిఎస్ రవీంద్ర, టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కరుణాకర్ రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంతాటి రవీందర్, భూపతి సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము గణేష్, లక్కం సురేష్, కార్యదర్శులు కిరణ్, ఎండి ఖాజా ఖాన్, నాయకులు సుదర్శన్ రెడ్డి, అనిల్, హుజురాబాద్ డివిజన్ అధ్యక్షుడు సౌడ మల్ల యోహాన్,రచ్చ రవి కృష్ణ, దీక్షిత్, గౌతమ్, రాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ఆలయ స్వీపర్‌ల వేతనం పెంపుతో మంత్రి అడ్లూరికి ధన్యవాదాలు తెలిపిన ఉద్యోగులు

**ధర్మపురి, జూన్ 15, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి దేవస్థానంలో పనిచేస్తున్న స్వీపర్ లందరికీ మంత్రి అడ్లూరి జీతాలు పెంచిపించడంతో మంత్రి అడ్లూరి కి ఉద్యోగులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ధర్మపురి నృసింహుని సన్నిధిలో నిత్యం పనిచేస్తున్న 15 మంది స్వీపర్లకు 9000 జీతం నుండి 12 వేల వరకు పెంచిపించడం జరిగిందని వారు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో స్వీపర్లకు జీతాలు పెంచడంలో సహకారం దొరకలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే దేవాలయంలో పనిచేస్తున్న దాదాపు 30 మంది డైలీ వైజు ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, టెంపరరీ ఉద్యోగులు జీతాలు లేక తక్కువ ఉండి ఇబ్బంది పడుతున్నటువంటి సమయంలో పెంచిన జీవితశీతో తమ కుటుంబం దారిన పడుతుందని ఆశాభావం వ్యక్తం



చేశారు. ప్లంబర్లు, ఎలక్ట్రిషన్లు, అర్చకులు, బ్రాహ్మణోత్తములు, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్లు వాచ్మెన్లు దాదాపు 8000 ఉన్నటువంటి జీతం నుండి 16,000 వరకు పెంచిన ఘనత రాష్ట్ర మంత్రి అడ్లూరి దే అని ఆవేదన వ్యక్తంచేశారు. అదే విధంగా చాలా సంవత్సరాల నుండి దేవాలయంలో సేవ మోసేవారు బోయవారు వాళ్ళు దాదాపు 100 కుటుంబాలు వారికి పారితోషకం పెంచక పది సంవత్సరాలు అవుతుందని, వాళ్లందరూ కూడా మంత్రి అడ్లూరి దృష్టికి తీసుకువెళ్లగా వారు పారితోష్కం ఎంత అడిగినారో అంత పెంచిపించి ఆర్డర్ ఇప్పించినటువంటి ఘనత మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దే అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆలయంలో పనిచేస్తున్న మరి కొంతమంది స్వీపర్లకు జీతం పెంచే విషయంలో నాయి బ్రాహ్మణులకు పారితోషకం విషయంలో పూర్తిగా వారికి హామీ ఇవ్వడం జరిగిందని వారికి కూడా పెంచడం జరుగుతుంది అని ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లబ్ది పొందిన ఉద్యోగులు అందరు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి ప్రత్యేకమైనటువంటి ధన్యవాదములు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం లో 2027 సంవత్సరములో జరగబోయే పుష్కరాలకు సంబంధించి దేవాలయ అభివృద్ధి పుష్కర ఘాట్స్ రోడ్లు నిర్మాణం కొరకు 117 కోట్లు సాంక్షన్ చేయడం జరిగిందని ఇంకొక 50 కోట్లు ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ని కోరడం జరిగిందని మంత్రి అడ్లూరి తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలు అంగన్‌వాడి కేంద్రాల్లో బడిబాట కార్యక్రమం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి**





**ధర్మపురి, జూన్ 15, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి పట్టణంలోని 5వ వార్డు లోని ప్రభుత్వ పాఠశాల మరియు అంగన్‌వాడి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సంయుక్త బడిబాట కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఇంటింటికి వెళ్లి పాఠశాల వయస్సు గల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి చిన్నారి విద్యను అభ్యసించడం వారి హక్కు అని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం వంటి అనేక సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. అంగన్‌వాడి కేంద్రాలు చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు, ప్రాథమిక విద్యాభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంపు, డ్రాప్‌అవుట్‌ల నివారణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ప్రతి చిన్నారి బడిబాటలో నడిస్తేనే సమాజం అభివృద్ధి బాటలో నడుస్తుంది అని చైర్మన్ వేముల నాగలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడి సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన..

**తల్లిదండ్రులు పిల్లలను సర్కారు బడులలో చేర్పించాలి..**

**మండల విద్యాధికారి హేమలత**





**జమ్మికుంట, జూన్ 15 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రాథమిక పాఠశాలలో మొదటి రోజు హాజరైన విద్యార్థులకు ఉపాధ్యాయులు వినుత్న రీతిలో పూల బొకేలు అందజేస్తూ స్వాగతం పలికారు. చిన్నారులు ఉపాధ్యాయులు పాఠశాలలో సర్వాంగ సుందరంగా మామిడి తోరణాలతో అలంకరించి నూతనంగా పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి హేమలత మాట్లాడుతూ కోరపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి అభ్యున్నతి కోసం పాటుపడడమే కాకుండా పాఠశాల ముగిసిన తర్వాత ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సైతం స్టడీ అవర్స్ ను నిర్వహించడం జరుగుతుందని ఇది చాలా అభినందనీయమైన విషయం అని కొనియాడారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఆక్టివిటీస్ తో పాటు కూడిన విద్యను అందించడంతోపాటు సైన్స్ ఫెయిర్ తో విద్యార్థుల యొక్క సృజనాత్మకతను పెంచే విధంగా ఆలోచింప చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవీందర్, బలరాం తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు, తల్లిదండ్రులను డబ్బుల కోసం ఇబ్బంది పెట్టొద్దు: బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్



**మిర్యాలగూడ, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పుస్తకాలు, యూనిఫాంలు మరియు ఇతర ఫీజుల పేరుతో ఇబ్బందులకు గురి చేయవద్దని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ విద్యాసంస్థల యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యంగా కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఒక సామాన్యుడు తన పిల్లలను పాఠశాలలో చేర్పించాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యాసంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ సమస్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యాశాఖ అధికారులు ఫీజుల వసూళ్లు, పుస్తకాలు, యూనిఫాంల విక్రయాల విషయంలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టి నిబంధనలు అమలు చేయాలని సూచించారు. ఫీజుల వసూళ్లలో యాజమాన్యాలు ఉదారంగా, మానవతా దృక్పథంతో వ్యవహరించి తల్లిదండ్రులకు సహకరించాలని జాజుల లింగం గౌడ్ కోరారు.

# ఓట్లు తొలగించడానికి బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుంది

- బూత్ లెవెల్ పోలింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి
- ఓటర్లను కాపాడే బాధ్యత మీదే. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**ధర్మపురి, జూన్ 15, (ది క్రైమ్ న్యూస్):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా నుండి ఓట్లు తొలగించి అధికారంలోకి రావడానికి కుట్ర చేస్తుందని ఈ కుట్రను భగ్నం చేయాల్సిన బాధ్యత బూత్ లెవల్ పోలింగ్ ఏజెంట్లపై ఉందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం తెలంగాణ ప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్.ఐ.ఆర్ పై ధర్మపురి నియోజకవర్గ బూతు లెవెల్ పోలింగ్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతుందని అన్నారు. ఇందులో భాగంగా ఇటీవల వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో ఓటర్లను తొలగించడమే అందుకు ఉదాహరణ అని మంత్రి అడ్లూరి అన్నారు. బీజేపీ చేపట్టిన ఓట్ల తొలగింపు కుట్రను అడ్డుకోవడానికి రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో బూత్ స్థాయిలో పోలింగ్ ఏజెంట్లకు శిక్షణ ఇచ్చి ఓట్లు కాపాడాలని ఇచ్చిన పిలుపు మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ నిర్వహిస్తున్నామని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇందులో భాగంగా ధర్మపురి నియోజకవర్గంలో బూత్ లెవెల్ పోలింగ్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజక వర్గంలోని 269 పోలింగ్ బూతుల పరిధిలో 2.37లక్షల ఓటర్లు ఉన్నట్లు మంత్రి వివరించారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతో పాటు 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించాలంటే బూత్ లెవెల్ పోలింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి ప్రతి ఓటు నమోదు అయ్యే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు ఈనెల ఓటర్ల వద్దకు వచ్చే బూత్ లెవెల్ పోలింగ్ అధికారులకు అన్ని రకాల సమాచారం అందజేయాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్ చేస్తున్న ఆరోపణలపై మంత్రి అడ్లూరి మరో మారు స్పందించారు. ఇద్దరు నాయకులు అబద్దాలతో కాంగ్రెస్ పార్టీని బలహీనం చేయాలని చూస్తున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. మాజీ మంత్రులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై ఉందని ఆయన అన్నారు. వడ్ల కొనుగోలు, ఇసుక రవాణాలో తాను అవినీతికి పాల్పడ్డట్టు నిరూపిస్తే రాజీనామా చేస్తానని మంత్రి అడ్లూరి మరో మారు సవాలు విసిరారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి లాగా తాను నాయకులను వర్గాలుగా విభజించి మాట్లాడడం తనకు తెలియదని అన్నారు. ప్రాణం ఉన్నంత వరకు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు వెన్నుదన్నుగా నిలుస్తానని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. తాను అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఎలాంటి కక్ష సాధింపులు లేకుండా ముందుకు సాగుతున్నానని సోషల్ మీడియాలో కొంత మంది తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని వాటిని తిప్పికొట్టాలని నాయకులు, కార్యకర్తలకు మంత్రి అడ్లూరి పిలుపునిచ్చారు. అనంతరం ఏఐసిసి జనరల్ సెక్రెటరీ రుద్ర సంతోష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని బూత్ లెవెల్ పోలింగ్ ఏజెంట్లు ఇంటింటికి తిరిగి ప్రతి ఓటును కాపాడి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇచ్చిన హక్కును అందరు ఉపయోగించుకునే విధంగా కృషి చేయాలని ఏఐసిసి జనరల్ సెక్రెటరీ రుద్ర సంతోష్ అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో 2.37 లక్షల మంది ఓటర్లు ఉండగా ఇందులో 43 వేల ఓట్లు ఓట్లుగా ఉన్నాయని 47 వేల ఓట్లు అనుమాలిస్ ఓట్లుగా ఉన్నాయని సంతోష్ తెలిపారు. నియోజకవర్గంలో దాదాపు 90వేల ఓట్లు ప్రమాదంలో ఉన్నాయని ఈ ఓట్లను కాపాడాల్సిన బాధ్యత బూత్ లెవెల్ పోలింగ్ ఏజెంట్ పై ఉందని అన్నారు. ఈనెల 26వ తేదీ నుండి వచ్చేనెల 25వ తేదీ వరకు ప్రతి ఇంటికి బూతు లెవెల్ పోలింగ్ ఆఫీసర్ వస్తారని ఓటర్ కు సంబంధించిన అన్ని రకాల పత్రాలను అందజేయాల్సిన బాధ్యతను బూత్ లెవెల్ పోలింగ్ ఏజెంట్లు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి తో పాటు ధర్మపురి నియోజక వర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వివిధ గ్రామాల సర్పంచులు మార్కెట్ కమిటీ చైర్మన్ తదితరులు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.

# ఘనంగా ఉపముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు:హాజరైన మంత్రి అడ్లూరి.



**ధర్మపురి, జూన్ 15, (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్ హెచ్ గార్డెన్లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ మృదు స్వభావి మల్లు భట్టి విక్రమార్క మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర పురోభివృద్ధిలో భట్టి పాత్ర కీలకమని మంత్రి అడ్లూరి అన్నారు. కెసిఆర్ పాలనలో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే పనిలో భట్టి విక్రమార్క తన చతురతను ప్రదర్శిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలి

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. బాధితుల నుంచి అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి, చట్టప్రకారం వాటిని వేగవంతంగా పరిష్కరించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులకు సూచించారు. ఫిర్యాదులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, అందిన ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు మరింత చేరువయ్యే లక్ష్యంతో శాంతి భద్రతలను పరిరక్షిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ నిరంతరం కృషి చేస్తోందని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పరిపాలన కె శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక కృషి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) అన్నారు. నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమైన తొలి రోజు సందర్భంగా ఎమ్మెల్యే నియోజక వర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేసి, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించిన ఎమ్మెల్యే వారి విద్యాభ్యాసం, పాఠశాల పరిస్థితులపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక తరగతి గదుల ఏర్పాటు, పరిశుభ్రమైన వాతావరణం కల్పనతో పాటు మెరుగైన బోధన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసి విద్యార్థులకు ఉత్తమ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# నిర్వహణ పనుల కారణంగా నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

**మిర్యాలగూడ, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** 11 కేవీ బైపాస్ ఫీడర్ మరియు 11 కేవీ సీతారాంపురం ఫీడర్‌లలో నిర్వహణ పనులు చేపట్టనున్నందున మంగళవారం (16-06-2026) ఉదయం 8:30 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మిర్యాలగూడ టౌన్-1 ఏఈ పి. మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రగూడెం, శ్రీనగర్ కాలనీ, బంగారుగడ్డ, సీతారాంపురం, డాక్టర్స్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులు అలాగే రైతులు ఈ తాత్కాలిక అసౌకర్యాన్ని గమనించి విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

# 20, 21వ వార్డుల్లో కోతుల బెడద నివారణకు చర్యలు

- 100 కోతులను పట్టించిన మంకీ క్యాచర్స్ బృందం

**మిర్యాలగూడ, ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 20, 21వ వార్డుల్లో కోతుల సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కౌన్సిలర్ దేశిడి శ్రీలేఖ శేఖర్ రెడ్డి తెలిపారు. స్థానికంగా కోతుల బెడద తీవ్రంగా ఉందని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్‌ల దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి మంకీ క్యాచర్స్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో సోమవారం 20, 21వ వార్డుల్లో సుమారు 100 కోతులను పట్టుకున్నట్లు వెల్లడించారు. ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న కోతుల సమస్య కారణంగా పలువురు స్థానికులు ప్రమాదాలకు గురయ్యారని తెలిపారు. ముఖ్యంగా రెడ్డి కాలనీ ప్రాంతానికి ప్రతిరోజూ సుమారు 30 వేల మంది వ్యాపార, విద్య, వైద్య అవసరాల కోసం రాకపోకలు సాగిస్తుండటంతో కోతుల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇప్పటికే గత జనవరి నెలలో దాదాపు 300 కోతులను పట్టుకున్నామని, ప్రస్తుతం మరో 100 కోతులను పట్టుకున్నామని తెలిపారు. ఇంకా మిగిలిన కోతులను పూర్తిగా పట్టుకునే వరకు మంకీ క్యాచర్స్ బృందం ఇక్కడే కొనసాగుతుందని వెల్లడించారు. అలాగే రెడ్డి కాలనీ ప్రజల సమస్యలను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లిన ప్రతిసారి తక్షణమే స్పందించి పరిష్కారం చూపారని కొనియాడారు. రామాలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి, ఆలయ పరిసరాల్లో ఐమాక్స్ లైటింగ్,



ధనుర్మాసంలో భక్తుల సౌకర్యార్థం హైమాస్ట్ లైట్ల ఏర్పాటు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు కూడా వార్డు సమస్యల పరిష్కారంలో సహకరిస్తున్నందుకు రెడ్డి కాలనీ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా 20వ వార్డు అభివృద్ధికి పెద్దపీట వేస్తారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ వెలుగు ఇందిరా నాగరాజు, మాజీ కౌన్సిలర్ దేశిడి శేఖర్ రెడ్డి, బీజేపీ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్‌లో ఘనంగా జర్నలిస్ట్ కొమురవెల్లి భాస్కర్ పుట్టినరోజు వేడుకలు

- ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మాజీ జెడ్పిటిసి డాక్టర్ అయిల రమేష్
- మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదానం, స్వీట్ల పంపిణీ



**సుల్తానాబాద్, జూన్ 15(ది క్రైమ్ న్యూస్):** సమాజంలో అనవసర హంగులు, ఆర్భాటాలకు పోకుండా పేదలను, వికలాంగులను ఆదుకునే సేవా గుణమే అందరికీ ఆదర్శమని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మాజీ జెడ్పిటిసి డాక్టర్ అయిల రమేష్ అన్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు కొమురవెల్లి భాస్కర్ పుట్టినరోజును పురస్కరించుకొని సోమవారం స్థానిక మానసిక వికలాంగుల కేంద్రంలో వికలాంగులకు అన్నదానం, స్వీట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బిరుదు రాధాకృష్ణ, డాక్టర్ అయిల రమేష్‌లు మాట్లాడుతూ... అన్ని దానాల కంటే అన్నదానం ఎంతో గొప్పదన్నారు. పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాల పేరిట వేల రూపాయలు వృథా చేయకుండా, ఇలాంటి మానసిక వికలాంగుల కేంద్రాలలో అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. కొమురవెల్లి భాస్కర్ చూపిన ఈ సేవాభావాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కందుకూరి ప్రకాష్ రావు (పెద్దన్న), మార్కెట్ కమిటీ డైరెక్టర్ పల్ల వాసు శ్రీనివాస్, వోల్లాల రాజు, పెగడ పరశురాములు, ఏల్లే రాజు, యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజ్ కుమార్, రమేష్, స్థానిక జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ షీటర్ల నివాసాలను సందర్శించాలి

- పెద్దపల్లి జోన్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి రామ్ రెడ్డి
- గోదావరిఖని రెండు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్, వాహన తనిఖీలకు ఆదేశం






**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ షీటర్ల నివాసాలను సందర్శించాలి అని పెద్దపల్లి జోన్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి రామ్ రెడ్డి సూచించారు. సోమవారం గోదావరిఖని డివిజన్ పరిధిలోని గోదావరిఖని రెండు టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కు గోదావరిఖని రెండు టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్‌రావు, లింగమూర్తి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం రిసెప్షన్, స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. తదుపరి స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ పరిధిలో అధికంగా నమోదవుతున్న నేరాల స్వరూపం, రౌడీ షీటర్ల వివరాలు, అనుమానితుల ప్రస్తుత పరిస్థితులు గురించి ఆరా తీశారు. స్టేషన్‌వారీగా బ్లూ కోల్ట్స్ సిబ్బంది పనితీరు, వారి విధుల నిర్వహణ సమయాలను కూడా తెలుసుకున్నారు. అనంతరం డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అధికారులకు పలు సూచనలు చేస్తూ, రౌడీ షీటర్ల స్థితిగతులపై ప్రత్యక్షంగా ఆరా తీయాలన్నారు. సైబర్ నేరాలు, క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాల ప్రాముఖ్యత, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించి వారిని చైతన్యవంతులను చేయాలని పేర్కొన్నారు. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాల క్రయవిక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి, మత్తు పదార్థాల నియంత్రణకు నిరంతరం కృషి చేయాలని స్టేషన్ అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ అత్యంత అవసరమని, పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టాలని సూచించారు.

# ధర్మపురి బస్టాండ్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు

● అదనంగా రెండు కొత్త ప్లాట్ ఫామ్‌లు, 13 రూట్లలో కొత్తగా బస్ సౌకర్యం ● రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**ధర్మపురి, జూన్ 15, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి బస్టాండ్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి అన్ని విధాల అభివృద్ధి చేస్తామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం ఆర్టిసి కరీంనగర్ ఈడీ సోలామన్ కరీంనగర్ ఆర్ ఎం రాజు, జగిత్యాల డిపో మేనేజర్ తో కలిసి ధర్మపురి బస్టాండ్ ని మంత్రి అడ్లూరి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే నియోజకవర్గానికి ఐటిఐ తో పాటు డిగ్రీ కళాశాల మంజూరు చేయించామని త్వరలోనే బస్సు డిపో సాధిస్తామని అన్నారు. ధర్మపురి బస్టాండ్ అభివృద్ధికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిధులు ఇవ్వడానికి అంగీకరించారని అన్నారు. ధర్మపురి నుండి నిత్యం 4వేల నుంచి 5వేల మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రత్యేక నిధులతో బస్టాండ్ లో రెండు కొత్త ప్లాట్ ఫాంలు నిర్మిస్తామని మంత్రి అడ్లూరి తెలిపారు. రానున్న రోజుల్లో భక్తుల సౌకర్యాల కొరకు తాగునీటి తో పాటు శానిటేషన్ పనులు చేయిస్తామని మంత్రి తెలిపారు. ధర్మపురి నుండి వివిధ గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా కొత్తగా 13 రూట్లలో బస్సులు నడిపేందుకు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కరీంనగర్ నుండి రాత్రి 8 గంటలకు ప్రత్యేక బస్సు ధర్మపురి వరకు వస్తుందని ఇది చాలామంది ప్రయాణికులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. ఉదయం 8 గంటలకు ధర్మపురి నుండి ప్రత్యేక బస్సు కరీంనగర్ కు నడిపిస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ధర్మపురి నియోజకవర్గంలో ప్రయాణికులు బస్సుల కొరకు వేచి చూడకుండా ఆర్టీసీ సేవలు అందజేస్తామని మంత్రి ఈ సందర్భంగా ప్రయాణికులకు హామీ ఇచ్చారు.

# చట్టబద్ధమైన మార్గంలో వివాదాల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

● రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ● ఈ నెల 20న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** చట్టబద్ధమైన మార్గంలో వివాదాల పరిష్కారమే ప్రధాన లక్ష్యం అని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఈ నెల 20వ తేదీన, శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా వివాదాలు శాంతియుతంగా, రాజీ మార్గంలో పరిష్కారమవుతాయని తెలిపారు. రాజీకి అనువైన క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన, కుటుంబ మరియు వైవాహిక కేసులు, బ్యాంకు బకాయిల వసూళ్లు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు వంటి అంశాల్లో ఇరుపక్షాలు పరస్పరం చర్చించుకొని లోక్ అదాలత్ ద్వారా రాజీకి రావచ్చని పేర్కొన్నారు. చిన్నచిన్న వివాదాల కారణంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోకుండా, న్యాయశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకొని శాంతియుత పరిష్కారం పొందాలని సూచించారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పరిధిలోని పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, ఇతర పోలీసు సిబ్బందికి తగిన మార్గదర్శకాలు అందించి, రాజీకి అనువైన కేసులను గుర్తించాలని ఆదేశించారు. ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి, రాజీ కుదిరేలా కృషి చేయాలని సూచించారు. తమ కేసుల్లో రాజీ కావాలని కోరుకునే వ్యక్తులు సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా వివాదాలు త్వరితగతిన పరిష్కారమై బాధితులకు సత్వర న్యాయం అందుతుందని పేర్కొన్నారు. ఇరుపక్షాల సమ్మతితోనే రాజీ సాధ్యమవుతుందని, లోక్ అదాలత్‌లో కుదిరిన రాజీ చట్టపరంగా తుది తీర్పుగా పరిగణించబడుతుందని వివరించారు. ప్రతి కేసులో న్యాయమూర్తులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తల సమన్వయంతో పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు, పోలీసు శాఖ, న్యాయస్థానాలు సమన్వయంతో పనిచేస్తే చిన్న వివాదాలు పెద్ద సమస్యలుగా మారకముందే పరిష్కరించవచ్చని స్పష్టం చేశారు.

# బసంత్ నగర్ బిడ్డ- నరహరి విజయగాధకు ఘన సన్మానం

● పేదరికం నుండి ఢిల్లీ పీఠం వరకు ● స్వగ్రామంలో అపూర్వ స్వాగతం ● ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం ● మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్ష

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్ గ్రామానికి చెందిన పరికిపండ్ల నరహరి( ఐఏఎస్ ) మరోసారి తన ప్రతిభతో జిల్లా ప్రజలను గర్వపడేలా చేశారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయనకు ఇటీవల కేంద్ర ప్రభుత్వ భూ వనరుల విభాగంలో సంయుక్త కార్యదర్శిగా (జాయింట్ సెక్రటరీ ) ప్రతిష్ఠాత్మక పదోన్నతి లభించింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో విధుల్లో చేరిన అనంతరం తొలిసారిగా స్వగ్రామానికి వచ్చిన నరహరికి జిల్లా ప్రజలు, అభిమానులు, సామాజిక సంస్థల ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండేషన్ సభ్యులు నరహరిని ఘనంగా సన్మానించి తమ అభినందనలు తెలియజేశారు.

గ్రామీణ నేపథ్యంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల మధ్య జన్మించిన నరహరి తన జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ విద్యనే ఆయుధంగా చేసుకుని అంచెలంచెలుగా ఎదిగిన తీరు ప్రతి ఒక్కరినీ స్ఫూర్తి పరుస్తోందని పలువురు కొనియాడారు. "ఇంతింతై వటుడింతై" అన్న సామెతకు సజీవ ఉదాహరణగా నిలిచిన నరహరి, సాధారణ కుటుంబం నుంచి దేశ రాజధానిలో అత్యున్నత పరిపాలనా బాధ్యతలు నిర్వహించే స్థాయికి చేరుకోవడం అసాధారణ విజయమని పలువురు అభిప్రాయపడ్డారు. కష్టపడే తత్వం, పట్టుదల, ప్రజాసేవ పట్ల అంకితభావమే ఆయన విజయ రహస్యమని పేర్కొన్నారు. సమాజం పట్ల ప్రత్యేక బాధ్యతతో ముందుకు సాగుతున్న నరహరి మార్గదర్శకత్వంలో ఆలయ ఫౌండేషన్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తోందని సభ్యులు తెలిపారు. భవిష్యత్తులో ఈ సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి వేలాది మందికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, నరహరి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి దేశ పరిపాలనలో కీలక పాత్ర పోషించాలని, అదే సమయంలో తన మూలాలను మరువకుండా ఈ ప్రాంత అభివృద్ధికి కూడా తనవంతు సహకారం అందించాలని కోరుకున్నారు. బసంత్‌నగర్ గ్రామానికి చెందిన వ్యక్తి దేశ స్థాయిలో గుర్తింపు పొందడం జిల్లాకే గర్వకారణమని పేర్కొన్నారు.

నరహరి సాధించిన ఈ ఘనత యువతకు స్ఫూర్తిదాయకమని, పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా సంకల్పం, కృషి, విద్య ఉంటే ఏ శిఖరాన్నైనా అధిరోహించవచ్చని ఆయన జీవిత ప్రస్థానం మరోసారి నిరూపించిందని పలువురు ప్రశంసించారు. ప్రస్తుతం జిల్లాలో నరహరి పేరు విజయానికి, పట్టుదలకు, ప్రజాసేవకు ప్రతీకగా మారిందని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ డిప్యూటీ సీఈవో మిట్టపల్లి రాజేంద్ర కుమార్, కోర్ కమిటీ సభ్యులు జక్కుల నరేందర్ రావు, కన్నం తిరుపతి, డాక్టర్ ఆడెపు ఆంజనేయులు, పడాల మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



నరహరి ఐఏఎస్‌ను సన్మానిస్తున్న ఆలయ ఫౌండేషన్ సభ్యులు

# పెద్దపల్లికి మణిహారంగా బైపాస్ రోడ్డు నిర్మాణం....

- బైపాస్ రోడ్డుతో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం - ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు







**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కేంద్రానికి మణిహారంగా బైపాస్ రోడ్డు నిర్మాణం చేసి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆర్అండ్‌బీ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రభుత్వ విప్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణరావు మాట్లాడుతూ పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణలో రైతులు సహకరిస్తుండటం అభినందనీయమని అన్నారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి అధికారులు త్వరలోనే నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. బైపాస్ రోడ్డు అందుబాటులోకి వస్తే భారీ వాహనాలు పట్టణంలోకి ప్రవేశించాల్సిన అవసరం ఉండదని, దీంతో ట్రాఫిక్ సమస్యతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. పెద్దపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మించాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నప్పటికీ గత పాలకులు పట్టించుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.80 కోట్ల నిధులు మంజూరు చేయించామని విజయ రమణారావు వెల్లడించారు. ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయని, ఏడాదిన్నరలోగా నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బొద్దుల గంగయ్య, మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, కమిషనర్ ఆకుల వెంకటేష్, సంబంధిత శాఖ అధికారులు, కౌన్సిలర్లు దొడ్డుపల్లి జగదీశ్, అమ్రేష్, కాంగ్రెస్ నాయకులు మందల సత్యనారాయణరెడ్డి, ఆరె సంతోష్, కట్కూరి సుధాకర్‌రెడ్డి, అరుకుటి సంతోష్, కారింగుల రమేష్, పూదరి మహేందర్, ఓడ్నాల రమేష్, తిర్రి రాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీనివాస చేనేత సహకార సంఘం అధ్యక్షురాలిగా గోలి పద్మ ఏకగ్రీవ ఎన్నిక



**సుల్తానాబాద్, జూన్ 15 (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణ పరిధిలోని గాంధీనగర్ శ్రీ శ్రీనివాస చేనేత సహకార సంఘం అధ్యక్షురాలిగా గోలి పద్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఎన్నికల అధికారి గంజి శ్రీకాంత్ ఫలితాలను అధికారికంగా వెల్లడించారు. సంఘం నూతన కార్యవర్గానికి జరిగిన ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా గుండ రాజేశం, కోశాధికారిగా ఎనగంటి ఆగయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా సంఘం డైరెక్టర్లుగా పర్ష మల్లేశం, ఎనగంటి లక్ష్మీనారాయణ, బండి శాంతమ్మ, ఎలగం రాజేశం, ఎలిగేటి మార్కండేయ, బొద్దుల చక్రపాణిలు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన గోలి పద్మ మాట్లాడుతూ.. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల పథకాలు, రాయితీలు సకాలంలో లబ్ధిదారులకు అందేలా నా వంతుగా శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సంఘాన్ని ముందుకు నడిపిస్తానని పేర్కొన్నారు. పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికవడంతో సంఘం సభ్యులు, చేనేత కార్మికులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కార్మికులకు స్వీట్లు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు నూతన కమిటీకి తమ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## అగ్నివీర్‌గా ఖోఖో క్రీడాకారుడు సాహిత్ ఎంపిక

### సుల్తానాబాద్ ఖేలో ఇండియా సెంటర్‌లో ఘన సత్కారం



**సుల్తానాబాద్, జూన్ 15 (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన ఖేలో ఇండియా ఖోఖో సెంటర్ క్రీడాకారుడు అంబుల సాహిత్ భారత సైన్యంలో అగ్నివీర్‌గా ఎంపికయ్యారు. సాహిత్ సాధించిన ఈ విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం సాయంత్రం స్థానిక ఖేలో ఇండియా ఖోఖో సెంటర్‌లో ఆయనను క్రీడా ప్రముఖులు, నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. శాలువాతో కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ఎం. రవీందర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో అద్భుతమైన ప్రతిభ దాగి ఉంటుందని, దానికి సరైన శిక్షణ, పట్టుదల తోడైతే అంబుల సాహిత్ లాగా దేశ స్థాయిలో రాణించవచ్చని కొనియాడారు. ఖేలో ఇండియా ఖోఖో సెంటర్‌లో కఠినమైన క్రమశిక్షణతో శిక్షణ పొందడం వల్లే సాహిత్ ఈ రోజు భారత సైన్యంలో అగ్నివీర్‌గా ఎంపికయ్యారని అభినందించారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్ని మాత్రమే కాకుండా, దేశ సేవ చేయాలనే బలమైన ఆత్మవిశ్వాసాన్ని, దేశభక్తిని పెంపొందిస్తాయని ఆయన స్పష్టం చేశారు. సాహిత్ సాధించిన ఈ విజయం సుల్తానాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల యువతకు ఒక దిక్సూచిలా నిలుస్తుందని, భవిష్యత్తులో ఈ సెంటర్ నుండి మరెంతో మంది యువకులు సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని, వీటి ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. దేశ సేవకు ఎంపికైన సాహిత్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి అమ్మిశెట్టి తిరుపతి, తెలంగాణ ఒలింపిక్ సంఘం సభ్యులు సిలివేరి మహేందర్, ఖేలో ఇండియా ఖోఖో సెంటర్ కోచ్, మాజీ భారత క్రీడాకారుడు గెల్లు మధుకర్ యాదవ్, స్పోర్ట్స్ క్లబ్ బాధ్యులు అజ్జు, సత్యనారాయణ, వెంకటేష్ , స్థానిక క్రీడాకారులు పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తితోనే సమాజ నిర్మాణం

- బీసీ జేఏసీ చైర్పర్సన్ దాసరి ఉష - ఘనంగా ముగిసిన జ్యోతిబా పూలే-అంబేద్కర్ క్రికెట్ టోర్నమెంట్




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బీసీ జేఏసీ చైర్‌పర్సన్ దాసరి ఉష–ఆశిష్ పటేల్ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా,పెద్దపల్లి నియోజకవర్గంలో గత రెండు నెలలుగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జ్యోతిబా పూలే–అంబేద్కర్ జై యుగం క్రికెట్ టోర్నమెంట్ సోమవారం అట్టహాసంగా ముగిసింది. క్రీడా స్ఫూర్తిని చాటుతూ జరిగిన ఈ మెగా టోర్నమెంట్‌లో మొత్తం 140 జట్లు పాల్గొనగా,1,540 మంది క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. రెండు మసల పాటు జరిగిన ఈ క్రీడా సంబరాల్లో భాగంగా మొత్తం 141 మ్యాచులు నిర్వహించడం విశేషం. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన అసెంబ్లీ స్థాయి ఫైనల్ మ్యాచ్‌లో 14వ వార్డు జట్టు మరియు చిన్నకాల్వల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఈ తుది పోరులో చిన్నకాల్వల జట్టు విజేతగా నిలిచి రూ.1లక్ష నగదు బహుమతి మరియు షీల్డ్‌ను కైవసం చేసుకుంది. రన్నరప్‌గా నిలిచిన 14వ వార్డు జట్టుకు రూ.50 వేల నగదు బహుమతిని ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన దాసరి ఉష విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు కేవలం వినోదం కోసమే కాకుండా, యువతలో క్రమశిక్షణను, పట్టుదలను మరియు సమష్టి తత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జ్యోతిబా పూలే, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా మన యువత క్రీడల్లోనూ రాణించి, సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, క్రీడా స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి శంకర్, మహిళా కన్వీనర్ సిరవేన స్వప్న, 20వ వార్డు మాజీ కౌన్సిలర్ రెవల్లి స్వామి, 14వ వార్డు కౌన్సిలర్ అస్లాం పర్వేజ్, చిన్నకల్వల బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు కృష్ణా రావు, సీనియర్ క్రికెటర్లు రాధాస్వామి, శ్రావణ్, అసెంబ్లీ కోఆర్డినేటర్లు అబ్దుల్ మాలిక్, ముల్కూరి శేఖర్, భూమేష్, పట్టణ ఆర్గనైజర్లు ఆడమ్ బబ్బి, బొజ్జ శ్రావణ్, మండల ఆర్గనైజర్లు శ్రావణ్, మహేష్, అరవింద్, రాహుల్, సాగర్, అజీమ్, తదితరులు పాల్గొన్నారు.

# రూ.90 లక్షలతో బీటీ రోడ్డు పనులకు శ్రీకారం

● చందానగర్‌లో పనులను పరిశీలించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** చందానగర్ డివిజన్ పరిధిలోని జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65) పీజేఆర్ రోడ్డు నుంచి అపర్ణ వరకు రూ.90 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సోమవారం సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఎన్‌హెచ్-65 నుంచి పీజేఆర్ రోడ్డు, అపర్ణ జంక్షన్ వరకు రూ.90 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణంతో కాలనీవాసులు, ప్రయాణికులు, వాహనదారులకు ఉపశమనం లభిస్తుందని, ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గి ప్రయాణం మరింత సాఫీగా సాగుతుందని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలబెడతామని గాంధీ తెలిపారు. రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని,



నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులకు సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థ కల్పించేందుకు కృషి చేస్తానని, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆరెకపూడి గాంధీ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు నాగరాజు, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రక్షాళనలో ప్రతి కార్యకర్త భాగస్వామ్యం కావాలి: రవికుమార్ యాదవ్


**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఓటరు జాబితా ప్రక్షాళనలో ప్రతి కార్యకర్త భాగస్వామ్యం కావాలని రవికుమార్ యాదవ్ అన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం మసీద్‌బండలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్, రాష్ట్ర నాయకులు బల్దా అశోక్, అజిత్, హనుమంత్ నాయక్, ప్రభాకర్ యాదవ్, పద్మ, ఎస్ఐఆర్ కన్వీనర్ మాణిక్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 20 సంవత్సరాల తర్వాత చేపడుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా కాలనీలు, బస్తీలు, బూత్‌ల స్థాయిలో ఓటరు జాబితా ప్రక్షాళన జరిగే అవకాశం లభించిందని అన్నారు. ఈ ప్రక్రియలో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులతో (బీఎల్‌వోలు) పాటు పార్టీ బీఎల్ఏ-2లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి లేని వ్యక్తుల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించి, అర్హులైన నిజమైన ఓటర్ల పేర్లు నమోదు అయ్యేలా చూడాలని అన్నారు. గతంలో దొంగ ఓట్ల తొలగింపు కోసం అనేక ప్రయత్నాలు జరిగినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదని, ప్రస్తుతం



ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పార్టీ ఆశావహులు, సీనియర్ నాయకులు, డివిజన్ నాయకులు, కాలనీ, బస్తీ స్థాయి నాయకులు బీఎల్ఏలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు కూడా ఎస్ఐఆర్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అనిల్ గౌడ్, రాధాకృష్ణ యాదవ్, స్రవంతి, కృష్ణంరాజు, ఎల్లేష్, లక్ష్మణ్, వేణుగోపాల్ రెడ్డి, అరవింద్, ఆంజనేయులు, వరలక్ష్మి, గణేష్, సీతారామరాజు, మనిభూషణ్, జ్యోతి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాల సన్నద్ధతపై సైబరాబాద్ సీపీ సమీక్ష

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** వర్షాకాలంలో నీటి నిల్వలు, ట్రాఫిక్ అంతరాయాలు, చెట్లు కూలిపోవడం వంటి అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ సోమవారం జూమ్ సమావేశం నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్, శాంతిభద్రతల అధికారులతో కలిసి పోలీస్ స్టేషన్‌ల వారీగా వాటర్ లాగింగ్ పాయింట్ల పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వర్షాల కారణంగా నీటి నిల్వలు ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన ప్రాంతాల్లో సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు. వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో సమన్వయం కొనసాగించాలని, భారీ వర్షాలు కురిసే సమయంలో శాంతిభద్రతల విభాగం ఎస్‌హెచ్‌వోలు అదనపు సిబ్బందిని మోహరించి పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి నీటి ప్రవాహ మార్గాలను గుర్తించి, నీరు వేగంగా వెళ్లేలా చర్యలు తీసుకోవడం ద్వారా నీటి నిల్వలను తగ్గించాలని తెలిపారు. రోడ్లపై వాహనాలు నిలిచిపోవడం, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, కొనసాగుతున్న రోడ్డు పనులు, పూర్తయిన పనుల స్థితిగతులపై కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద విధులు నిర్వహించే అధికారులకు స్పష్టమైన బాధ్యతలు కేటాయించాలని పేర్కొన్నారు. ట్రాఫిక్, శాంతిభద్రతల విభాగాలు జీహెచ్ఎంసీ, ఎన్‌డీఆర్ఎఫ్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీపీ డా. ఎం. రమేష్ సూచించారు. ఈ సమావేశంలో శేరిలింగంపల్లి





ట్రాఫిక్ అదనపు డీసీపీ హనుమంతరావు, ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, ట్రాఫిక్ మరియు శాంతిభద్రతల విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# గఫూర్‌నగర్ ఇన్‌లెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం త్వరలోనే: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కొండాపూర్ డివిజన్ పరిధిలోని గఫూర్‌నగర్ కాలనీలో నెలకొన్న ఇన్‌లెట్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ, సీఎంసీ ఇంజినీరింగ్ విభాగం, ప్రాజెక్ట్స్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ గఫూర్‌నగర్ కాలనీలో ఇన్‌లెట్ సరిగా లేకపోవడం, కుంచించుకుపోవడం, చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల మురుగు నీటి సమస్య తీవ్రంగా మారిందన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వర్షాకాలంలో కాలనీ ముంపునకు గురికాకుండా వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని, ఇన్‌లెట్‌ను వెంటనే మరమ్మతులు చేసి డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను మరమ్మతులు చేసి, ఎయిర్‌టెక్ యంత్రాల సహాయంతో ప్రతి మ్యాన్‌హోల్‌లో పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారాన్ని తొలగించి నీటి ప్రవాహం నిరాటంకంగా సాగేలా చూడాలని సూచించారు. భవిష్యత్తులో ఈ సమస్య పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపారు. కాలనీవాసులకు ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని,



ప్రజలకు ఎదురయ్యే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తాను అందుబాటులో ఉంటానని గాంధీ హామీ ఇచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంసీ ఈఈ గోవర్ధన్, ప్రాజెక్ట్స్ డీఈ ధీరజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఉస్మానియా విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి

● ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం...

**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి గౌరవ మల్లు భట్టివిక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మర్యాద పూర్వకంగా ఉప ముఖ్యమంత్రితో ఓయూ వీసీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మల్లు భట్టివిక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఓయూ లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, విద్యా, పరిశోధనలను ఉపముఖ్యమంత్రికి వివరించిన ప్రొఫెసర్ కుమార్.... ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం చూపుతున్న చొరవకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ లేదా ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అంశాన్ని పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై ఉపముఖ్యమంత్రి గౌరవ మల్లు భట్టివిక్రమార్క ఓయూ ప్రతినిధి బృందాన్ని ఆరాతీశారు. ప్రభుత్వం వీలైనంత త్వరగా సానుకూల నిర్ణయంతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఓయూ ప్రతినిధి బృందం తెలిపింది. ఈ విషయమై తన అవసరమైన సహకారం, జోక్యం ఉంటుందని భరోసా కల్పించారని పేర్కొంది. ఉపముఖ్యమంత్రిని కలిసిన వారిలో రిజిస్ట్రార్ ఆచార్య జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ఆచార్య జితెందర్ కుమార్ నాయక్, ఆచార్య జి. మల్లేశం, డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు ఉన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది సంక్షేమం,



సమస్యల పరిష్కారం దిశగా సానుకూల దృక్పథంతో అండగా నిలుస్తున్న ప్రొఫెసర్ కుమార్ మొలుగరం కు ఓయూ అధ్యాపకులు ఆచార్య పి చంద్రశేఖర్, ఆచార్య సిహెచ్ శ్రీనివాస్, ఆచార్య బి మంగు, ఆచార్య రాజేందర్ నాయక్ లు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నేతృత్వంలోనే ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

# లక్షెట్టిపేట శ్రీ లోకల్ ఆటో యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక



**లక్షెట్టిపేట జూన్ 15 (ది క్రైమ్ న్యూస్):** లక్షెట్టిపేట శ్రీ లోకల్ ఆటో యూనియన్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.గౌరవ అధ్యక్షులుగా షేక్ మోయిన్, అధ్యక్షులు గా పోతురాజు శ్రీనివాస్ ,ఉపాధ్యక్షులు పాలాజీ శ్రీనివాస్ ,ప్రధాన కార్యదర్శి గరిసే సుధాకర్, క్యాషియర్ ఎం డి హైమద్ షా ఖాన్.ప్రచార కార్యదర్శి కోడి సత్యం. జాయింట్ సెక్రెటరీ షబ్బీర్ ఖాన్. ముఖ్య సలహాదారులు ఇజ్జత్ షా ఖాన్ పొన్నం శ్రీనివాస్ నూతికట్ల రాజన్న గాజుల రమేష్ గౌడ్ నో ఎన్నుకున్నట్లు ప్రచార కార్యదర్శి కోడి సత్యం తెలిపారు. ఇట్టి కార్యవర్గ సభ్యులందరికీ శ్రీలోకల్ ఆటో యూనియన్ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.

# దీప్తి శ్రీ నగర్‌లో రోడ్డు ఆక్రమణల తొలగింపుకు ప్రజావాణిలో ఫిర్యాదు



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** దీప్తి శ్రీ నగర్‌లో ప్రధాన రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ యార్డును తక్షణమే తొలగించాలని కోరుతూ సోమవారం "జనం కోసం" సంస్థ ప్రధాన కార్యదర్శి నాగం రాజశేఖర్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హ్యుందాయ్ సర్వీసింగ్ సెంటర్ పక్కన ఉన్న రహదారిపై అక్రమంగా నిర్వహిస్తున్న మార్కెట్ కారణంగా కాలనీవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ మియాపూర్ ఉప కమిషనర్‌తో పాటు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన "దీప్తి శ్రీ నగర్ సీతారామయ్య మార్కెట్ యార్డ్" బోర్డును కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజా రహదారులను ఆక్రమణల నుంచి పరిరక్షించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

# వృద్ధురాలి ఖాతా నుంచి రూ.5 లక్షలు కాజేసిన వ్యక్తి అరెస్ట్

## నిందితుడి వద్ద నుంచి నగదు స్వాధీనం



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** వృద్ధ మహిళ నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.5 లక్షలు అక్రమంగా బదిలీ చేసిన వ్యక్తిని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం మాధాపూర్ అయ్యప్ప సొసైటీకి చెందిన 66 ఏళ్ల మహిళ యూనియన్ బ్యాంక్‌లో పొదుపు ఖాతా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మే 9, 11 తేదీల్లో ఆమె అనుమతి లేకుండా ఖాతా నుంచి మొత్తం రూ.5 లక్షలు బదిలీ అయినట్లు గుర్తించారు. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ సేవలను ఆమె వినియోగించకపోవడంతో మోసానికి గురైన విషయం తెలిసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక విశ్లేషణ, మొబైల్ లొకేషన్ ట్రాకింగ్, కాల్ డేటా రికార్డుల ఆధారంగా కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్న నరేందర్ (37)ను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో నిందితుడు బాధితురాలి కుటుంబంతో సన్నిహిత పరిచయం పెంచుకుని వారి ఇంటికి తరచూ వెళ్లివస్తూ నమ్మకాన్ని సంపాదించినట్లు తేలింది. ఆ క్రమంలో బాధితురాలి మొబైల్ ఫోన్‌లో బ్యాంకింగ్‌కు సంబంధించిన యాప్‌లను ఇన్‌స్టాల్ చేసి, ఆమెకు తెలియకుండా బ్యాంకు ఖాతాలోని డబ్బును వివిధ ఆన్‌లైన్ గేమింగ్ ఖాతాలకు బదిలీ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడు ఆ మొత్తాన్ని ఆన్‌లైన్ గేమింగ్ కార్యకలాపాల కోసం వినియోగించినట్లు విచారణలో బయటపడింది. అతని వద్ద నుంచి రూ.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు, నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా ప్రజలు తమ బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఇతరులతో పంచుకోవద్దని, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రతిభావంతులైన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాల మంజూరుకు కృతజ్ఞతలు

**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ మరియు మా రాష్ట్ర క్రీడాకారుల తరపున, పతకాలు సాధించిన మా క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలను మంజూరు చేసినందుకు మీకు మరియు తెలంగాణ ప్రభుత్వానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రతి క్రీడాకారుడికి, రాష్ట్రం నుండి లభించే గుర్తింపు పతకంతో సమానంగా ముఖ్యమైనది. ఈ నిర్ణయం క్రీడాకారులకు మరియు వారి కుటుంబాలకు అపారమైన ఆనందాన్ని తెచ్చిపెట్టింది మరియు తెలంగాణ ప్రభుత్వం తమ క్రీడా ప్రతిభ వెనుక దృఢంగా నిలుస్తుందని బలమైన సందేశాన్ని పంపింది. ఈ చొరవకు మద్దతు తెలిపిన క్రీడల మంత్రికి నా కృతజ్ఞతలు కూడా తెలియజేస్తున్నాను. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంలో సహకరించిన తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌కి, వైస్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్‌కి కూడా నా కృతజ్ఞతలు. తెలంగాణ క్రీడా సమాజం ప్రభుత్వం అందించిన ప్రోత్సాహానికి కృతజ్ఞతతో ఉంది. మా క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు సృష్టించడంలో మరియు రాష్ట్రానికి, దేశానికి మరింత ఉన్నత గౌరవాలు సాధించడంలో సహాయం చేయడానికి మీతో కలిసి పనిచేయడానికి మేము ఎదురుచూస్తున్నాము.

# విశ్వేజి

# సడెన్ గా షుగర్ లెవల్స్ పెరిగితే ఇలా చెయ్యండి!!



ప్రస్తుత సమాజంలో డయాబెటిస్ అతిపెద్ద సమస్య. దీర్ఘకాలిక సమస్య అయిన డయాబెటిస్ తో ప్రస్తుతం చాలామంది బాధపడుతున్నారు. ఇక డయాబెటిస్ బారిన పడినవారు నిర్లక్ష్యంగా ఉంటే అది వారి ప్రాణాలు మీదికే వస్తుంది. కొంతమందికి సడన్ గా డయాబెటిస్ పెరుగుతూ ఉంటుంది. అటువంటి సమయంలో ఏం చేయాలి? ఏం చేస్తే మనం డయాబెటిస్ ను కంట్రోల్ చేయవచ్చు? అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. షుగర్ లెవెల్స్ 370 దాటిందంటే ప్రాణాల మీదకు వచ్చినట్టే షుగర్ లెవెల్స్ విపరీతంగా పెరిగితే అది శరీరంలోని ఆర్గాన్స్ మీద ప్రభావం చూపిస్తుంది. శరీరంలోని కాలేయం, మూత్రపిండాలు, గుండె, మెదడు, నరాలు దెబ్బతింటాయి. సడన్ గా గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంటుంది. షుగర్ లెవెల్స్ 370 దాటిందంటే ప్రాణాల మీదకు వచ్చినట్టే భావించాలి. ఇక అటువంటి సమయంలో షుగర్ లెవల్స్ తగ్గించడానికి టెన్షన్ పడకుండా కొన్ని చిట్కాలను పాటిస్తే మంచిది. షుగర్ లెవల్స్ బాగా పెరిగినప్పుడు ఇలా చెయ్యండి చాలా సందర్భాలలో విపరీతమైన పని ఒత్తిడి కారణంగా షుగర్ లెవెల్స్ పెరిగితే దానిని నేచురల్ గా తగ్గించుకోవడానికి ప్రయత్నం చేయాలి. ఆహారపు అలవాట్లను మార్చుకోవడం మాత్రమే కాకుండా, వ్యాయామం, యోగ వంటివి చేయాలి. సమయానికి మందులు వేసుకోవాలి.షుగర్ లెవల్స్ బాగా పెరిగినప్పుడు ఎక్కువగా నీళ్లు తాగాలి. బాడీ హైడ్రేట్ అయితే చాలా వరకు షుగర్ కంట్రోల్ లోకి వస్తుంది. షుగర్ లెవల్స్ పెరిగితే ఈ మార్పులు చెయ్యాల్సిందే నీళ్లు ఎక్కువ తాగడం వల్ల ఎక్కువ యూరిన్ పాస్ చేయాల్సి వస్తుంది. అప్పుడు శరీరంలో అధికంగా ఉన్న గ్లూకోజ్ బయటకు పోతుంది . విపరీతంగా షుగర్ లెవెల్స్ ఉంటే ఆందోళన చెందితే షుగర్ లెవెల్స్ మరింత పెరుగుతాయి. కనుక ఆందోళన చెందకుండా ఉండాలి. షుగర్ లెవెల్స్ విపరీతంగా ఉంటే తినే ఆహారం విషయంలో మార్పు చేసుకోవాలి. కార్బోహైడ్రేట్స్ తీసుకోకుండా చూసుకోవాలి. షుగర్ లెవెల్స్ కంట్రోల్ కాకపోతే కచ్చితంగా ఇలా చెయ్యాలి అంతేకాదు మందులు వేసుకుంటున్నా షుగర్ లెవెల్స్ కంట్రోల్ కాకపోతే కచ్చితంగా వైద్యుడిని సంప్రదించాలి. అప్పుడు వైద్యులు మందులలో మార్పులు చేసి షుగర్ కంట్రోల్ చేయడానికి ప్రయత్నం చేస్తారు.



## ఈసీజీ చూసి గుండె ఆరోగ్యంగా ఉందని నమ్ముతున్నారా? అలెర్ట్!

మీ గుండె ఆరోగ్యంగా ఉందా? మీ గుండె ఆరోగ్యంపై ఈసీజీ తీసుకుని గుండె ఆరోగ్యంగా ఉందని భ్రమ పడుతున్నారా? గుండె ఆరోగ్యం కోసం తీసే ఈసీజీ దాని స్థితిని కచ్చితంగా చెబుతుంది అని మీరు అనుకుంటున్నారా? అయితే మీరు ఈ వార్త చదవాల్సిందే. ఈసీజీతో గుండె ఆరోగ్యం తెలుస్తుందా? కేవలం ఈసీజీ తీయించుకుంటే గుండె ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా చెప్పలేము. అందుకే గుండె ఆరోగ్యం గురించి తెలుసుకోవాలనుకుంటే ఈసీజీ మీదనే డిపెండ్ కాకూడదని వైద్యులు చెబుతున్నారు. ఈసీజీ తో పాటు మరో రెండు పరీక్షలు చేయించుకుంటేనే గుండె ఆరోగ్యం పైన పూర్తి అవగాహన వస్తుందని చెబుతున్నారు. ఈసీజీ లో ఫలితాలు సాధారణంగా ఉన్నప్పటికీ గుండె అసలు స్థితిని అది పూర్తి స్థాయిలో చూపించదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గుండె పరిస్థితిని తెలుసుకోవాలంటే ఈ టెస్ట్ లు ముఖ్యం గుండె ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికి మనం తీసుకునే ఈసీజీ కేవలం 20 నుంచి 30% మాత్రమే మన గుండె ఆరోగ్యానికి తెలియజేస్తుందని, పూర్తి స్థాయిలో అది మన గుండె ఆరోగ్యం గురించి, గుండె పరిస్థితిని కచ్చితంగా తెలుసుకోవాలంటే టిఎంటి, ఎకో కార్డియోగ్రఫీ వంటి ముఖ్యమైన పరీక్షలు ఉన్నాయని, అవి చేయించుకుంటే గుండె ఆరోగ్య పరిస్థితి తెలుస్తుందని అంటున్నారు. ఈసీజీలో ఏమైనా మార్పులు కనిపించినా అది ప్రమాద సంకేతం టిఎంటి అంటే ట్రెడ్మిల్ టెస్ట్, ట్రెడ్మిల్ మీద రోగి నడుస్తున్నప్పుడు, లేదా పరిగెడుతున్న దాని వేగం వాళ్ళు పెంచుతూ ఉంటే గుండె పనితీరు ఏ విధంగా ఉంది అనేది అంచనా వేస్తూ ఈసీజీ రికార్డ్ చేస్తారు. ఈ పరీక్షలో చాతినొప్పి వచ్చినా, ఈసీజీలో ఏమైనా మార్పులు కనిపించినా అది ప్రమాద సంకేతం అని వైద్యులు చెబుతున్నారు. ఎకో కార్డియోగ్రఫీ అల్ట్రాసౌండ్ ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికి మరొక ముఖ్యమైన పరీక్ష ఎకో కార్డియోగ్రఫీ, ఎకో కార్డియోగ్రామ్. ఇది ఒక రకమైన అల్ట్రాసౌండ్ ద్వారా చేసే పరీక్ష. దీని ద్వారా గుండె కదలికలు ఈజీగా తెలుస్తాయి. ఈ పరీక్షలో గుండె యొక్క లోపలి భాగాలను, అది పనిచేసే విధానాన్ని రియల్ టైం లో చూడడం జరుగుతుంది. ఇది మన గుండె యొక్క పనితీరును కొలిచి చెబుతుంది. ఈసీజీని నమ్ముకుని గుండె ఆరోగ్యంపై భ్రమ పడొద్దు గుండె వాల్వ్ ల పరిస్థితి గదుల పరిమాణం వాటి మధ్య ఏమైనా సంబంధం ఉందా అంటే అనేక విషయాలను తెలియజేస్తుంది. ఇక ఈ పరీక్ష ద్వారా మన గుండె ఆరోగ్యాన్ని తెలుసుకోవచ్చు. ఒక్క ఈసీజీని నమ్ముకొని గుండె ఆరోగ్యంగా ఉందని భ్రమ పడవద్దు అని వైద్యులు చెబుతున్నారు.

## రోజూ గుప్పెడు ఇవి తింటే చాలు..
# మీ గుండెకు డోకా లేదు!



పిస్తా పప్పులు.. చూడటానికి చిన్నగా, ముట్టుకుంటే గట్టిగా ఉన్నా, వీటిలో బోలెడన్ని పోషకాలు దాగున్నాయి. ఇవి రుచిగా ఉండటమే కాదు, మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు పిస్తాలో ఉన్నాయి రోజూ గుప్పెడు పిస్తాపప్పులు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. అవేంటో ఇప్పుడు చూద్దాం.. పోషకాల గని: పిస్తా పప్పుల్లో మన శరీరానికి అవసరమైన అనేక పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. కండరాల నిర్మాణానికి, శరీర ఎదుగుదలకు ప్రోటీన్ చాలా అవసరం. పిస్తా పప్పుల్లో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. జీర్ణక్రియను మెరుగుపరచడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి ఫైబర్ సహాయపడుతుంది. ఈ పప్పులో ఇవి దండిగా ఉంటుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడే మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు పిస్తాలో ఉంటాయి. విటమిన్ బి6, థయామిన్, విటమిన్ ఇ వంటి విటమిన్లు పిస్తాలో లభిస్తాయి. ఇవి శరీరంలోని వివిధ అవయవాల పనితీరును మెరుగుపరుస్తాయి. పొటాషియం, మెగ్నీషియం, ఫాస్పరస్, కాపర్ వంటి ఖనిజాలు పిస్తాలో ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. శరీరంలోని ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే హానిని తగ్గించే యాంటీఆక్సిడెంట్లు పిస్తాలో పుష్కలంగా ఉంటాయి. గుండెకు మేలు: పిస్తా పప్పులు గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. పిస్తా పప్పుల్లో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు చాలా ఉపయోగకరం. పిస్తాలోని యాంటీఆక్సిడెంట్లు కూడా మధుమేహం వల్ల కలిగే సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి.బరువు తగ్గడానికి సహాయం: పిస్తా పప్పుల్లో ప్రోటీన్, ఫైబర్ అధికంగా ఉండటం వల్ల కడుపు నిండిన భావన కలిగి, ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేస్తాయి. తద్వారా తక్కువ కేలరీలు తీసుకోవడానికి, బరువు తగ్గడానికి సహాయపడతాయి. పిస్తా పప్పుల్లో ల్యూటిన్, జియాక్సంతిన్ అనే యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కంటిశుక్లం, వయసు సంబంధిత మచ్చల క్షీణత  వంటి కంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తాయి . పిస్తాలోని విటమిన్ ఇ, ఫోలేట్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు మెదడు పనితీరును మెరుగుపరచడానికి, జ్ఞాపకశక్తిని పెంచడానికి సహాయపడతాయి. "వృద్ధాప్యం త్వరగా రాకుండా ఈ ఆహారాలు తినండి!" చర్మ సౌందర్యం: పిస్తా పప్పుల్లోని విటమిన్ ఇ, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా, కాంతివంతంగా ఉంచడానికి సహాయపడతాయి. ఇవి చర్మంపై ముడతలు, మచ్చలను తగ్గించి, యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. పిస్తా పప్పుల్లోని యాంటీఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించి, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. పిస్తా పప్పులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే, వీటిని మితంగా తీసుకోవడం మంచిది. ఎందుకంటే వీటిలో కేలరీలు కూడా ఎక్కువే ఉంటాయి. రోజుకు గుప్పెడు (సుమారు 30 గ్రాములు) పిస్తా పప్పులు తింటే సరిపోతుంది.

# మార్కెట్

## ఉద్యోగులకు టీసీఎస్ తీపి కబురు..

### 80 శాతం ఉద్యోగుల వేతనాలు పెంపు

పెద్ద ఎత్తున ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించి షాకిచ్చిన భారత్‌లోని అతి పెద్ద ఐటీ సర్వీసుల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇప్పుడు తీపి కబురు చెప్పింది. దాదాపు 80 శాతం ఉద్యోగుల వేతనాలను పెంచుతున్నట్లు  తెలిపింది. టీసీఎస్ తాజా నిర్ణయంతో జూనియర్, మధ్య స్థాయి (సీ3ఏ గ్రేడ్ వరకు) ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. సెప్టెంబర్ 1 నుంచి వేతన పెంపులను అమలు చేయనున్నట్టు ఉద్యోగులకు పంపిన ఈ మెయిల్‌లో టీసీఎస్ సీహెచ్‌ఆర్‌వో మిలింద్ లక్కడ్ తెలిపారు. కాగా, ఇటీవలే టీసీఎస్ పెద్ద ఎత్తున లేఆఫ్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తన మొత్తం ఉద్యోగుల్లో 2 శాతం మందికి ఉద్వాసన పలకనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది కల్లా దాదాపు 12,200 మంది ఉద్యోగులపై దీని ప్రభావం పడనున్నది. మధ్య స్థాయి, సీనియర్ స్థాయి ఉద్యోగులపై అధికంగా వేటు పడే అవకాశం ఉంది. ఈ విషయాన్ని టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కే కృతివేశన్ మనీకంట్రోల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. లేఆఫ్స్ ప్రకటన వేళ కంపెనీ జీతాల పెంపు నిర్ణయం ఉద్యోగులకు ఊరటనిచ్చే అంశమనే చెప్పాలి.




## బ్యాంకుల్లో గోల్డ్ లోన్ తీసుకుంటున్నారా?..
# ఒక్కసారి ఆలోచించండి!



హైదరాబాద్ : మీకు గోల్డ్ లోన్ కావాలా? వెంటనే కావాలా? కుదువబెట్టిన బంగారం తక్కువ వడ్డీకి మరో చోట పెట్టాలనుకుంటున్నారా? వంటి ప్రకటనలు ఆకట్టుకుంటాయి. ప్రజల ఆర్థిక అవసరాల కోసం గోల్డ్ లోన్లు (%+శీశ్రీస రాఋఅ%) ఒక ఆకర్షణీయ ఎంపికగా కనిపిస్తాయి. అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%=దీ×%) తాజాగా జారీ చేసిన నూతన నిబంధనలు గోల్డ్ లోన్ తీసుకునే వారికి కొత్త సవాళ్లను తెచ్చిపెట్టాయి. అవి ప్రజల పాలిట పిడుగులా మారాయి. గోల్డ్ లోన్ల చెల్లింపు కాలం, వడ్డీ రేట్లు, ఇతర షరతులు కఠినతరంగా మారాయి. ఒక్కో బ్యాంకులో ఈ నిబంధనలు వేర్వేరుగా అమలవుతున్నాయి. కానీ, రుణగ్రహీతలు ఇకపై జాగ్రత్తగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. వైద్య చికిత్స కోసం, పిల్లల చదువుల కోసం, వ్యాపారం నిమిత్తం, వ్యవసాయ అవసరాల కోసం తీసుకొనే రైతులు, మహిళలు, యువత ఇకపై జాగ్రతగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తీసుకున్న అప్పు మొత్తం వడ్డీసహా ఏడాదిలోగా చెల్లించాలంటే యాడికెళ్లి తేవాలని బాధపడవద్దు. ముందే ఆర్థిక పరిస్థితులను అంచనా వేసుకొని గోల్డ్‌లోను కోసం ముందుకెళ్లాల్సి ఉన్నది. ఎందుకంటే.. ఆర్బీఐ 2025 డ్రాఫ్ట్ మార్గదర్శకాలు గోల్డ్ లోన్లపై కఠిన నియంత్రణలను తీసుకొచ్చింది. గతంలో గోల్డ్ లోన్ తీసుకుంటే ఏడాదికి ఏడాది రెన్యూవల్ చేసుకొనే సౌలభ్యం ఉండేది. కానీ, ఇప్పుడు దానికి తొలగించారు. 12 నెలలు గరిష్ఠ పరిమితి విధించారు. 12 నెలలు దాటితే కచ్చితంగా రుణంతోపాటు వడ్డీ మొత్తం చెల్లించాల్సిందే. మళ్లీ రుణంగా కూడా అదే రోజు ఇవ్వరు. రుణం చెల్లించిన తర్వాత మరుసటి రోజు తిరిగి ఆ బంగారం ద్వారా రుణం నిబంధన పెట్టారు.

నిబంధనల్లో కీలక అంశాలు

లోన్-టు-వాల్యూ (%ూఎ%) నిష్పత్తి ప్రకారం బంగారం విలువలో 75 శాతం వరకు మాత్రమే రుణం పొందవచ్చు. రుణ మొత్తాన్ని వడ్డీతోసహా గరిష్ఠంగా 12 నెలల్లోగా చెల్లించాలి. ఈఎంఐ ఆధారిత రుణాలకు 36 నెలలు వరకు గడువు ఉన్నది. రుణం పునరుద్ధరించాలంటే కూడా కొన్ని షరతులు విధించింది. రుణం స్టాండర్డ్ స్థితిలో ఉండాలి. మొత్తం వడ్డీ చెల్లించబడి, కొత్త క్రెడిట్ అంచనా ఉండాలి. బంగారం విలువ నిర్ధారణ, వేలం ప్రక్రియలో పూర్తి పారదర్శకత తప్పనిసరిగా ఉండాలి. రుణ చెల్లింపు విఫలమైతే, బంగారం వేలం వేస్తారు. ఈ మేరకు రుణగ్రహీతకు సమాచారం ఇస్తారు. ఈ నిబంధనలు రుణగ్రహీతల రక్షణ, పారదర్శకతను పెంచడానికి ఉద్దేశించినవైనప్పటికీ, చెల్లింపు కాలం తగ్గడం, కఠిన షరతులు ప్రజలకు ఆర్థిక ఒత్తిడిని తెచ్చిపెట్టే ప్రమాదం ఉన్నది.

ఒక్కో బ్యాంకు ఒక్కో వడ్డీ

గోల్డ్ లోన్ల వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజులు కూడా బ్యాంకును బట్టి మారుతున్నాయి. కొన్ని బ్యాంకులు 88 శాతం వడ్డీ వేస్తే, మరికొన్ని కొంత ఎక్కువగా, మరికొన్ని తక్కువ వడ్డీలు విధిస్తున్నాయి. ప్రాసెసింగ్ ఫీజు విషయంలో కూడా వివిధ టారీఫ్‌లను కొనసాగిస్తున్నాయి. కొన్ని బ్యాంకులు 3 లక్షల వరకు ప్రాసెసింగ్ ఫీజు విధించకపోగా, మరికొన్ని బ్యాంకులు విధిస్తున్నాయి.

# ఆంధ్రప్రదేశ్

## పాపికొండల పర్యాటకుల భద్రతకు పెద్దపీట

### బోట్ల భద్రతను తనిఖీ చేసిన అధికారులు

దేవీపట్నం,జూన్15 : పాపికొండలు పర్యాటకుల భద్రత కోసం ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పర్యాటక బోట్లను అధికారులు విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోదావరిలో తిరిగే బోట్ల భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తున్నారు. ఇవాళ్టి నుంచి పాపికొండలు విహార యాత్రను తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దేవీపట్నం మండలం గండి పోచమ్మ ఆలయం వద్ద ఇటీవల సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన బోట్లను ఆర్డీవో స్వాతి తనిఖీ చేశారు. పర్యాటకులతో బయల్దేరిన బోటు మధ్యలో నిలిచిపోవడంపై ఆరా తీశారు. గండి పోచమ్మ బోటింగ్ పాయింట్ వద్ద సౌకర్యాలను ఆర్డీవో పరిశీలించారు. బోటు యజమానులు, పర్యాటక శాఖ అధికారులతో ఆర్డీవో సమావేశమయ్యారు. అన్నిబోట్ల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేసి సరిగా ఉన్నాకే నదిలో విహారానికి అనుమతివ్వాలని ఆదేశించారు. ప్రతి బోటుకూ ఫిట్‌నెస్ ధ్రువపత్రం తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## ఐదేళ్లలో సాగునీటి రంగాన్ని భ్రష్టు పట్టించిన జగన్

### వైసిపి అలసత్వంతో ప్రాజెక్టులు పూర్తిగా దెబ్బతిన్నాయి
### చంద్రబాబు కృషి వల్లనే సాగునీటి ప్రాజెక్టులకు జలకళ
### జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

కర్నూలు,జూన్15 : జగన్ హయాంలోని ఐదేళ్లలో ప్రాజెక్టుల పనులను నిర్లక్ష్యంగా వదిలేశారని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. వైసీపీ సర్కార్ అలసత్వంతో నీటి ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని ఆగ్రహించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటికీ రిజర్వాయర్లు, చెరువులు నిండుకుండలా ఉన్నాయంటే చంద్రబాబు వాటర్ మేనేజ్‌మెంట్ వల్లనే సాధ్యమైందని ఉద్ఘాటించారు. సోమవారం కర్నూలు ఎంపీ, జిల్లా కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, నియోజక వర్గాల ఇన్‌చార్జ్‌లు, ఇరిగేషన్ అధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. మొదటి ఏడాదిలోనే హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి, 248 రోజుల్లో 52 టీఎంసీలు తరలించి, రాయలసీమ జిల్లాల్లో రిజర్వాయర్లు, చెరువులను నింపామని పేర్కొన్నారు. కర్నూలు పశ్చిమ ప్రాంతం సాగు, తాగునీరుపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సూచించారని మంత్రి నిమ్మల తెలిపారు. కీలకమైన గుండ్రేవుల, ఆర్డీఎస్ రైట్ కెనాల్, గాజుల దిన్నె, వేదవతి, గురురాఘవేంద్ర ప్రాజెక్టులు పూర్తి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం నీటి ద్వారా 68 చెరువులు నింపేందుకు ఇప్పటికే రూ.228 కోట్లు ఖర్చు చేసి, 98 శాతం పనులు పూర్తి చేసి 67 చెరువులకు నీరందించామని తెలిపారు. జిల్లాలో 68 ట్యాంకుల పథకంలో భాగమైన జొన్నగిరి ట్యాంకుకు పైప్‌లైన్ నిర్మాణంపై అంచనాలు రూపొందిస్తున్నామని వివరించారు. గాజుల దిన్నె ప్రాజెక్టుకు భూసేకరణ, గేట్ల అమరిక, పెంచిన ఒక టీఎంసీ నీటి నిల్వకు అనుగుణంగా వేగంగా పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. 36 ప్రాధాన్యం గల ప్రాజెక్టుల్లో వేదవతి లిఫ్ట్ స్కీంను 2028 నాటికి పూర్తి చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు. వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం డీపీఆర్, అటవీ, పర్యావరణ అనుమతులు పొందే బాధ్యతను వ్యాప్కోస్ సంస్థకు అప్పగించామని మంత్రి నిమ్మల తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలోని నగరడోన రిజర్వాయర్‌లో ఆగిన పనులను మళ్లీ చేపట్టేలా ప్రణాళికలు రూపొందిస్తు న్నామని వివరించారు. గుండ్రేవుల, ఆర్డీఎస్ ప్రాజెక్టులకు సంబంధించి అంతర్రాష్ట్ర సమస్యలు పరిష్కరించేలా సంప్రదింపులు చేపట్టాలని నిర్ణయించామని అన్నారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టుకు సంబంధించి ప్రత్యేక మరమ్మతుల కోసం ప్రణాళిక రూపొందించి, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు సాగు, తాగు నీరందించేలా చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు.జగన్ హయాంలో గురు రాఘవేంద్ర లిఫ్ట్ స్కీమ్‌లో మోటార్లు దొంగలించినా పట్టించుకోలేదని మంత్రి నిమ్మల ధ్వజమెత్తారు. గోరకల్లు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయాలని నిపుణులు చెప్పినా వినకుండా జగన్ హయాంలో పనులను ప్రీ క్లోజర్ చేసిందని ఆగ్రహించారు. శ్రీశైలం ప్లంజ్ పూల్ మరమ్మతులకు గొడ్డలి పార్టీ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో రూ.203 కోట్లతో శ్రీశైలం డ్యాం మరమ్మతులు చేపట్టామని ప్రస్తావించారు. గోరకల్లు రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నీటిని నింపడానికి రూ.53 కోట్లతో టెండర్లు పిలిచామని తెలిపారు. ఒక్క సీజన్‌లోనే తుంగభద్ర డ్యాంకు రూ.51 కోట్లు ఖర్చుచేసి, 33 కొత్త గేట్లు అమర్చడం అరుదైన రికార్డు అని వ్యాఖ్యానించారు. ఈనెలాఖరులో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల సీఎంలు తుంగభద్ర డ్యాం గేట్లను ప్రారంభించబోతున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## ముగ్గురి ప్రాణాలు తీసిన ఫోటోషూట్ సరదా

చెరువలో పడి ముగ్గురు స్నేహితుల మృతి

మేడ్చల్,జూన్15 : మేడ్చల్ జిల్లా కీసర పోలీసుస్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్ కోసం ఫొటోషూట్‌కు వచ్చిన ముగ్గురు యువకులు చెరువులో మునిగి ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామంలోని బాణమ్మ చెరువు వద్ద సరదాగా ఫొటోలు, వీడియోలు తీసుకునేందుకు వచ్చిన ఆంటోనీ (18), జోసెఫ్ (18), టోనీ (17) ప్రమాదానికి గురయ్యారు. ఫొటోషూట్ సందర్భంగా నీటిలో పడిపోయిన హెడ్‌ఫోన్స్ తీసుకురావడానికి చెరువులోకి దిగిన యువకులు ప్రమాదవశాత్తూ నీటిలో గల్లంతయ్యారు. మృతులంతా బొల్లారం ప్రాంతానికి చెందిన స్నేహితులుగా పోలీసులు గుర్తించారు. ఇన్‌స్టాగ్రామ్ కోసం ప్రత్యేక ఫొటోలు దిగేందుకు చెరువు వద్దకు వచ్చిన వీరు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇద్దరు యువకుల మృతదేహాలను వెలికితీశారు. మరో యువకుడి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. సరదాగా వెళ్లిన ముగ్గురు స్నేహితులు ఒకేసారి ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేటప్పుడు యువత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. సోషల్ మీడియా కోసం ప్రాణాలకు ముప్పు కలిగించే సాహసాలకు దూరంగా ఉండాలని మేడ్చల్ జిల్లా పోలీసులు హెచ్చరించారు.

## సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో చంద్రబాబు భేటీ

### టెక్నాలజీ, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, ఏఐపై చర్చ
### దాదాపు 30 నిముషాల పాటు ప్రధానితో బాబు భేటీ



అమరావతి,జూన్15 : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, పెట్టుబడులు, సాంకేతిక రంగ సహకారం, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి కీలక అంశాలపైసిఎం చంద్రబాబు చర్చించారు. ఏపీ అభివృద్ధికి అవసరమైన టెక్నాలజీ, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాల్లో సహకారం అందించాలని సీఎం చంద్రబాబు సింగపూర్ ప్రధానిని కోరారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ తో సోమవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. సింగపూర్ ప్రధాని అధికారిక నివాసంలో సుమారు 30 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీలో ముఖ్యంగా సెమీకండక్టర్ తయారీ ఎకోసిస్టమ్ అభివృద్ధి, నైపుణ్యాల పెంపు అంశాల్లో సింగపూర్ మద్దతు అవసరమని వివరించారు. అమరావతి సహా రాష్ట్రంలోని వివిధ నగరాలు, పట్టణాల్లో అర్బన్ గవర్నెన్స్, నగర ప్రణాళిక, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనలో భాగస్వామ్యం కావాలని సీఎం కోరారు. ఈ సందర్భంగా అమరావతి రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై సింగపూర్ ప్రధాని ప్రత్యేక ఆసక్తి చూపించారు. విద్యా సంస్థలు, అంతర్జాతీయ ప్రమాణాలతో చేపడుతున్న మౌలిక సదుపాయాల నిర్మాణాల గురించి లారెన్స్ వాంగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.భవిష్యత్తులో అమరావతి ప్రపంచ స్థాయి నివాసయోగ్య నగరాల సరసన నిలుస్తుందని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో ప్రజారోగ్య రంగం అభివృద్ధి, జనాభా నిర్వహణకు సంబంధించిన చర్యలను కూడా వివరించారు. వ్యవసాయ రంగంపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి సేద్యం ద్వారా వ్యవసాయం చేస్తున్న విషయాన్ని సీఎం ప్రస్తావించారు. రాష్ట్రంలోని ఉద్యానవన, ఆక్వా ఉత్పత్తులను సింగపూర్ దిగుమతి చేసుకునే అవకాశాలను పరిశీలించాలని కోరారు. ప్రకృతి సేద్యం ఉత్పత్తులకు అంతర్జాతీయ ప్రమాణాల సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ వ్యవస్థలను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. పోర్టులు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధితో పాటు వాణిజ్య, పారిశ్రామిక అవకాశాలను మరింత విస్తరించేందుకు ఆంధ్రప్రదేశ్, సింగపూర్ కలిసి పనిచేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. రాష్ట్రం 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గుదల, అందుబాటు గృహ నిర్మాణం, శిశువులు, చిన్నారుల సంరక్షణ వంటి సామాజిక అంశాలపై కూడా ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. సేవల రంగం తరహాలోనే తయారీ, సరఫరా గొలుసు (సప్లై చైన్) రంగాలు కూడా భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని ఇద్దరు నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ భేటీ ద్వారా ఆంధ్రప్రదేశ్?సింగపూర్ సంబంధాలు మరింత బలోపేతం కావడంతో పాటు పెట్టుబడులు, సాంకేతిక సహకారం, పట్టణాభివృద్ధి, వ్యవసాయ ఎగుమతుల రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందని ఇరువురు నేతలు భావిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటనలో భాగంగా సింగపూర్‌కి చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి తెలుగు ప్రజలు, ప్రవాస భారతీయులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చంద్రబాబు ఓ పోస్టు పెట్టరు. తనకు, తన బృందానికి ఆత్మీయ స్వాగతం పలికిన తెలుగు ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి చూపించిన ప్రేమాభిమానాలు తనకు ఎంతో ఆనందాన్ని కలిగించాయని పేర్కొన్నారు.

## హోంమంత్రి అనితపై వ్యాఖ్యలు దారుణం

### గుడివాడ తక్షణం క్షమాపణలు చెప్పాల్సిందే
### టిడిపి ఎపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు డిమాండ్

విశాఖపట్నం,జూన్15 : మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌పై తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంమంత్రి వంగలపూడి అనితపై అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు మహిళా లోకాన్ని అవమానించేలా ఉన్నాయని ధ్వజమెత్తారు, సోమవారం విశాఖపట్నం వేదికగా పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. ఒక మహిళా మంత్రిని లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత దూషణలకు దిగడం వైసీపీ సంస్కారహీన, దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా అమర్‌నాథ్ వ్యాఖ్యలు ఉన్నాయని పల్లా శ్రీనివాసరావు ఆగ్రహించారు. మహిళా సాధికారత గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీ నాయకులకు లేదని ధ్వజమెత్తారు. గొడ్డలి పార్టీ నేతల మాటల్లో మహిళల పట్ల గౌరవం, బాధ్యత పూర్తిగా లోపించాయని మండిపడ్డారు. గుడివాడ అమర్‌నాథ్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల గౌరవం, ఆత్మాభిమానాన్ని కాపాడేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. వైసీపీ నేతల విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలని హితవు పలికారు.హోంమంత్రి అనితపై గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. అలంకరణ అనేది ఆడవాళ్లకు ఆభరణమని అలాంటి అలంకరణపై అమర్‌నాథ్ వ్యాఖ్యలు చేయడం సరికాదని చెప్పుకొచ్చారు. ఒక దళిత మహిళా కార్యకర్త స్థాయి నుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎదిగిన అనిత తీరుని మనం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఇలా మానసిక క్షోభను గురి చేసే విమర్శలను చేయడం సరికాదని పేర్కొన్నారు. గుడివాడ అమర్నాథ్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని.. భేషరతుగా అనితకు క్షమాపణ చెప్పాలని పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

## దేశంలోనే అతిపెద్దది మద్యం కుంభకోణం

### ఇందులో 50మందికి పైగా ముద్దాయిలు
### జగన్ ప్రధాన సూత్రధారి అంటూ మంత్రి రవీంద్ర విమర్శలు

అమరావతి,జూన్15 : ఏపీ లిక్కర్ స్కాం భారతదేశంలోనే అతిపెద్ద కుంభకోణమని ఏపీ ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. ఈ కుంభకోణంలో 50మందికి పైగా ముద్దాయిలు ఉన్నారని తెలిపారు. మద్యం కుంభకోణంలో సూత్రదారులెవ్వరూ తప్పించుకోలేరని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. ఇందులో ప్రధాన దోషి జగన్ అంటూ వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అమరావతి వేదికగా మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. జగన్ నేతృత్వంలో జరిగిన అక్రమాల్లో మరిన్ని అసలు వాస్తవాలు త్వరలోనే బయటకు వస్తాయని చెప్పుకొచ్చారు. ఈడీ కూడా దీనిపై విచారణ చేపట్టడంతో కొత్త పేర్లు కూడా బయటకు వస్తాయని తెలిపారు. అస్తవ్యస్త విధానాలతో ఎక్సైజ్ శాఖను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వ విధానాలతో ప్రజల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు ఎక్సైజ్ ఆదాయం గణనీయంగా పడిపోయిందని మండిపడ్డారు. సొంత బ్రాండ్ల ప్రమోషన్ కోసం నాణ్యమైన బ్రాండ్లను తొక్కేశారని దుయ్యబట్టారు. డిజిటల్ పేమెంట్లు లేకుండా పారదర్శకత దెబ్బతీశారన్ని ÷ర్ అయ్యారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నూతన ఎక్సైజ్ పాలసీ ద్వారా వ్యవస్థను సరి చేశామని స్పష్టం చేశారు. మద్యం అక్రమాలపై సిట్ విచారణ పారదర్శకంగా జరుగుతోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తున్న మద్యం పాలసీపై మాజీ మంత్రి జోగిరమేశ్ నేతృత్వంలో వైసీపీ నేతలు చెడ్డపేరు తీసుకురావాలని చూసి అడ్డంగా దొరికిపోయారని ఆగ్రహించారు. 13రకాల పరీక్షల తర్వాతే నాణ్యమైన మద్యాన్ని బయటకు పంపుతూ ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## దేశ సమగ్రత, శ్రేయస్సు లక్ష్యంగా జనసేన ఆవిర్భావం

### 12 ఏళ్ల ప్రస్థానంలో అనేక పోరాటాలు..విజయాలు..పరాజయాలు
### జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం సభలో పవన్ కళ్యాణ్

న్యూఢిల్లీ,జూన్15 : జనసేన ప్రారంభించినప్పుడు దేశ సమగ్రత, శ్రేయస్సు తప్ప.. తనకు ఏ ఆలోచనా లేదని ఆ పార్టీ అధ్యక్షుడు, డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. పార్టీ స్థాపించినప్పుడు అధికారం వస్తుందో, రాదో కూడా తెలియదన్నారు. 'జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం' పేరిట ఢిల్లీలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. పార్టీ స్థాపించి 12 ఏళ్లు పూర్తయిందని, ఈ ప్రయాణంలో చాలా పోరాటాలు చేశామని, పరాజయాలు ఎదుర్కొన్నామని చెప్పారు.మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా 7 ప్రాథమిక సూత్రాలను వదల్లేదు. నిర్దిష్ట ఆచరణాత్మక విధానంతో 21 ఎమ్మెల్యే స్థానాలు, 3 ఎంపీ స్థానాలను సాధించాం. లక్ష మంది సభ్యత్వంతో ప్రారంభమైన పార్టీకి.. 20 లక్షలకుపైగా సభ్యత్వాలు వచ్చాయి. ఇటీవల కాలంలో అన్ని ప్రాంతాల నుంచి వేల మంది పార్టీలో చేరుతున్నారు. పార్టీ ప్రయోజనాల కంటే.. దేశ సమగ్రతకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం. దేశ స్ఫూర్తిని కాపాడుకోవడం ఒక రోజుతో అయ్యే పని కాదు. దేశ స్ఫూర్తిని ప్రతితరం ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ఏనాడూ జనసేన అడ్డు చెప్పలేదని పవన్ మరోమారు స్పష్టం చేశారు. 2014లో ఏపీని విభజించిన తీరును చూసి మాత్రమే ఆవేదన వ్యక్తం చేశాం. విభజన విషయంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరు.. అసంతృప్తిని, అశాంతిని సృష్టించింది. అప్పటి నుంచి ఇప్పటికీ వారి ధోరణి మారలేదు. జనసేన సభకు అనుమతివ్వకుండా అడ్డుకోవడమే అందుకు ఉదాహరణ. ఢిల్లీ మెడలు వంచుతాం.. తడాఖా చూపిస్తామంటూ చాలామంది పెద్దలు మాటలు చెబుతారు. వాస్తవానికి అలాంటి నేతలు ఢిల్లీకి రాగానే వెనక్కి తగ్గుతారు. చాలాసార్లు మనకు మనం తక్కువగా అంచనా వేసుకుంటాం. ప్రతి వ్యక్తి కూడా సమాజంలో మార్పు తీసుకురావొచ్చు. ఈ మధ్య కాక్రోచ్ పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో చూస్తున్నాం. కాక్రోచ్ పార్టీని చూస్తే.. చలిచీమల పద్యం గుర్తుకొచ్చింది. చలిచీమలు కూడా బలమైన పామును చంపేస్తాయని పవన్ అన్నారు. ఈ సమావేశంలో మొత్తం ఐదు కీలక తీర్మానాలని ఆమోదించారు. పార్టీ సిద్ధాంతాలు, దేశ అభివృద్ధి దృష్టికోణం, ప్రజాస్వామ్య విలువలు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి లక్ష్యాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో 'వికసిత్ భారత్ ఆకాంక్షల నుంచి విజయాల వైపు' అనే తీర్మానాన్ని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రతిపాదించారు. ఈ తీర్మానం ప్రధానంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో గత 12 ఏళ్ల సుపరిపాలనను ప్రశంసిస్తూ, ఈ కాలాన్ని దేశ ప్రజాస్వామ్య వికాసంలో ఒక కీలక అధ్యాయంగా పేర్కొన్నారు. జనసేన పార్టీ 'నేషన్ ఫస్ట్' సిద్ధాంతాన్ని బలంగా విశ్వసిస్తుందని మొదటి తీర్మానంలో స్పష్టం చేశారు. దేశ సమగ్రత, ఐక్యత, జాతీయ దృక్పథం, ప్రతి పౌరునికి సమాన న్యాయం వంటి విలువలపై పార్టీకి అచంచలమైన నిబద్ధత ఉందని పేర్కొన్నారు. కులం, మతం, భాష, ప్రాంతాలకు అతీతంగా భారతదేశ వైవిధ్యంలో ఏకత్వమే దేశ బలమని ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారు. మూడో తీర్మానంగా 'సంక్షోభం నుంచి నమ్మకం వైపు ..ఆంధ్రప్రదేశ్‌లో రెండేళ్ల పునర్నిర్మాణం, సంక్షేమం, అభివృద్ధి' అనే అంశాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్ర అభివృద్ధి, పాలనా సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలపై పార్టీ భవిష్యత్తు దిశను ఈ తీర్మానం వివరించింది. నాలుగో తీర్మానంగా 'జనసేన పుష్కర కాల ప్రస్థానం ? త్యాగం, సేవ, ప్రజల నమ్మకం' అనే అంశాన్ని ఆమోదించారు. సామాజిక మార్పు, నైతిక రాజకీయాలు, సమాన అభివృద్ధి లక్ష్యాలతో ప్రారంభమైన జనసేన పార్టీ 12 ఏళ్ల ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. మొత్తం ఐదు తీర్మానాల ద్వారా జనసేన పార్టీ తన రాజకీయ సిద్ధాంతాలను, అభివృద్ధి దృక్పథాన్ని, దేశ సమైక్యతపై నిబద్ధతను మరింత స్పష్టంగా ప్రకటించినట్లు సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశం పార్టీ భవిష్యత్తు కార్యాచరణకు దిశానిర్దేశర చేస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. జాతీయవాదం, దేశ సమైక్యత, వికసిత్ భారత్ లక్ష్యాలు, ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం, యువత ఆకాంక్షలు వంటి కీలక అంశాలపై విస్తృత చర్చలకు వేదికగా నిలిచింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి వచ్చిన పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి, సుపరిపాలన, జాతీయ భద్రత రంగాల్లో సాధించిన పురోగతిని ప్రస్తావించారు.

## నేషన్ ఫస్ట్ లక్ష్యంతో జనసేన అడుగులు

### మోడీ అడుగుజాడల్లో పవన్ కల్యాణ్ జాతీయవాదం
### జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం సభలో నేతలు

న్యూఢిల్లీ,జూన్15 : ప్రధాని మోడీ నాయకత్వంలో భారత్ సురక్షితమైన, బలమైన దేశంగా ఎదిగిందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఢల్లీ సభలో ఆయన మాట్లాడుతూ.. డిజిటలైజేషన్, ఆర్థిక అభివృద్ధి, మహిళా సాధికారత, యువతకు అవకాశాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని పేర్కొన్నారు. మోడీ అడుగుజాడల్లో పవన్ కల్యాణ్ జాతీయవాద దిశగా ప్రయాణిస్తున్నారని తెలిపారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ, రాజకీయాలు జాతి నిర్మాణం కోసం ఉండాలని పవన్ కల్యాణ్ నమ్ముతున్నారని చెప్పారు. కులం, మతం, ప్రాంతీయత పేరుతో ప్రజలను విభజించడం కాకుండా దేశ ప్రజలందరినీ ఏకం చేయడమే ఆయన లక్ష్యమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు వినియోగించుకునే స్వేచ్ఛ ఉండాలని అన్నారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, జనసేన పార్టీకి దేశ ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. పార్టీ కంటే దేశం, ప్రజల భద్రత, సంక్షేమమే ముఖ్యమనే సిద్ధాంతంతో జనసేన ముందుకు సాగుతోందన్నారు. భారతదేశ వైవిధ్యమే దేశ బలమని, ఆ భావనను బలోపేతం చేయడమే ఈ సమావేశం ఉద్దేశమని చెప్పారు. జనసేన ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు మాట్లాడుతూ, జనసేన బలమైన సిద్ధాంతాలపై నిర్మితమైన పార్టీ అని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ పార్టీని ఏడు ప్రధాన సిద్ధాంతాల ఆధారంగా ముందుకు నడిపిస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలపై పోరాటం, దేశభక్తి, జాతీయ సమైక్యత వంటి అంశాలు జనసేనకు మూల సూత్రాలని వివరించారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుతం రాజకీయాల్లో అధికారం కోసం పోటీ ఎక్కువగా కనిపిస్తున్న సమయంలో దేశం ఎలా అభివృద్ధి చెందాలనే ఆలోచనతో పనిచేసే నాయకులు అరుదుగా ఉంటారని అన్నారు. అలాంటి నాయకత్వానికి పవన్ కల్యాణ్ నిదర్శనమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, పెట్టుబడుల సాధనలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఇక, సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ, దేశ సమైక్యతకు ముప్పు కలిగించే విభజనవాద శక్తులను ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. 'నేషన్ ఫస్ట్' సిద్ధాంతంతో దేశ ప్రజలందరినీ ఏకం చేసే దిశగా పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు తెలిపారు. జనసేన పార్టీ 12 ఏళ్ల ప్రస్థానాన్ని గుర్తు చేస్తూ, సామాజిక మార్పు, నైతిక రాజకీయాలు, ప్రజా సేవ అనే లక్ష్యాలతో ప్రారంభమైన పార్టీ నేడు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో జనసేన దక్షిణ భారతదేశంలో మరింత బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## తృణమూల్ ఎమ్మెల్యే కునాల్‌పై కోడిగుడ్ల దాడి

వారి అక్రమాలకు ఇదే శాస్తి అన్న దాడిచేసిన వ్యక్తి

కోల్‌కతా,జూన్15 : తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కునాల్ ఘోష్‌పై కోల్‌కతాలో సోమవారం కోడిగుడ్లతో దాడి జరిగింది. టీఎంసీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ నివాసం నుంచి ఆయన బయటకు వస్తుండగా స్థానిక యువకుడు గుడ్లతో దాడి చేశాడు. ఆపని చేసింది తానేనని ఒప్పుకుంటూనే తన చర్యను అతను సమర్థించుకున్నాడు. 'వాళ్లు ప్రజలపై అనేక అకృత్యాలు చేసారు. కునాల్ ఘోష్ తక్కువేం కాదు. అందుకు తగిన శాస్తే జరిగింది. మా పట్ల చాలా తప్పిదాలు చేశారు' అని చందన్ తెలిపాడు. ఈ ఘటనపై టీఎంసీ, కునాల్ ఘోష్ వెంటనే ఎలాంటి ప్రకటన చేయలేదు. కొద్దిరోజుల క్రితం టీఎంసీ సీనియర్ నేత, ఎమ్మెల్యే మదన్ మిత్రా సైతం కమర్హతిలోని అరియాదహ ప్రాంతంలో ఇలాంటి నిరసననే ఎదుర్కొన్నారు. మదన్ మిత్రా ఆ ప్రాంతంలో పర్యటనకు వచ్చినప్పుడు స్థానికులు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కాన్వాయ్‌పై గుడ్లు విసిరారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో మదన్ మిత్రా కాన్వాయ్ అక్కడి నుంచి వెళ్లిపోయింది. టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటు సభ్యుడు అభిషేక్ బెనర్జీపై కూడా ఇటీవల సోనార్‌పూర్‌లో స్థానికులు గుడ్లు, రాళ్లు విసిరారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. స్థానిక సమస్యలపై అభిషేక్‌ను నిలదీస్తూ ఘర్షణకు దిగారు. పలు జిల్లాల్లోనూ ఇలాంటి నిరసన ప్రదర్శనలు గత కొద్దివారాలుగా చోటుచేసుకుంటున్నాయి.




# వెంకటేశ్, కళ్యాణ్ రామ్ కాంబో

## మరో సినిమా ప్లాన్ చేస్తున్న అనిల్ రావిపూడి

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి మరో భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ముఖ్యంగా సంక్రాంతి సీజన్‌లో ఆయన సినిమాలకు ప్రత్యేక క్రేజ్ ఏర్పడింది. 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి వరుస విజయాల తర్వాత అనిల్ రావిపూడి ఇప్పుడు విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్‌లతో కలిసి ఓ క్రేజీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే వెంకటేష్‌తో 'ఎఫ్2', 'ఎఫ్3' వంటి విజయవంతమైన చిత్రాలు అందించిన అనిల్, కళ్యాణ్ రామ్‌తో తన తొలి చిత్రం 'పటాస్' ద్వారా సూపర్ హిట్ అందుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరు హీరోలను ఒకే సినిమాలో చూపించబోతుండటంతో ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రీ-ప్రొడక్షన్ పనులు కూడా దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయని సమాచారం. పూర్తి స్థాయి యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సినిమా టైటిల్‌కు సంబంధించి ఆసక్తికరమైన ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పండుగ వాతావరణం, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్, అనిల్ రావిపూడి స్టైల్ కామెడీకి సరిపోయేలా ఈ చిత్రానికి 'సంక్రాంతి సరుకు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ టైటిల్ మాస్, ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'సింగ్ గీతం' గోల్డెన్ బ్లాక్‌బస్టర్ ఈవెంట్‌లో అనిల్ రావిపూడి చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్‌గా మారాయి. ఈ చిత్ర విజయోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, నిర్మాత నాగ్ అశ్విన్‌పై ప్రశంసలు కురిపించారు. సాధారణంగా మేము ట్రైలర్లు, ప్రమోషన్లతో సినిమాపై హైప్ క్రియేట్ చేయడానికి చాలా కష్టపడతాం. కానీ నాగ్ అశ్విన్ మాత్రం ట్రైలర్ లేకుండానే సినిమాను విడుదల చేసి విజయం సాధించారు. ఆ ఫార్ములా నాకు బాగా నచ్చింది. ఇకపై నా సినిమాలకు కూడా ట్రైలర్లు కట్ చేయను అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.



# కరుప్ప విజయంతో మరింత బిజీగా త్రిష


## రెమ్యునరేషన్ కూడా పెంచినట్లు టాక్

సౌత్ సినీ ఇండస్ట్రీలో రెండు దశాబ్దాలకు పైగా తన స్టార్‌డమ్‌ను నిలబెట్టుకున్న హీరోయిన్ త్రిష మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం ఆమె రెమ్యూనరేషన్‌కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వరుస విజయాలతో కెరీర్‌లో మళ్లీ బిజీ అయిన త్రిష, కొత్త సినిమాల కోసం తన పారితోషికాన్ని పెంచినట్లు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. త్రిష కెరీర్‌ను పరిశీలిస్తే ఎన్నో విజయాలతో పాటు కొన్ని పరాజయాలు కూడా ఎదురయ్యాయి. అయితే ప్రతిసారి చిన్న విరామం తర్వాత ఆమె మరింత బలంగా తిరిగి వచ్చి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇదే కారణంగా ఆమెను సౌత్ ఇండస్ట్రీలో అత్యంత నిలకడైన హీరోయిన్లలో ఒకరిగా భావిస్తారు. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించకపోయినా, తాజాగా కరుప్పు వంటి భారీ హిట్‌తో త్రిష మార్కెట్ మళ్లీ ఊపందుకుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆమె కెరీర్‌లో మరో గోల్డెన్ ఫేజ్ నడుస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పెద్ద హీరోల సరసన అవకాశాలు రావడం, పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పెరగడం, ప్రేక్షకుల్లో ఇప్పటికీ మంచి ఆదరణ ఉండటం ఆమె క్రేజ్‌కు ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు. యువ హీరోయిన్ల నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ, తన అనుభవం, నటన, స్క్రీన్ ప్రెజెన్స్‌తో త్రిష ప్రత్యేక స్థానాన్ని కొనసాగిస్తున్నారు. అందుకే నిర్మాతలు ఇప్పటికీ ఆమెను తమ ప్రాజెక్టుల్లో భాగం చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని సమాచారం. ముఖ్యంగా తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి రూపొందే ద్విభాషా చిత్రాల కోసం ఆమెను సంప్రదిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే త్రిష తన రెమ్యూనరేషన్‌ను కూడా పెంచినట్లు వార్తలు వెలువడు తున్నాయి. మరోవైపు త్రిష చేతిలో ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు ఉన్నాయి.



# సల్మాన్‌తో రాజ్ నిడుమోరు చిత్రం

'ది ఫ్యామిలీ మ్యాన్', 'ఫర్జీ' వంటి సూపర్ హిట్ సిరీస్‌లకు దర్శకత్వం వహించిన రాజ్ నిడిమోరు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ సినిమాకు సిద్ధమవుతున్నారు. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో రాజ్ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. 'ఒక హాలీవుడ్ సినిమా స్క్రిప్ట్ ఇప్పుడే మొదలైంది, అది ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది. మరో సిరీస్ కూడా అభివృద్ధి దశలో ఉంది. మా హిందీ సినిమా నిర్మాణం త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను దృష్టిలోపెట్టుకొని, భారీ బడ్జెట్‌తో ఈ సూపర్ సినిమా రూపొందిస్తున్నారు. అక్టోబర్‌లో ఈ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తారని సమాచారం. అయితే ఈ విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. గతంలోనూ ఈ సినిమా గురించి వార్తలు ప్రచారమయ్యాయి. ఈ చిత్రంలో రాజ్ భార్య సమంత హీరోయిన్‌గా నటించే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. అయితే, వాటిని రాజ్ సన్నిహిత వర్గాలు కొట్టిపారేశాయి. ఇక, సల్మాన్ ప్రస్తుతం దర్శకుడు వంశీ పైడిపల్లి, నిర్మాత దిల్‌రాజు కాంబినేషన్‌లో వస్తున్న మూవీలో షూటింగ్‌లో బిజీగా ఉన్నారు.




# పెద్ది కలెక్షన్ల దూకుడు

## మొత్తం రూ.307.98 కోట్ల గ్రాస్ కలెక్షన్లు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతూ వసూళ్ల పరంగా కూడా సత్తా చాటుతోంది. మొదటి వారం తర్వాత వీక్‌డేస్‌లో కొంత మందగించిన కలెక్షన్లు, రెండో వీకెండ్‌లో మళ్లీ ఊపందుకోవడం విశేషం. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, విడుదలైన 11వ రోజు ఆదివారం 'పెద్ది' మరోసారి బలమైన ప్రదర్శన కనబరిచింది. దేశవ్యాప్తంగా సుమారు 4,133 షోల ద్వారా రూ.9.20 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించినట్లు సమాచారం. దీంతో భారతీయ బాక్సాఫీస్ వద్ద 11 రోజుల్లో ఈ చిత్రం రూ.216 కోట్ల నెట్, రూ.256.23 కోట్ల గ్రాస్ వసూళ్లను నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'పెద్ది' మంచి స్పందనను అందుకుంటోంది. విదేశీ మార్కెట్లలో ఇప్పటివరకు సుమారు రూ.51.75 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ రిపోర్ట్స్ చెబుతున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా మొత్తం రూ.307.98 కోట్ల గ్రాస్ కలెక్షన్లను తన ఖాతాలో వేసుకున్నట్లు సమాచారం. మరోవైపు చిత్ర బృందం మాత్రం మొత్తం వసూళ్లు రూ.393 కోట్లకు చేరుకున్నాయని ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి సుమారు రూ.195.30 కోట్ల గ్రాస్ వసూళ్లు నమోదైనట్లు సమాచారం. ఇది సినిమా విజయానికి కీలకంగా మారిందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. రెండో వీకెండ్‌లో కలెక్షన్లు మళ్లీ జోరందుకోవడంతో 'పెద్ది' మరిన్ని రికార్డుల దిశగా పయనిస్తోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఫుల్ రన్ ముగిసే నాటికి రామ్ చరణ్ కెరీర్‌లోనే అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నాగార్జునతో చేతులు కలపనున్న అనిల్

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి మరో ఆసక్తికరమైన కాంబినేషన్‌కు సిద్ధమవుతున్నాడని, తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు చూస్తే అక్కినేని నాగార్జునతో సినిమా దాదాపు ఖాయమైనట్లే కనిపిస్తోంది. ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అనిల్ రావిపూడి తన కెరీర్‌లో ఇప్పటికే పలువురు అగ్ర హీరోలతో కలిసి బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించారు. ముఖ్యంగా సీనియర్ స్టార్ హీరోలైన మెగాస్టార్ చిరంజీవి, నటసింహం బాలకృష్ణ, విక్టరీ వెంకటేష్‌లతో సినిమాలు చేసి విజయాలు సాధించారు. దీంతో టాలీవుడ్‌లో ఒకే తరం నలుగురు అగ్ర హీరోలతో పనిచేసే అరుదైన అవకాశానికి ఆయన మరింత చేరువయ్యారు.
గతంలో నాగార్జున-అనిల్ రావిపూడి కాంబినేషన్‌పై అనేక వార్తలు వచ్చినప్పటికీ అవి ప్రచారాలుగానే మిగిలిపోయాయి. అయితే తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనిల్ రావిపూడి చేసిన వ్యాఖ్యలు మరోసారి ఈ కాంబినేషన్‌ను వార్తల్లోకి తెచ్చాయి. ఒక షో ప్రమోషన్స్ సందర్భంగా సీనియర్ నటి రాధ మాట్లాడుతూ,నేను చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జునలతో సినిమాలు చేశాను అని చెప్పగా, వెంటనే స్పందించిన అనిల్ రావిపూడి చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్‌లతో తాను చేసిన సినిమాల పేర్లను ప్రస్తావించారు. అనంతరం 'నాగార్జున గారితో మనం త్వరలో తీయబోతున్నాం' అని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ మాటలే ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. తాజా సమాచారం ప్రకారం, నాగార్జున 101వ చిత్రాన్ని అనిల్ రావిపూడి దర్శకత్వం వహించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా ఈ సినిమాను 2028 సంక్రాంతి కానుకగా విడుదల చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.





# వివాహ వార్షికోత్సవంలో పిల్ల చేతులతో పోస్ట్

## ఉపాసన పోస్ట్‌తో అభిమానుల్లో ఆనందం

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌కు ప్రస్తుతం డబుల్ సెలబ్రేషన్స్ నడుస్తున్నాయి. ఒకవైపు ఆయన నటించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తుండగా, మరోవైపు జూన్ 14న రామ్ చరణ్-ఉపాసన దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. దీంతో మెగా అభిమానుల్లో ఆనందం రెట్టింపైంది.అయితే రామ్ చరణ్, ఉపాసన దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా అభిమానులు సోషల్ మీడియాలో శుభాకాంక్షల వర్షం కురిపించారు. 2012 జూన్ 14న వివాహ బంధంతో ఒక్కటైన ఈ జంట, టాలీవుడ్‌లో అత్యంత అభిమానించబడే సెలబ్రిటీ కపుల్స్‌లో ఒకరిగా నిలిచింది. ఈ ప్రత్యేక సందర్భంగా ఉపాసన కొణిదెల సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ అభిమానులను భావోద్వేగానికి గురి చేసింది. తమ ముగ్గురు పిల్లల చిన్న చేతులను చూపిస్తూ ఓ అందమైన ఫోటోను ఆమె పంచుకున్నారు. కుటుంబ బంధాలను ప్రతిబింబించే ఈ పోస్ట్ క్షణాల్లోనే వైరల్‌గా మారింది. ఇప్పటికే రామ్ చరణ్-ఉపాసన దంపతులకు కుమార్తె క్లింకార ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవల వారి కుటుంబంలోకి కవల పిల్లలు కూడా చేరడంతో ఆనందం మరింత పెరిగింది. తాజా ఫోటోలో ముగ్గురు చిన్నారుల చేతులు కనిపించడంతో అభిమానులు మురిసిపోతున్నారు. 'పెద్ది' విజయం, ఇటు వివాహ వార్షికోత్సవం, కుటుంబ ఆనందాలు.. ఇలా అన్ని శుభ పరిణామాలు ఒకేసారి రావడంతో రామ్ చరణ్ కుటుంబంలో ప్రస్తుతం పండుగ వాతావరణం నెలకొంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor,
MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published
at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell :
7989575563, Mail:thecrimenews123@gmail.com